# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:14 సంచిక:12 166 డిసెంబర్ 2024 హైదరాబాద్

UGC CARE LISTED JOURNAL

- వర్తమానకాలంలో అధ్యయన సంస్కృతి
- అటవీ ప్రాంతాల్లో ఖనిజాల వెలికితీతవాదం, దోపిడి
- ఇంతవరకు అచ్చమైన గిరిజన కథ రాలేదు
- అపూర్వ తెలంగాణ సాంస్కృతిక పదకోశం
- పేరిణి శివతాండవం వీరశౌర్యాలకు ప్రతీకనా? హాస్యరసభరితమా?



# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

డిసెంబర్ 2024

సంచిక : 12

సంపుటి : 14

UGC APPROVED JOURNAL

UGC CARE LISTED JOURNAL



గౌరవ సంపాదకులు

**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి

**అల్లం నారాయణ**

చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

**ప్రొఫెసర్ గణేష్**

ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

సంపాదకురాలు

**స్నేహలత ఎం.**

సంపాదకవర్గం

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,** ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

**క్రాంతి,** జర్నలిస్టు

**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ

కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు పంపాల్సిన చిరునామా

**స్నేహలత ఎం.,**

ఇంటి నెం. 2-95, ఫ్లాట్ నెం. 301,

వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం. 2,

కాకతీయ నగర్, హబ్సిగూడ

హైదరాబాద్-500 007.

మెయిల్: nadusthunnatelangana@gmail.com

**ఫోన్ నెం.: 9290745490**


## సంపాదకుని ఉత్తరం

ఆకురాలు కాలంలో
జీవితం చిగురించటం
ఒక ఆశ

వాలిపోతున్న పొద్దులో
సూర్యుడు ఉదయించటం
ఒక వేకువ

పల్లవిస్తున్న ప్రేమలో
రాసుకున్న గీతం
ఒక జ్ఞాపకం

అమ్మపాల పొదుగులో
సేదతీరుతున్న శిశువు
ఒక కొనసాగింపు

ఒరిగిపోయిన వీరుడి చేతిలో
గురిపెట్టిన ట్రిగ్గర్
ఒక యుద్ధం

31 డిసెంబర్, 2024

*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ

**సంపాదకీయం**

వర్తమాన కాలంలో అధ్యయన సంస్కృతి | **ఇమ్మిడి మహేందర్** | 5

**సామాజికం**

అటవీ ప్రాంతాల్లో ఖనిజాల వెలికితీతవాదం,దోపిడి | **డా॥వెంకటేష్ వడిత్య** | 6

మనుస్మృతి – రాజ్యాంగం | **డా॥హారతి వాగీశన్** | 15

ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్స్: తెలంగాణ కులగణన సర్వే–సవాళ్లు | **సురేష్ గదపాటి, ప్రొఫెసర్ శామన్న** | 19

సహకారం అందని చేనేత మహిళ | **డా.ఎ.కళ్యాణి** | 22

**తొవ్వ ముచ్చట**

"ఇంతవరకూ అచ్చమైన గిరిజన కథ రాలేదు"–గంటేడు గౌరునాయుడు | **సారిపల్లి నాగరాజు** | 24

**పరిశోధన**

పేరిణి శివతాండవం వీరశౌర్యాలకు ప్రతీకనా? హాస్యరసభరితమా? | **డా.రామకృష్ణ వి.** | 32

తెలంగాణ చారిత్రక నాటకాలు – అధ్యయనం | **పర్లపల్లి శ్రీశైలం** | 40

**విమర్శ**

దళిత స్త్రీవాద అస్తిత్వ చైతన్య వికాసానికి మిళింద కథల చేర్పు | **ఇమ్మిడి మహేందర్** | 37

**సమీక్ష**

అపూర్వ తెలంగాణ సాంస్కృతిక పదకోశం | **డా॥డి.ఉదయ్‌భాను** | 43

దళిత జీవన చిత్రణ 'పాలేరు' | **డా॥బండారి ప్రేమ్‌కుమార్** | 44

**పల్లెసుద్దులు**

పల్లె మొత్తం పట్నంబోతుంది | **రవి కుర్మకోరె** | 47

**పరిశోధన పరిచయం**

దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు–పరిశీలన | **డా॥ఎం.శంకర్** | 49

సంపాదకీయం

# వర్తమాన కాలంలో అధ్యయన సంస్కృతి

ఇమ్మిడి మహేందర్

ఈ ప్రకృతిలో మనుషులు పుట్టి కొంతకాలమే అయింది. పుట్టిన అనతికాలంలోనే ప్రకృతి తత్వాన్ని తెలుసుకోవడం మొదలుపెట్టారు. ప్రకృతిని అధ్యయనం చేయడం ద్వారానే విజ్ఞానవంతులు అయ్యారు. ప్రకృతి చెప్పిన రహస్యాలను విన్నారు. ప్రకృతి తమకు చెప్పలేకపోయిన విషయాలను దైవాధీనంగా భావించారు. ఏది ఏమైనా మనుషులు నిరంతరం తెలుసుకునే ప్రయత్నంలోనే ఉన్నారు. అందులో సఫలీకృతం అవుతోన్నారు. జంతువులలో ఒకజాతి జంతువులుగా పుట్టిన మనుషులు, వారు అభివృద్ధి చేసుకున్న జిజ్ఞాస, ఆలోచనా విధానమే వారిని వాటినుంచి దూరం చేసింది. మరొక అద్భుతమైన ఆలోచన ప్రపంచంలోకి మనుషులను తీసుకెళ్లింది.

భూమిని సాగు చేసి, ఆహారాన్ని పండించడం మనిషి సాధించిన అద్భుతమైన ప్రగతి. ఈ ప్రగతి వెనుకాల ఎంతో శారీరక, మానసిక శ్రమలు దాగి ఉన్నాయి. ఈ శ్రమతోపాటుగా సంస్కృతి పుట్టింది. ఒకరకంగా చెప్పాలంటే ఉత్పత్తిలో పాల్గొన్న మనుషులు సాంస్కృతికంగా దగ్గరయ్యారు. తాము ఒకటనే భావనలోకి వచ్చారు. ఈ శ్రమసంస్కృతిలో భాగంగానే పాట, మాట, అక్షరాలు, అధ్యయనం, అన్నీ రూపొందాయి. ఏ దేశంలోనైనా అధ్యయనం, సంస్కృతి జోడెడ్ల బండి లాంటిది. ఒకటి లేకుండా మరొకటి మనలేదు. కనుక మనుషుల జీవితాల్ని అధ్యయనమే తీర్చిదిద్దుతుంది. ఈ క్రమంలో పురాణాల్లో అధ్యయన ప్రాధాన్యతను హిరణ్యకశిపుడు, తన కొడుకైన ప్రహ్లాదుడికి చెప్తున్న ఒక పద్యాన్ని ఇక్కడ ప్రస్తావించవచ్చు. ***"చదువని వాడజ్ఞుండగు/జదివిన సదసద్వివేక చతురత గలుగుం/జదువగ వలయును జనులకు/జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ!"*** అని చదువు (అధ్యయన) ప్రాముఖ్యతను తెలిపే మంచి పద్యం ఇది. మనుషులు అధ్యయనపరులైతే ఏది మంచి, ఏది చెడు వంటి విషయాలను గుర్తించగలుగుతారు. ప్రవర్తనలో, మాటల్లో పరిపక్వత వస్తుంది. ఈ రకమైన గుర్తించదగిన మార్పు వస్తేనే సమాజం అభివృద్ధి దశలో ప్రయాణిస్తున్నట్లుగా భావించాలి. కానీ, గత కొంతకాలంగా భారతీయ సామాజిక పరివర్తన, ప్రవర్తన మధ్యయుగాల కాలంనాటి స్థితిలోకి నెట్టివేయబడింది. శాస్త్ర, సాంకేతిక రంగాలు ఇంతగా అభివృద్ధి చెందిన తర్వాత కూడా మనుషులు విభిన్న మతాల ద్వేషపూరిత ఆలోచనల్లోకి కూరుకుపోతున్నారు.

భారతదేశం గతంలో ఎన్నడూ లేని సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. మానవ వెనుకబాటుతనానికి ప్రతీకలుగా నిలిచిన మత, కుల భావనల్లో కొట్టుకుపోతుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఏ సమాజాన్ని అయినా రెండు భావనలు ప్రభావితం చేస్తుంటాయి. ఒకటి ప్రగతివాదం అయితే, మరొకటి ప్రగతి వ్యతిరేక వాదం. ప్రగతివాదం చెప్పే భావనలు, అప్పటికే ప్రగతి వ్యతిరేక భావాలతో నిండిపోయిన సమాజంలో నత్తనడకన సాగుతుంటాయి. వాటిలో వేగం ఉండదు. "నిజం చెప్పులేసుకొని బయటకు వచ్చేలోపే, అబద్ధం ఊరు మొత్తం తిరిగొస్తుందనే" తెలుగు సామెత ఈ విషయంలో చక్కగా సరిపోతుంది. భారత రాజ్యాంగం కల్పించిన సమాన విద్యావకాశాలు, హక్కుల మూలంగా స్వాతంత్ర్యానంతరం శూద్రకులాల నుంచి వచ్చిన మేధావులు, భారతదేశ సామాజికార్థిక, రాజకీయ విధానాలను చారిత్రకంగా అధ్యయనం చేయడం మొదలుపెట్టారు. తమను నీచంగా, అభివృద్ధికి దూరంగా తోసేసిన వ్యవస్థను ప్రశ్నిస్తూ అనేక రచనలు చేశారు. పూలే, పెరియార్, అంబేద్కర్‌ల మొదలు నేటి కంచ ఐలయ్య వరకు మెజారిటీ ఆధిపత్య భావజాలానికి, గత చరిత్రకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించే పనిలో అనేక రచనలు చేశారు. నిజాలను వెలికితీసే పనిలో ఉన్నారు. నాడు, నేడు వీరిపై భౌతిక, మానసిక దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఆనాటి నుండి నేటి వరకు ఈ దాడుల వెనుక ఆధిపత్య కుల, మత ఛాందసవాదుల ప్రమేయం ఉందనే విషయం అందరికి తెలిసిందే.

మత ఛాందసవాదులు నేటి శాస్త్ర, సాంకేతిక రంగాలను వినియోగించుకొని ప్రగతి వ్యతిరేక భావాలను యువతలోకి చొప్పిస్తున్నారు. తద్వారా సహజంగానే మతానుబంధ సామాజిక స్థితి కలిగినవారు ఇటువంటి విషయాలను గమనింపులోకి తెచ్చుకోకుండా, అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. మనోభావాలు దెబ్బతిన్నాయనే వాదనను ముందుకు తెస్తుంటారు. కనీసం వారు తమను తాము తిరిగి ప్రశ్నించుకోలేని మానసిక స్థితిలోకి వెళ్లిపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే సోషల్ మీడియాలో, ఇంటర్నెట్‌లో దొరికిన సమాచారమే గొప్పదని, నిజమని భావించే స్థితిలోకి నేటి యువత నెట్టివేయబడింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అధ్యయన సంస్కృతిని మరింత సృజనాత్మకంగా, ప్రయోగాత్మకంగా మార్చే అవకాశం ఉంది. విద్యార్థులలో పఠనాభిరుచిని, లోతైన విశ్లేషణ సామర్థ్యాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అధ్యయనంలో సాంకేతికతను ఉపయోగించుకోవడంతోపాటు, ముద్రిత పుస్తకాలు, చర్చలు, ఆలోచనల్లో అంతర్భాగం చేయాలని ప్రోత్సహించాలి. విద్యార్థుల్లో శాస్త్రీయదృష్టిని పెంపొందించాలి. తద్వారా సమాజంలో వస్తున్న విపత్కర పరిస్థితులను అధిగమించవచ్చు. లేదంటే నేటి తరం అధ్యయన సంస్కృతికి దూరమై, మధ్యయుగాల కాలంనాటి మత, కుల విశ్వాసాలకు వాహికగా పనిచేస్తూ, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తారు. దీన్ని నేటి సామాజిక అత్యవసర పరిస్థితిగా గుర్తించాలి. దేవుళ్లతో సరిసమానంగా పూజించబడే గురువు విద్యార్థి కాళ్లు పట్టుకోవాల్సి రావడం, ఈ పుస్తకాలు ఎందుకు అమ్ముతున్నారు? అని నిలదీయబడటం, ఈ పుస్తకాలే అమ్మాలని హుకుం చేయడం, అర్థం – పర్థం లేని సోషల్ మీడియా అభిప్రాయాలను సమాజంపై రుద్దడం, భిన్నాభిప్రాయం కలిగి ఉండటం నేరంగా భావించబడటం, మీ అభిప్రాయాలను మార్చుకోండి లేదా ట్రోలింగ్‌కి గురిచేస్తాం అనే బెదిరింపులకు గురికావడం వంటి విషపూరిత అవస్థల్లోకి సమాజం వెళ్తుందంటేనే సరైన విద్య, బోధన, అధ్యయన సంస్కృతుల్లో లోపం ఉందనే విషయాన్ని తెలియజేస్తున్నాయి. ముందే ప్రస్తావించుకున్నట్లు భారతీయ సమాజంలో అధ్యయనం, సంస్కృతి జమిలిగా ఉన్నాయని, ఇక్కడ శ్రమ సంస్కృతికి బదులుగా, ఆధిపత్య మత ఛాందస, భావజాలాల సంస్కృతి వచ్చి చేరడం, ఈ విపత్కర పరిస్థితులకు కారణంగా భావించవచ్చు. T

# అటవీ ప్రాంతాల్లో ఖనిజాల వెలికితీతవాదం, దోపిడి

డా॥ వెంకటేష్ వడిత్య

**వ్యాస సంగ్రహం** (Abstract)

కొన్ని దశాబ్దాలుగా భారతదేశంలోని షెడ్యూల్డ్ తెగలను (షె.తె) గుర్తించడానికి అనేక రాజ్యాంగ, సామాజిక ప్రమాణాలు రూపొందించబడ్డాయి. వాటిలో అన్నింటికంటే ముఖ్యమైనవి ఈ తెగలు ఆదిమ సమాజ లక్షణాలు కలిగి ఉండడం, కులసమాజానికి భిన్నమైన సంస్కృతి, భౌగోళిక ఒంటరితనం, ప్రధాన స్రవంతితో దూరంగా ఉండడానికి ఇష్టపడటం వంటి లక్షణాలు ఉన్నాయి. వీటితోపాటు ఇక్కడ పేర్కొన్న ఇతర లక్షణాలు అంటే, ప్రత్యేక్యమైన గిరిజన ఆవాసాలు, వారి సాంస్కృతిక, వస్త్రధారణ పద్ధతులు, వారికే ప్రత్యేక్యమైన దేవుళ్ళు, దేవతలు, ఆచారాలు, ఆహారపు అలవాట్లు, మాండలికాలు, కులం లేని సామాజిక నిర్మాణం, స్వయంప్రతిపత్తి కలిగిన ఆర్థిక వ్యవస్థ మొదలైనవి కూడా ఉన్నాయి. అయితే, చివరికి షెడ్యూలు తెగ (షె.తె ) అనేది ఒక చట్టపరమైన, రాజ్యాంగపరమైన నిర్వచనంగానే పరిగణించబడుతుంది. ఆదివాసీలు ఒకే సమాజం కాదు ఇవి వివిధ చారిత్రక, భౌగోళిక, భాషాపరమైన భిన్నత్వాన్ని కలిగి ఉన్నాయి. అటువంటి వివిక్త ఆదివాసీలను దేశ నిర్మాణ ప్రక్రియలో భాగంగా చేయడం కోసం గౌరవపూర్వకంగా ప్రధాన స్రవంతిలో కలపడం లేదా 'ఏకీకరణ' (Integration) చేయడం అనేది ముఖ్యమైన సహేతుక సూత్రంగా అంగీకరించబడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని షె.తె వర్గాల అభ్యున్నతి పేరుతో అనేక ఆలోచనాత్మక విధానాలు రూపొందించబడ్డాయి. ఐతే ఈ విధానాలు ఆదివాసీ/గిరిజనల వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన విధానాలు కాదని గత అనుభవాలు చెబుతున్నాయి. ఇవి కేవలం ఆధిపత్య కులసమాజ దృష్టికోణంనుంచి రూపొందించబడిన ఆర్థిక విధానాల పొడిగింపుగానే మనకు కనబడుతున్నాయి. 1990 వరకు అనుసరించబడిన అభివృద్ధి నమూనా రాజ్యం/ప్రభుత్వం ఆధిపత్యంలో జరిగింది. ఇది ఆదివాసీలకు పెద్దగా ఉపయోగపడకపోగా అది వారిని అభివృద్ధి ప్రేరిత జరిగిన విస్థాపనకు బలయ్యే విధంగా చేసింది. 1990 తరువాత ప్రారంభమైన మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ (market economy) విస్తరణ ఆదివాసీ/ఆదివాసీ వర్గాలను మరింత నష్టానికి గురిచేసింది. ఈ కాలంలో గతంలో రాజ్యం ఆధ్వర్యంలో జరిగిన అభివృధ్ధి దాని విధ్వంస రూపం ప్రైవేటు పెట్టుబడిదారీ విధానంతో మరింత జడలు విరిచింది. ఇది అడవులు/పర్వతాల ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజాల వెలికితీత (extractivism) దోపిడీ ప్రక్రియను తీవ్రతరం చేసింది. ఇది గిరిజనుల జీవన విధానానికి, వారి జీవనానికి తీవ్రమైన సవాలుగా మారింది.

**ముఖ్య పదాలు:** *షెడ్యూల్డ్ తెగ, వెలికితీతవాదం, దోపిడీ, ఆదివాసీ జ్ఞానశాస్త్రం, గిరిజన/ఆదివాసీ ఉద్ధరణ.*

## పరిచయం

వలసపాలనానంతర భారతదేశంలో తెగలు/ఆదివాసీల సామాజిక-ఆర్థిక జీవితాల్లో మార్పును తీసుకురావడానికి చాలావిధాలైన పాలసీలను, కార్యక్రమాలను వివిధ రకాలైన ప్రభుత్వాలు రూపొందించబడ్డాయి. ఈ విధానాలను స్థూలంగా మూడు గ్రూపులుగా వర్గీకరించవచ్చు. మొదటిది, గిరిజనులు/ఆదివాసీలను దోపిడీ నుండి రక్షించడానికి ఉద్దేశించిన రక్షణ విధానాలు ఇవి ఆదివాసీల వనరుల పరాయీకరణను నియంత్రించే ఉద్దేశంతో రాజ్యాంగ, చట్టపరమైన రక్షణలను కల్పించినవి. రెండోది సామాజిక ప్రగతికి ఉద్దేశించిన పాలసీలు. ఇందులో విద్యా-ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్లను ముఖ్యంగా చెప్పుకోవచ్చు. ఇక చివరిది, మూడోది తెగలు/ఆదివాసీల ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన పాలసీ విధానాలు. ఇందులో చాలారకాల ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ఉన్నాయి. ఇవి ముఖ్యంగా వివిధ పంచవర్ష ప్రణాళిక కాలాల్లో గిరిజనులు/ఆదివాసీల అభివృద్ధికోసం సందర్భంలో ప్రారంభించబడిన లేదా చేసిన ప్రభుత్వ ప్రయత్నాలు. దానితోపాటు, దేశంలోని గిరిజనులు/ఆదివాసీల అభివృద్ధికి మూడు రకాల పాలనా విధానాలు సూచించబడ్డాయి అవి : ఆదివాసీలను బయటి ప్రపంచంతో ఏకాంతలో ఉంచే విధానం/వేరుగా ఉంచే పద్ధతి (the policy of isolation) దానిద్వారా వారు తమ స్వేచ్ఛను, సంపదను కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది. దానికి పూర్తి వ్యతిరేకమైన రెండవ

విధానమే గిరిజనులు/ఆదివాసీలను ఆధిపత్య మతము, సమాజములో కలుపుకునే విధానం/విలీనం (the policy of assimilation). దీనిద్వారా వీరు తమ సామాజిక, ఆర్థిక స్వేచ్ఛను కోల్పోతారు. వీటికి మధ్యేమార్గంగా వచ్చిన విధానాన్ని ఏకీకరణ విధానం (the policy of integration) అంటారు. దీనిద్వారా ఒక గౌరవప్రదమైన పరస్పర సామాజిక చర్యకు ఆధిపత్య కుల సమాజానికి, ఆదివాసీల మధ్యన అవకాశం ఉంటుంది. మానవ శాస్త్రవేత్తలు (Anthropologists), విధాన నిర్ణేతలు. ఈ పైమూడు విధానాలను ఏదో ఒకదానిని వారి సైద్ధాంతిక ఆలోచనలకూ అనుగుణంగా సమర్ధించారు. ఇప్పుడు తెగలు/ఆదివాసీలు తమవైపునుండి ఎంచుకున్న విధానాన్ని 'అనుసరణ-చర్చ-స్వేచ్ఛ'గా చెప్పుకోవచ్చు. ఏదేమైనప్పటికీ, తెగలు/ఆదివాసీ సమాజం ఆధిపత్యకుల-సామాజిక, ఆర్థిక దోపిడీకి గురైంది. ఎందుకంటే, ఈ సమాజాల్లో కులం అనే సమస్య లేకపోవచ్చు కానీ వారు పరిపాలించబడుతుంది ఆధిపత్య కులసమాజం చేతిలో ఉన్న రాజ్యం చేతనే. ఇలాంటి సామాజిక ఆధిపత్యానికి బీజాలు వివిధ ప్రభుత్వాలు అవలంబించిన అభివృద్ధి నమూనా, మార్కెట్ ఆధారిత పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థలో ఉంది. అటువంటి అభివృద్ధి నమూనా వ్యతిరేక ఉద్యమాలను ప్రభుత్వాలు, తెగలు/ఆదివాసీలు తక్కువ అభివృద్ధి చెందడం వలన జరుగుతున్నాయని తప్పుగా అర్థం చేసుకున్నాయి. ఆలా అర్థం చేసుకొని ఆదివాసీ ప్రాంతాల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టడం ఒకటే మార్గమనే ధోరణి మనకు కనబడుతుంది. కానీ తెగలు/ఆదివాసీలు వారి ఉద్యమాలను అభివృద్ధి పేరిట వారికి జరుగుతోన్న సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, జ్ఞానపరమైన విధ్వంసాన్ని ఆపటం, వారి స్వేచ్ఛను, స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలుగా చూడాలి. తెగలు/ఆదివాసీలతో తన కొమ్ముకాస్తున్న ప్రస్తుత సమయంలో వెలికితీత పెట్టుబడిదారీ విధానం వారిమీద భౌతిక, జ్ఞానపరమైన హింసకు పాల్పడుతుంది. వివిధ ఉద్యమాలద్వారా వీరు కోరుకుంటుంది 'స్థిరమైన సమగ్ర అభివృద్ధితోపాటు మరింత స్వయంప్రతిపత్తిని కలిగి ఉండాలని'. ఈ దేశంలో ఆధిపత్య కుల సమాజానికి, బ్రిటిష్ వలసవాదం అంతమైంది కానీ గిరిజన/ఆదివాసీ సమాజానికి ఇది ఇంకా అంతర్గత-వలసవాదం (internal-colonialism) రూపంలో కొనసాగుతుంది. ఇది 'నిరంతర వలసవాదం' (wawes of colonialism) ఆలోచనగా కొనసాగుతుంది, ఇది మనం గిరిజనులు/ఆదివాసీ సమాజాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ప్రస్తుత కాలంలో, అభివృద్ధి చెందని ప్రాంతాలను అభివృద్ధి చేసే పేరుతో ఖనిజ వెలికితీసే మైనింగ్ కంపెనీల ప్రవేశంతో గిరిజన/ఆదివాసీల మీద హింస, దోపిడీ మరింత పెరిగింది.

**భారతదేశంలో షెడ్యూల్డ్ తెగలు-నిర్వచనాలు**

పైన పేర్కొన్న విధంగా 'తెగ' నిర్వచనం వలస పాలనకు పూర్వం అడవుల్లో నివసించే ప్రజల గురించి ఒక భావనగా ఉండేది. బ్రిటిష్ వలసవాద కాలంలో తెగ అనే భావన ఉద్భవించింది. ఇది కుల సమాజానికి విరుద్ధమైన/బయట ఉన్న సమాజం తెగకు మొదటి నిర్వచనంగా 1901 జనాభా గణనలో పరిగణలోకి తీసుకున్నారు. స్వాతంత్ర్యానంతర పరిణామ క్రమంలో, తెగ అనేది ఒక ప్రత్యేక జనాభాను సూచించే ఒక సామాజిక వర్గంగా ఉద్భవించింది. 1960వ దశకంలో, ఇది మరింత స్పష్టతను సంతరించుకున్నది అది వారిని ఒక విలక్షణమైన సంస్కృతి కలిగి, ఒంటరిగా నివసిస్తూ, సాధారణంగా వెనుకబడిన సమూహాలుగ నిర్వచించింది. షెడ్యూల్డ్ తెగ (ST) అనే పదం రాజకీయ-పరిపాలన వర్ణన అయినప్పటికీ వారు సామాజికంగా ఒకే వర్గం కాదు. వారు విభిన్న జీవన విధానాలు, ప్రపంచ దృక్పథాలను కలిగి ఉన్నవారు. చివరికి భారత రాజ్యాంగ నిర్వచనమే షె.తె.ల జాబితా తయారు చేయడానికి దిక్సూచి. 342వ అధికరణం, షెడ్యూల్డ్ తెగలను నిర్వచించింది. ఇది అధికరణం 340 (సామాజికంగా, విద్యాపరంగా వెనకబడినవారిని ఇతర వెనకబడివర్గాలుగ (OBC) నిర్వచించింది) అదే విధంగా అధికరణం 341 ప్రకారంగా 'అంటరానితనాన్ని' అనుభవించిన కులాలను, తెగలను, జాతులను షెడ్యూల్డు కులాలుగా (SC) పరిగణించింది. 342వ అధికరణాన్ని, 340, 341 అధికారణాలకు కొనసాగింపుగానే చూడాలి. గిరిజనులు తమను తాము ఆదివాసీలు లేదా ఆదిమవాసులుగా నిర్వచించుకోవాలని కూడా చాలాబలంగా కోరుకున్నారు. ఎందుకంటే ఇది వారి స్వతంత్ర ఇచ్ఛా భావనను వ్యక్తీకరిస్తుంది Xaxa (2014, 1). స్వాతంత్ర్యానంతరం విభిన్న తెగలను, జాతులను షె.తె. జాబితాలో చేర్చడం వలన ఇది వివిధ జీవన విధానాలు, ప్రపంచ దృక్పథాలను కలిగి విభిన్న జనాభాను సూచించే ఒక ప్రత్యేక వర్గంగా ఉద్భవించిందని భావించాలి. Nongkynrih (2010, 43) ప్రకారం, 'జారవా, ఖాసీలు రాజ్యాంగ నిర్వచనం ప్రకారం STలు కానీ, వారు ఒకే విధమైన సంప్రదాయ విశ్వాసాలను కలిగినవారు కాదు. వారు విభిన్న సామాజిక-ఆర్థిక అభివృద్ధి

స్థాయిలను కలిగి ఉన్నారు'. ఆంత్రోపోలాజికల్ రచనలలో నిర్వచించిన 'తెగ' చాలా పరిమితులతో కూడుకున్నది. దానిపరంగా కేవలం కొన్ని తెగల సమూహాలు మాత్రమే షె.తె. కాగలుగుతారు కానీ రాజ్యాంగ నిర్వచనం తెగ పరిధిని విస్తృతపరిచింది. వివిధ రకాల సామాజిక సమూహాలను షె.తె. జాబితాలో చేర్చడంవల్ల, తెగల పరిమాణం, అభివృద్ధి దేశవ్యాప్తంగా ఒకే తీరుగ లేదు Xaxa (2014, 3). దేశంలో షెడ్యూల్డ్ తెగల జనాభా నానాటికీ విస్తరిస్తోంది. కాలానుగుణంగా వివిధ తెగలను, జాతులను షె.తె. జాబితాలో చేర్చడంవలన వారి జనాభా పెరిగింది. మొత్తం షె.తె.ల జనాభా 1961లో 6.9 శాతం నుండి 2011లో 8.6 శాతానికి పెరిగింది. గిరిజన/ఆదివాసీ తెగలు మైదానాలు, అడవులు, కొండలు, ప్రవేశించలేని దట్టమైన అరణ్యాల వరకు వివిధ వాతావరణ, భౌగోళిక పరిస్థితులలో నివసిస్తున్నాయి. అలాగే వారు సామాజిక, ఆర్థిక, విద్యలో వివిధ అభివృద్ధి దశలలో ఉన్నారు. కొన్ని ఆదివాసీ సమూహాలు ప్రధాన స్రవంతి జీవన విధానాన్ని అవలంబించినప్పటికీ, మరికొన్ని సమూహాలు మరొక చివరలో పూర్తిగా సమాజానికి దూరంగా ఉన్నాయి, వీటిలో 75 ప్రత్యేకించి Particularly Vulnerable Tribal Groups (PVTGs ఉన్నాయి. ఇవి వ్యవసాయ పద్ధతుల్లో చాలా వెనకబడిఉండడంతోపాటు వారి జనాభా పెరుగుదలలో స్తబ్దత లేదా క్షీణత ఉంది. చాలా తక్కువ అక్షరాస్యతబీ, ఆర్థిక వ్యవస్థ ఉంది. కేవలం వారు జీవించి ఉండడానికి మాత్రమే పనికొచ్చే స్థాయిలో ఉంటుంది (GoI 2013, 1).

**తెగల అభివృద్ధి–దోపిడీ**

వలసపాలనానంతర భారత రాజ్యం ఆదివాసీల సామాజిక–ఆర్థిక జీవితంలో కోరుకున్న మార్పులను తీసుకురావడానికి వివిధ చర్యలను చేపట్టింది. ఈ సందర్భంలో, విధానాలను స్థూలంగా మూడు గ్రూపులుగా వర్గీకరించవచ్చు. రాజ్యాంగపరమైన రక్షణలు, ఆదివాసీ వనరులు, ప్రత్యేకించి భూమి పరాయీకరణను నియంత్రించే ఉద్దేశంతో చట్టాలతో కూడిన రక్షణ విధానాలుబీ రెండోది సమీకరణ విధానాలు, ఇవి విద్యాసంస్థలలో, ఉద్యోగాలలో, చట్టసభల్లో రిజర్వేషన్లు ఉన్నాయి. చివరిగా అభివృద్ధి విధానాలు, ఇందులో పెద్దసంఖ్యలో రూపొందించిన ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు ఉన్నాయి. ఇంతకు ముందు చర్చించినట్లుగా, బయటినుండి ఆదివాసీలపై ఎలాంటి విధింపులనైనా నెహ్రూ గట్టిగా వ్యతిరేకించారు. ఆదివాసీల గురించి ఆయన మాట్లాడుతూ.. "మీ గిరిజన సంప్రదింపు ఆప్యాయతతోకూడి, వారికి విముక్తిని కలిగించే శక్తిగా స్నేహితునిగా ఉండాలి. తద్వారా మీరు వారి నుండి ఏదైనా తీసుకోవాడానికి వచ్చినట్టుకాకుండా వారికి మేలు చేకూర్చడానికి వచ్చినట్టుగా మిమల్ని వారు భావించాలి. అదే సరైన సమైక్యతకు నిర్వచనం. కానీ మీరు వారి జీవనవిధానాలను ధ్వసం చేయడానికి వచ్చారని వారు భావిస్తే, అది పూర్తిగా మీదే తప్పు" (Gandhi and Vakulabharanam, 2016, 91లో ఉల్లేఖించినట్లు). దేశంలో తెగల విషయంలో అభివృద్ధి, దోపిడీ రెండు నాణానికి రెండువైపులా ఉన్నట్టు కనబడుతుంది. ఆధిపత్య కుల సమాజం–పెట్టుబడిదారీ సమాజ అభివృద్ధి ఆదివాసీల దోపిడీ–హింసను పునాది చేసుకొని సాగుతున్నట్టు అనిపిస్తుంది. వలసపాలన అనంతర భారత రాజ్యం ఆదివాసీల సామాజిక–ఆర్థిక జీవితంలో కోరుకున్న మార్పులను తీసుకురావడానికి వివిధ చర్యలను చేపట్టింది. ఆదివాసీల అభివృద్ధి విధానంలో భాగంగా వివిధ పంచవర్ష ప్రణాళిక కాలాల్లో వివిధ కార్యక్రమాలు, పథకాలు ప్రారంభించబడ్డాయి. ఇంతకు ముందు చర్చించినట్లుగా, బయటి సమాజ ఆధిపత్యం ఆదివాసీలమీద జవహర్ లాల్ నెహ్రూ సూత్రప్రాయంగా వ్యతిరేకించారు. ప్రణాళికా ప్రక్రియద్వారా గిరిజన/ఆదివాసీ వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలని భారత రాజ్యం కోరుకుంది. కానీ పటిష్టమైన ప్రణాళికా ప్రక్రియ అమలు చేసినప్పటికీ వారి అభివృద్ధి స్థాయి దిగువనే ఉంది. చారిత్రక దృక్కోణంలో, వారు అత్యంత దారుణమైన సామాజిక దోపిడీకి గురయ్యారు. ఈ క్రమములో వారు అనేక పౌర సౌకర్యాలను/హక్కులను కోల్పోయారు. బ్రిటీష్ వారిచే 1884లో షెడ్యూల్డ్ డిస్ట్రిక్ట్ యాక్టు ప్రవేశపెట్టడంవల్ల ఆదివాసీ/గిరిజన ప్రాంతాలను పరిపాలనాపరంగా వేరుగా ఉంచే ప్రక్రియ ప్రారంభమైందిబీ అదే పరిస్థితి 1919, 1935లోని భారత ప్రభుత్వ చట్టాల ప్రకారం కొనసాగాయి. అయితే, స్వాతంత్ర్యానంతరం, ఈ విధానం అంటే వేరుగా ఉంచే పద్ధతి మార్చి, ఏకీకరణ (integration) విధానం ప్రారంభించబడింది (Reddy and Kumar 2010, 33).

ఏకీకరణ (integration) అనేది రాజకీయ, ఆర్థిక, పరిపాలనా, సాంకేతిక ప్రక్రియ, జాతీయ ప్రధానస్రవంతిలో భాగంగా ఇప్పటికే రాజ్యాంగబద్ధంగా గిరిజనులు/ఆదివాసీలు ఈ వ్యవస్థల్లో భాగాన్ని పంచుకుంటున్నారు. అదే ఏకీకరణ అనేభావన assimilation కు దారితీసే ప్రమాదం కూడా ఉంది. ఇది దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని మరుగునపరిచే ప్రమాదం

ఉంది. వారి సాంస్కృతిక మూలాలను కాపాడుకుంటూ గిరిజనులను ప్రధానస్రవంతిలో ఏకంచేయడం అనేది పెద్ద సవాలు ఈరోజు. ఎందుకంటే వారి ఏకీకరణ కులవ్యవస్థతో కూడిన హిందూ సమాజంలో నైతికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఆకాంక్షించే విషయం కాదు. జవహర్లాల్ నెహ్రూ, ఆదివాసీలను కేవలం అధ్యయనాంశాలుగా పరిగణించడం లేదా దోపిడీకి వస్తువులుగానే చూడడాన్ని వ్యతిరేకిస్తూ, సమతుల్య విధానాన్ని ఆకాంక్షించారు. గిరిజనులపట్ల మనం వారిని స్వీకరించే దృక్పథాన్ని కలిగి ఉండాలని ఆయన అన్నారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలలో మనం వారి నుండి చాలా నేర్చుకొని అప్పుడు మాత్రమే వారికి ఏమి కావాలనేది వారినుంచి తెలుసుకొని మాత్రమే మన పథకాలను రూపొందించాలి. మనం సహాయం చేయడానికి ప్రయత్నించాలన్నారు. నెహ్రూ జాతీయచట్రంలో క్రమంగా సమీకరణ (integration) నమూనాను ప్రోత్సహించారు. గిరిజనుల చొరవతో, వారి సమ్మతితోనే మార్పులు జరగాలని నొక్కిచెప్పాడు. వర్రియా ల్విnŽ (Verrier Elwin) నెహ్రూ వాదనతో ఏకీభవించారు. తెగలను "మానవ జంతుప్రదర్శనశాలలో నమూనాలు"గా పరిగణించడాన్ని తిరస్కరించారు. కానీ ఆదివాసీలను ప్రధానస్రవంతి సమాజంలోకి అనాలోచితంగా విలీనం చేయడంవల్ల ఆదివాసీ సామాజిక నిర్మాణాలు వేగంగా విచ్ఛిన్నం కావచ్చని మానవ శాస్త్రవేత్త హైమెండోర్ఫ్ (Christoph von Fürer-Haimendorf) హెచ్చరించారు. ఆధునిక, ఆధిపత్య సమాజ దోపిడీ నుంచి ఆదివాసీలను కాపాడేందుకు వారి ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపు, విలువలను జాగ్రత్తగా కాపాడాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. అతని మాటల్లో స్వాతంత్ర్యానంతరం గత "ఇరవై నుండి ముప్పై సంవత్సరాల వ్యవధిలో, ఆదిమవాసులు తమ ఆర్థిక స్వాతంత్ర్యం, భూమిలో ఎక్కువ భాగాన్ని కోల్పోయిన అనేక ప్రాంతాలు దేశంలో ఉన్నాయి. ఈ భూపరాయీకరణ చాలా సందర్భాల్లో ఆదివాసీల్లో నిరాశను దాని ఫలితంగా ఉద్రిక్తతలు, ఆకస్మిక హింస, కొన్ని సందర్భాల్లో వ్యవస్థీకృత తిరుగుబాట్లకు దారి తీసాయి". నెహ్రూవియన్ ఇంటెగ్రేషన్ మాడల్ వారసత్వం దశాబ్దాలుగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి నమూనాగా ఆధిపత్యం చెలాయించింది. అది జాతీయ అభివృద్ధికి వేగవంతమైన పారిశ్రామికీకరణను అవసరాన్ని నొక్కిచెప్పింది. ఈ విధానం ఆదివాసీ ప్రాంతాలలో ఉక్కు వంటి కర్మాగారాలు పెద్ద ఎత్తున ప్రభుత్వ యాజమాన్యంలో పరిశ్రమల స్థాపనకు దారితీసింది. అదనంగా, నాగార్జునసాగర్, హిరాకుడ్ వంటి ముఖ్యమైన జలవిద్యుత్ ప్రాజెక్టులు వ్యవసాయ అభివృద్ధికి కీలకమైనవిగా ప్రచారం చేయబడ్డాయి. దీని ఫలితంగా తెగల ప్రత్యేక అవసరాలు, దృక్కోణాలను ప్రభుత్వాలు పట్టించుకోలేదు' నెహ్రూవియన్ పంచశీల గిరిజనుల భూమి, అటవీ హక్కులకు గౌరవం కల్పిస్తూ, కనీస పరిపాలనా జోక్యాన్ని ప్రోత్సహిస్తూ, వారిని ఏకీకృతం చేయడానికి రాజ్యాంగదృష్టిని వివరించింది. గిరిజనుల అభివృద్ధికి ఉద్దేశించిన చట్టాలను స్పష్టంగా వివరించకపోయిన, నెహ్రూ integrationist ఆలోచనలు ఈశాన్య ప్రాంతంలో ప్రత్యేకించి ఆరవ షెడ్యూల్, స్వయంప్రతిపత్త జిల్లా కౌన్సిల్ల ద్వారా కొంత విజయాన్ని సాధించాయి. ఏది ఏమైనప్పటికీ, ఈ వ్యూహాలు ఐదవ షెడ్యూల్ భారతదేశంలో సరిగ్గా అమలుకు నోచుకోలేదు. దీనికి ఉదాహరణ, కేరళ వంటి రాష్ట్రాల్లో మెరుగైన అభివృద్ధి సూచికలు ఉన్నప్పటికీ గిరిజనులు అక్కడ అట్టడుగున ఉన్నారు. రాజ్యాంగంపరంగా ఐదవ, ఆరవ షెడ్యూల్ వంటి రక్షణలు ఉన్నప్పటికీ, ఆధిపత్య కుల సమాజంద్వారా భూమి పరాయీకరణ, సంగ్రహణ (extractive)కు గురై పెట్టుబడిదారీ విధానం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ఆదివాసీల ప్రయోజనాలను కాపాడేందుకు రాజ్యాంగంపరంగా రక్షణలు ఉన్నప్పటికీ పాలకులకు చిత్తశుద్ధి లోపించింది. ఇక్కడ ఒక ఉదాహరణ గిరిజన జనాభా నిష్పత్తికి అనుగుణంగా నిధులు కేటాయించి వారి అభివృద్ధికి పాటుపడాలనే ఉద్దేశంతో 1970లలో ప్రారంభించిన గిరిజన సబ్-ప్లాన్ (TSP) రూపొందింది. ఈ పథకానికి నిధులు జనాభా నిష్పత్తికంటే తక్కువగా కేటాయించడం, నిధులు దారి మళ్లించడం వంటి చర్యలు దేశంలో యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఆధిపత్య సమాజం తరచుగా ఆదివాసీల వెనుకుబాటుతనానికి వారి వెనకబాటు సంస్కృతికి కారణమని నిందిస్తారు. కానీ వారు ఆధిపత్య అభివృద్ధి నమూనా వారిని వెనుకబాటుతనానికి గురిచేసిందని మర్చిపోతుంటారు.

**వెలికితీతవాదం, ఆర్థిక దోపిడీ**

సదుద్దేశంతో కూడిన ఏకీకరణ (integrationist) నమూనా ఆశయానికి భిన్నంగా, తెగల విషయంలో అమలులో జరిగింది. అభివృద్ధి రాజకీయ ఆర్థిక వ్యవస్థ బ్రిటిష్ వలసవాదం నుండి స్ఫూర్తి పొంది, గిరిజనుల తాత్వికతకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండానే, అభివృద్ధి ప్రక్రియలో గిరిజన భూభాగాలను చేర్చినట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రక్రియ గిరిజన భూములను

కమోడిటీ మార్కెట్, లేబర్ మార్కెట్, మనీ మార్కెట్, ల్యాండ్ మార్కెట్ వ్యవస్థల్లోకి తీసుకొచ్చారు. అయితే గిరిజనులు ఈ మార్కెట్ ఆర్థికవ్యవస్థ పనితీరును పూర్తిగా అర్థంచేసుకోలేకపోయారు. అందువల్ల వారు ఆర్థికవ్యవస్థలో అట్టడుగున ఉన్న వర్గాలుగా మిగిలిపోయారు. బైగాస్ తెగల అనుభవంతో ఎల్విన్ (Elvin) చేసిన హెచ్చరికలు ఇక్కడ ప్రస్తావించదగ్గవి. ప్రత్యేకత ఏమిటంటే, బ్రిటిష్ వలసపాలన గిరిజన ప్రాంతాలను తిరుగుబాటు ప్రాంతాలుగానే పరిగణించినప్పటికీ, అటు జాతీయవాద నాయకత్వం, స్వతంత్ర భారత ప్రభుత్వం గిరిజనులను ఆర్థికంగా వెనుకబడిన, పేదవర్గంగా భావించింది. వారి అభివృద్ధి లక్ష్యం గిరిజనులను పేదరికం నుండి బయటపడేయటం, తెగల మధ్య, ఇతర వర్గాల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించడం అనే ఉద్దేశంతోనే జరిగింది. ఐదవ షెడ్యూలు భారత రాజ్యాంగంలో వలస పాలన విధానాల కొనసాగింపుగా ఉండింది. బ్రిటిష్ వలసవాదానికి ముందు, గిరిజన సమాజాలు తమ అడవులు, భూమి, ఆర్థికవ్యవస్థ, రాజకీయ వ్యవహారాలపై పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తిని అనుభవించాయి. కానీ వలసపాలన, మార్కెట్ ఆర్థికవ్యవస్థ, ముఖ్యంగా మనీ, లేబర్ మార్కెట్ రంగాల ప్రవేశంతో, ఈ స్వయంప్రతిపత్తి క్రమంగా దెబ్బతీన్నది. అటు అభివృద్ధి పేరిట జరిగిన గిరిజన ప్రాంతాల 'సైనికీకరణ' పరిస్థితిని మరింత దిగజార్చింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, స్వయం ప్రతిపత్తి-స్వీయ పరిపాలన ఆకాంక్షించినప్పటికీ, ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో అమలయ్యే స్వీయ పరిపాలన, 6వ షెడ్యూల్లోని స్వయంప్రతిపత్తి జిల్లా కౌన్సిల్లు (ADC\T) లకు పోలికే లేదు. ఈశాన్య భారతదేశం ఏకీకరణ ప్రక్రియను (integretion) మరింత సమర్థవంతంగా అమలు చేశారు కానీ ఇతర గిరిజన ప్రాంతాల్లో ప్రధానంగా జరిగింది assimilation మాత్రమే. తద్వారా ఈ ప్రాంతాలై ఆర్థిక దోపిడీతోపాటు మతపరమైన, సాంస్కృతికపరమైన దోపిడీని అనుభవించాయి.

భూమి, అడవి ఆదివాసీలకు భద్రత, సామాజిక హోదా రెండింటినీ అందించే అత్యంత ముఖ్యమైన సహజ వనరు. వారికి భూమితో ఉన్న సంబంధం ఆధిపత్య సమాజం దృష్టికోణంతో పోలిస్తే పూర్తి విభిన్నంగా ఉంటుంది. ఆధిపత్య సమాజం భూమిని ప్రధానంగా ఆర్థిక వనరుగా చూడగా, ఆదివాసీలకు ఇది ఆర్థిక సంబంధాలకు అతీతంగా, వారి సాంస్కృతిక గుర్తింపు, జీవన విధానం, ఆధ్యాత్మిక అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది. గత కొన్ని దశాబ్దాలుగా, ఆదివాసీ సమాజాలు వారి భూసంపదలపై వ్యక్తిగత, సామాజిక నియంత్రణ కోల్పోయాయి. భారతదేశంలో అటవీ చట్టాలు, విధానాల పరిణామం ఆదివాసీల హక్కులను, అలాగే అడవుల ఆధారంగా వారి జీవనోపాధిని క్రమంగా దెబ్బతీసింది. రాజ్యం క్రమంగా ఈ హక్కులను రద్దుచేయడం వలన ఆదివాసీ సమాజాలు అడవులు, ఉమ్మడి ఆస్తి వనరులమీద ప్రాబల్యం కోల్పోయాయి. ఇది వారి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసింది. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలువంటి పెద్ద ప్రాజెక్టులకోసం గిరిజన భూములే అధిక సేకరణకు గురయ్యాయి. ఈ ప్రక్రియలో, ఆదివాసీలు నిరంతరం నిర్వాసితులుగా మారి, వారి భూమి, జీవితాంతర ఆదాయ వనరులను కోల్పోతున్నారు. విద్య, నైపుణ్యాల కొరత కారణంగా, కొత్త ఆర్థిక అవకాశాలను వినియోగించడంలో వారు వెనుకబడ్డారు. ఇవి తరచుగా గిరిజనేతర వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ఈ అభివృద్ధి నమూనా తరచుగా గిరిజన ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టుల రూపాన్ని తీసుకుంది. గిరిజనుల సహజ వనరులపై ఆధారపడిన జీవన విధానాలకు తీవ్రమైన భంగాన్ని కలిగించింది. నెహ్రూ నేతృత్వంలో భారతదేశం పేదరికం, అసమానతల నిర్మూలన లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, 20-30 సంవత్సరాలలో అనేక మంది ఆదివాసీలు భూమి, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు. దీని ఫలితంగా ఉద్రిక్తతలు, హింస పెరిగాయి. 1990ల నుండి నయా ఉదారవాద విధానాలు ఆదివాసీ హక్కులను మరింత కుదించాయి. ప్రభుత్వం బహుళజాతి మైనింగ్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరించడంవల్ల ఆదివాసీల పూర్వీకుల భూములపై జీవనోపాధి మరింత ప్రమాదంలో పడింది. ఈ విధానం గిరిజన సమాజాలకు నష్టాన్ని కలిగిస్తూ, సహజ వనరులపై వారి హక్కులను బలహీనపరిచింది. ఈ పరిణామం ఆదివాసీ సమాజాలకు విస్మృతిని కలిగించడమే కాక, వారి సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక హక్కుల సాధనను కూడా ప్రశ్నార్థకంగా మార్చింది.

### అభివృద్ధి, నయా-ఉదారవాదం, వనరుల దోపిడీ

అభివృద్ధి అనేది బహుముఖ చర్యల సమాహారం. ఇది ప్రజల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, మానవ సంబంధ అంశాలను సమగ్రంగా మెరుగుపరచే లక్ష్యంతో ముందుకు సాగే ప్రక్రియ. స్వాతంత్ర్యం పొందిన తర్వాత భారత ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధికి పలు ప్రణాళికా దశలలో కొన్ని కీలక చర్యలను చేపట్టింది. అయితే, 1990ల నుండి ప్రవేశపెట్టిన

నయా–ఉదారవాద విధానాలు ఈ అభివృద్ధి దృక్పథాన్ని గణనీయంగా మార్చాయి. నియో–ఉదారవాదం, ఆర్థిక సంస్కరణలు మార్కెట్ విధానాలకు మరింత అనుకూలంగా మార్చేశాయి. రాజ్యమనేది 'అందరి మంచికోసం' (common good) వనరులను కేటాయింపు చేస్తుందనే భావన ఉంది కానీ ఇది పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకునే పని చేస్తుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో, ఉత్పత్తి సాధనాల ప్రైవేట్ యాజమానం, వేతన కార్మిక వ్యవస్థ అనేవి ముఖ్యమైన అంశాలు. ఈ మోడల్ మార్కెట్–ఆధారిత వ్యవస్థగా ఉండి, సరుకుల, సేవల మార్పిడి సాపేక్ష ధరల ఆధారంగా జరుగుతుంది. వలసవాద అనంతర భారతదేశంలో, పెట్టుబడిదారీవర్గం పిండదశలో ఉన్నప్పటికీ, రాజ్యం ఈ వ్యవస్థ పరిపక్వతకోసం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఆర్థిక జాతీయవాదం ప్రధాన ధ్యేయంగా అవతరించింది. 1980ల నుండి అభివృద్ధి చర్చలో 'అభివృద్ధితో సాధికారత' అనే మార్పు చోటుచేసుకుంది. ఇది వ్యక్తిగతమైన మానవ అభివృద్ధిని కేంద్రంలో ఉంచింది. ఫలితంగా, పలు అట్టడుగువర్గాలు, ముఖ్యంగా ఆదివాసీలు, అభివృద్ధికి మరింత దూరమయ్యారు. షెడ్యూల్ ప్రాంతాలలో సహజ వనరుల దోపిడీ వేగవంతమవడంతో, ఆదివాసీ సమాజాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వీరి భూములు సహజ వనరులతో సమృద్ధిగా ఉన్నప్పటికీ, అభివృద్ధి, పెట్టుబడిదారీ ప్రాజెక్టుల కోసం దోపిడీ చేయబడ్డాయి. Xaxa (2022, 65) అభిప్రాయంలో, "తెగలు ఆధిపత్య, అణచివేతలు అత్యంత తీవ్ర పరిస్థితులలో ఉన్నాయి." వారి ప్రాంతాలు అభివృద్ధి పేరుతో వ్యవస్థీకృతంగా దోపిడీకి గురయ్యాయి. ఏది ఏమైనప్పటికీ, అభివృద్ధి నమూనా దేశంలో పెద్ద–స్థాయి ప్రాజెక్టుల అభివృద్ధి రూపాన్ని సంతరించుకుంది. అవి మౌలిక సదుపాయాలు (డ్యాములు, నీటిపారుదల వ్యవస్థలు, పవర్ ప్లాంట్లు, రోడ్లు, రైల్వేలు) లేదా పరిశ్రమలు, ఖనిజాల అన్వేషణకు సంబంధించినవి. గిరిజన/ఆదివాసీ ప్రాంతాలు ఖనిజాలు, అటవీ, నీటి వనరులతో సమృద్ధిగా ఉన్నందున, ఈ ప్రాంతాలలో భారీస్థాయి ప్రాజెక్టులను ఏర్పరిచారు. దానితోపాటు గిరిజనేతరుల వలసలతో గిరిజన/ఆదివాసీ సమాజాలు తమ గత సామాజిక ఆర్థిక సమతౌల్యతను, పరస్పర ఆధారపడే సంబంధాలను కోల్పోతున్నాయి. నెహ్రూ అభివృద్ధి నమూనా పేదరికం, అజ్ఞానం, వ్యాధులు, అవకాశాల అసమానతలను నిర్మూలించడంమీద కేంద్రీకృతమైంది. ఈ ఆర్థికాభివృద్ధి నమూనా గిరిజన/ఆదివాసీ ప్రాంతాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంపై దృష్టిపెట్టింది, కానీ ఇది గిరిజన/ఆదివాసీ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. 1990లలో ప్రవేశపెట్టబడిన కొత్త మార్కెట్–ఆధారిత ఆర్థిక నమూనా, ఆదివాసీ/ఆదివాసీ హక్కులను మరింత దెబ్బతీసింది. బహుళ–జాతీయ మైనింగ్ కంపెనీల తరపున రాజ్యం దళారీగా వ్యవహరిస్తూ, గిరిజన/ఆదివాసీ ప్రాంతాలలో హక్కులకు, అభివృద్ధికి మధ్య ఉన్న అంతరాన్ని పెంచింది. ఈ అభివృద్ధి ప్రక్రియ, గిరిజన/ఆదివాసీ ప్రజల హక్కులకు, వారి భూములపై ఆధిపత్యం కోల్పోయే పరిస్థితులను సృష్టించింది.

**ఎక్స్ట్రాక్టివిజం: అభివృద్ధి పేరుతో వనరుల దోపిడీ**

అభివృద్ధి పేరుతో ప్రైవేట్, ప్రభుత్వ యాజమాన్యంలోని మైనింగ్ కార్పొరేషన్లు, ముఖ్యంగా ఖనిజాలు, శిలాజ ఇంధనాల దోపిడీతో సంబంధం ఉన్న ఎక్స్ట్రాక్టివిజం పట్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. ఈ వ్యతిరేకత లాటిన్ అమెరికాలో మొదలైంది. అక్కడ ఎక్స్ట్రాక్టివిజం అనేది దేశాలు, ప్రజలు, వనరులను ఎక్కువగా ప్రైవేట్ బహుళజాతి మైనింగ్ కంపెనీల దోపిడీకి గురయ్యాయి. ఎక్స్ట్రాక్టివిజం అనే భావనను ఒక దేశంలో ఖనిజాలను, శిలాజ ఇంధనాలను, వనరులుగా సేకరించే ఆర్థికవ్యవస్థగా అర్థం చేసుకోవచ్చు. ఈ విధానం, అనేక సందర్భాల్లో, ప్రజల జీవితాలను, భూములను, సామాజిక–ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. మన దేశంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'కోల్ ఇండియా లిమిటెడ్' వంటి సంస్థలు కార్మికుల హక్కులను పరిరక్షించడానికి కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, స్థానిక ప్రజలు మాత్రం ఇంకా దోపిడీకి గురవుతూనే ఉన్నారు. ఎక్స్ట్రాక్టివిజం సామాజిక–ఆర్థిక, రాజకీయ ప్రవర్తనను కలిగి ఉంటుంది. ఇది ఒక అసమాన పవర్– స్ట్రక్చర్ సృష్టిస్తుంది. వారు తమ పూర్వికుల భూములమీద ఆధిపత్యాన్ని కోల్పోతారు. ఇది ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రజల భూమి, వనరులు, జీవనవిధానాల దోపిడీ వ్యవస్థగా మారుతుంది. దీనికి వ్యతిరేకంగా స్థానిక సమాజాలు పోరాడుతున్నాయి. Gupta and Padel (2022) ఎక్స్ట్రాక్టివిజాన్నీ ఒక అసమాన శక్తి నిర్మాణంగా వర్ణించారు. ఇందులో బలవంతపు భూమి సేకరణ అనేది ప్రధాన అంశం. వీరి ప్రకారం ఈ ప్రక్రియను "అంతర్గత వలసవాదం" గ అభివర్ణించవచ్చు. ఎందుకంటే ఇది స్థానిక ప్రజల భద్రతను, వారి జీవనవిధానాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఈ దోపిడీ ప్రక్రియలో భద్రతా దళాలు కార్పొరేట్

సంస్థల హక్కులను రక్షించడంలో పెద్ద పాత్ర పోషిస్తాయి, కానీ ఇదే స్థానిక ప్రజలను తీవ్రమైన రాజ్యహింసకు గురి చేస్తుంది. గిరిజన సంఘాలు తమ భూమి, వనరుల రక్షణకోసం పోరాడుతున్నప్పుడు, రాజ్యం, ప్రభుత్వాలు వారి సంపద, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలను ధ్వంసంచేసే ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. Vaditya (2021) ప్రకారం, ఈ అణచివేతను ఎదుర్కొంటున్న గిరిజనులు/ఆదివాసీలు చాలా రకాలుగా నష్టపోతున్నారు. ఇది వారి స్వీయ-నిర్ణయాధికారాన్ని, ఆత్మగౌరవాన్నీ దెబ్బతీస్తున్నాయి/ గిరిజన సమాజాలు తమ స్వంత జీవన విధానాన్ని రక్షించుకోవడానికి ఎక్స్ట్రాక్టివిజానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. మార్కెట్ వ్యవస్థకు, భూదోపిడీకి, కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా వారి ఉద్యమం జరుగుతోంది. వారు తమ సంస్కృతి పవిత్రతను, జీవవిధానాన్ని, ఆదివాసీ విలువలను పునరుద్ధరించడానికి ఒక వేదికగా మలచుకున్నారు (Martinez-Alier 2022). భారతదేశంలో ఖనిజాల వెలికితీత -ఆధారిత పరిశ్రమలను వ్యతిరేకించే ఉద్యమాలు సైనికీకరణను ఎదుర్కొన్నాయి అని Gupta and Padel (2022) వివరించారు. దీనితో, 'సంస్థాగతమైన హింస' స్థానిక ప్రజలను జీవనంలో ఒక భాగంగా మారింది.

ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో, ఆదివాసీ-జనావాస ప్రాంతాల్లో గమనించదగ్గ విషయమేమిటంటే మైనింగ్ కంపెనీలు ఈ ప్రాంతాల్లో మైనింగ్ తోపాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) పేరుతో విద్యను తమ చేతుల్లో తీసుకొని ఆదివాసీ జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. Pyke (2022, 58) ప్రకారం, ఈ CSR విద్యా కార్యక్రమాలు, ఆదివాసీ సమాజాలకు వ్యతిరేకంగా, గతంలో ఐరోపా వలసరాజ్యాల సమయంలో ఎదుర్కొన్న సమానమైన అణచివేతకు, సాంస్కృతికంగా ఆధిపత్యానికి గురిచేస్తున్నాయి. Gupta and Padel (2022) ప్రకారం, మైనింగ్ కంపెనీలు స్థానిక ప్రజల భూమి, వనరులను దోపిడీ చేయడమే కాకుండా, విద్యావ్యవస్థను కూడా వారి ఆధిపత్యానికి ఆయుధంగా ఉపయోగిస్తున్నాయి. ఈ విధంగా, CSR అనేది స్థానిక ప్రజల సంస్కృతి, భాషలు, జ్ఞానపరమైన సంపదను నాశనం చేసే ఒక మార్గంగా మారుతోంది. ఆదివాసీ ప్రజల దృష్టికోణంలో, ఎక్స్ట్రాక్టివిజం అనేది కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, అది ప్రజలను వారి స్వంత భూమినుండి తరిమివేయడం, వారి సామాజిక, సాంస్కృతిక, భాష, జ్ఞాన సంపద నాశనం చేయడం కూడా అవుతుంది. ఈ ప్రక్రియ ద్వారా స్థానిక ఆదివాసీ సమాజాలు తమ ప్రాదేశిక సార్వభౌమాధికారాన్ని, సంస్కృతులను, జ్ఞానంలాంటి మూలాలనుండి దూరమవుతున్నాయి. ఈ ప్రక్రియ సాంకేతికంగా "జ్ఞానశాస్త్ర విచ్ఛిత్తి" (epistemic disintegration) కు దారి తీసింది. ఇది గిరిజన/ఆదివాసీ సమాజాలకు తీవ్ర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నష్టాలను మిగిల్చింది. Bodhi (2022, 70) అభిప్రాయం ప్రకారం, assimilation ప్రక్రియవలన గిరిజన/ఆదివాసీ సమాజాలు వారి రాజకీయ శక్తి, గుర్తింపు, భాష, చరిత్ర, సామాజిక సరిహద్దులను కోల్పోతున్నాయి. ఇండోనేషియా-ఆక్రమిత వెస్ట్ పాపువాలో, మైనింగ్ కార్పొరేట్ సంస్థలు, ముఖ్యంగా అమెరికాకు చెందిన మైనింగ్ కంపెనీ ఫ్రీపోర్ట్-మెక్మోరన్, దాని ఇండోనేషియా అనుబంధ సంస్థ PT ఫ్రీపోర్ట్ ఇండోనేషియా, స్థానిక ప్రజల సంస్కృతి, భాష, జీవనశైలిపై తమ ఆధిపత్యాన్ని పెంచడానికి వివిధ విద్యాకార్యక్రమాలను ప్రవేశపెట్టాయి. ఈ కార్యక్రమాలు, ముఖ్యంగా స్థానిక తెగలను assimilate ఉద్దేశంతో పనిచేస్తున్నాయి. అదే విధంగా భారతదేశంలోని ఒడిస్సాలోని కళింగ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (KISS), మలేషియాలోని పెట్రో-కెమికల్ కంపెనీ పెట్రోనాస్ అనుబంధ సంస్థ అయిన పెట్రోసైన్స్, తమ వ్యాపార అభివృద్ధి ప్రాజెక్టులలో భాగంగా ఒరాంగ్ అస్లీ (స్థానిక జనాభా) ప్రజలను జాతీయ సంస్కృతిలో సమ్మిళితం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించాయి. ఈ చర్యలు స్థానిక తెగల సంస్కృతులను నాశనం చేయడం వారి స్వతంత్ర భావాలను, సంప్రదాయాలను అణచివేయడం అనే ఉద్దేశంతో నడుస్తున్నాయి. ఈ ప్రయత్నాలు స్థానికుల సాహిత్య, భాష, సాంస్కృతిక అసమానతలను పెంచి, మూలసంస్కృతిని, వ్యక్తిత్వాన్ని, స్థానిక జ్ఞానాన్ని ఈ మైనింగ్ కంపెనీల ఆధిపత్యం కిందికి తీసుకొస్తున్నాయి. ఇది స్థానిక తెగల ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చి ఎక్స్ట్రాక్టివిజంకు, వలసవాద విద్యావిధానాలకు తోడ్పడుతున్నాయి (Pyke 2022).

భారతదేశంలో కులానికి పెట్టుబడిదారి విధానానికి అవినాభావ సంబంధం ఉంది. కుల-పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తూ, Padel (2015) భారతదేశంలో కొనసాగుతున్న అధికార నిర్మాణాలను విమర్శించాడు. ఆయన ప్రకారం, బ్రిటీష్ పాలనలో ఆదివాసీ/గిరిజన సమాజాలపై విధించిన వ్యవస్థలు అనేక సంవత్సరాల తరువాత కూడా ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నాయి అని వాదించాడు. ఆయన సూచించినట్లుగా, రాజ్యం అనేది ఒక "సంస్థాగత దోపిడీ"కి ఒక రూపంగా పని చేస్తుంది.

ఇక్కడ పాలనా, అధికార యంత్రాంగాలు వలసవాద విధానాలను కొనసాగిస్తూ, అట్టడుగు వర్గాలను, ముఖ్యంగా గిరిజన జనాభాను దోపిడీ చేయడం కొనసాగిస్తాయి. Vaditya (2021) కూడా ఈ అంశాన్ని గుర్తించారు, ఆయన వాదన ప్రకారం, భారతదేశంలోని గిరిజన జనాభా కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానం, రాజ్య యంత్రాంగపు ఊబిలో చిక్కుకునిపోయింది. Bates & Shah (2014) ప్రకారం ఆదివాసీ పోరాటాలు, నయా ఉదారవాద అభివృద్ధి నమూనా పరస్పరం వ్యతిరేకతతో ఎదురెదురుగా ఉన్నాయని సూత్రీకరించారు. ఆదివాసీ పోరాటాలు సాధారణంగా దోపిడీని వ్యతిరేకించి భూమి, సంస్కృతి, వనరులను సంరక్షించడంపై దృష్టి పెట్టాయి, కాగా నయా ఉదారవాద మార్కెట్-ఆధారిత విధానాలు, ప్రైవేటీకరణ,, బహుళజాతి మైనింగ్ కంపెనీల నియంత్రణలను ప్రోత్సహిస్తుంది, ఇది ఆదివాసీ ప్రాంతాలను మార్కెట్ వస్తువుగా మారుస్తూ స్థానిక ప్రజల జీవనానికి తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. కుమార్ (2014) ప్రకారం, సహజ వనరుల "వెలికితీత" అనేది ముఖ్యంగా ఒడిశా వంటి రాష్ట్రాల్లో ప్రతిఘటన ఉద్యమాలకు దారితీసింది. అక్కడ కాశీపూర్, చిలికా, నియమగిరి, కళింగనగర్,, పోస్కో వ్యతిరేక ఉద్యమాలు, పారిశ్రామిక ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఇతర ఉద్యమాలు నడుస్తున్నాయి. Patnaik (2010) పరిశీలించినట్లుగా, ఒడిశాలో రెండు ముఖ్యమైన ఉద్యమాలు, ఉత్కల్ అల్యూమినియం ఇంటర్నేషనల్ లిమిటెడ్ (UAIL), వేదాంత అల్యూమినియం లిమిటెడ్ (VAL) వంటి మైనింగ్ పరిశ్రమలకు వ్యతిరేకంగా జరిగాయి. ఈ ఉద్యమాలు పారిశ్రామిక ప్రాజెక్టుల దోపిడీని వ్యతిరేకించడమే కాక, మానవ హక్కులు, పౌర హక్కులు, సహజ హక్కుల ఉల్లంఘనల పరిరక్షణను కూడా కాపాడడానికి జరిగాయి. భూక్యా (2021) అభిప్రాయం ప్రకారం, గిరిజన సమస్య కేవలం జ్ఞాన పరిరక్షణే (epistemic) కాకుండా, అది ముఖ్యమైన రాజకీయ సమస్యకూడా. అది కులం-వలసవాదం, కుల జ్ఞానశాస్త్రం (caste-epistemology) నుండి తెగలను కాపాడాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. ఈ లక్ష్యాలను సాధించడానికి, భూ, రాజకీయ, ఆర్థిక, జ్ఞానశాస్త్రాలపరంగా వారు కోల్పోయిన స్వయంప్రతిపత్తిని తిరిగి పొందే అవసరం ఎంతైనా ఉంది. దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ పాలనకాలంలో ఆదివాసీలను ఆదివాసీయేతరుల నుండి రక్షించడానికి, వారిని వేరుగా ఉంచే పద్ధతిని కొన్ని ప్రాంతాల్లో అమలు పరిచారు. స్వాతంత్ర్యం అనంతరం, వారిని భారతీయ సమాజంలో సమాన భాగస్వాములుగా చేర్చడం అనేది దేశ నిర్మాణంలో కీలకమైన అంశం. ఆదివాసీ సమాజం ఆర్థిక అభివృద్ధిలో సమాన భాగస్వామ్యాన్ని కలిగి, దేశ ప్రగతిలో వారి పాత్రను దోపిడీ లేని విధంగా పోషించడం అవసరం.

**ముగింపు**

స్వాతంత్ర్యానికి పూర్వం, బ్రిటీష్ వారు మినహాయించబడిన (excluded), పాక్షికంగా మినహాయించబడిన (partially excluded) ప్రాంతాలను సృష్టించడం ద్వారా దేశంలోని ఆదివాసీ ప్రజలను మిగితా దేశప్రజలనుంచి దూరంగా ఉంచడానికి ప్రయత్నించారు. స్వాతంత్ర్యానంతరం, ఈ దూరాన్ని తగ్గించి దేశ నిర్మాణానికి ఆదివాసీలను మిగిలిన భారతీయ సమాజంలో కలపడం ఒక తప్పనిసరి మార్గంగా అనుకున్నారు. ఆర్థికాభివృద్ధిలోను, దేశ ప్రగతిలోను వారికి సమాన భాగస్వామ్యం కల్పించాలనే ఒక ఆలోచన చేయడం జరిగింది. కానీ ఆదివాసీ అభివృద్ధి విధానం స్వాతంత్ర్యం తరువాత, integrate, చేయడానికి ఒక మధ్యేమార్గంగా అనుకొని అమలుచేసినప్పటికీ వారిని దోపిడీ ఆర్థిక శక్తులనుంచి కాపాడుకోలేకపోయాం. పరిపాలనావ్యవస్థలో ఉన్న ఉదాసీనత కారణంగా, భారత ప్రభుత్వం ఆదివాసీలను సమగ్రంగా అభివృద్ధి చేయడంలో విఫలమైందనవచ్చు. ఆదివాసీలను ఒక వెనకబడిన సామాజికవర్గంగా చూడడం అది వారిని కులసమాజంలో మిళితం చేయడంవల్లనే వారి అభివృద్ధి సాధ్యమనుకున్నారు పాలకులు. వారిని అర్థంచేసుకునే ఇటువంటి విధానంలో మార్పులేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. దానికి తోడు ప్రస్తుత అభివృద్ధి నమూనా పాశ్చాత్య, కుల-సమాజ ఆధిపత్యాలమీద ఆధారపడింది. ఐతే ఆదివాసీ/గిరిజన సమాజం అభివృద్ధికి వ్యతిరేకం కాదు. కానీ నిజానికి వారు కోరుకుంటుంది దోపిడీ లేని సమానత్వంతో కూడిన అభివృద్ధిని. వారు డిమాండ్ చేస్తున్నది అభివృద్ధి అనేది తమ భూములు, సంస్కృతి, భాష, జ్ఞానాన్ని పరిరక్షించే విధంగా ఉండాలని. అదానీ వంటి భారతీయ ఖనిజ వెలికితీత కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ, సామాజిక దోపిడీకి ఒక ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ఉదాహరణకు, అదానీ గ్రూప్ జార?ండ్లోని గొడ్డా జిల్లాలో, పవర్ స్టేషన్ నిర్మించడానికి బొగ్గును ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుండి దిగుమతి చేసుకుంటుంది. ఈ బొగ్గును ఒడిశాలోని ధమ్రా పోర్ట్ ద్వారా దిగుమతి చేసుకొని,

రైలు ద్వారా గొడ్డా జిల్లాకు తీసుకువెళ్లి, అక్కడ విద్యుత్ ఉత్పత్తిచేయడం జరుగుతుంది. కానీ ఈ విద్యుత్ను, బంగ్లాదేశ్కు విక్రయిస్తుంది. ఇది స్థానిక ఆదివాసీలకు పర్యావరణపరంగాను జీవనోపాధిపరంగాను తీవ్ర ప్రతికూల ప్రభావాన్నీ చూపిస్తుంది. ఇది, మైనింగ్, విద్యుత్ ఉత్పత్తి, విదేశీ మార్కెట్లకు ఉత్పత్తిని ఎగుమతిచేసే క్రమంలో, స్థానిక ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను తీవ్ర విఘాతం కలిగిస్తుంది. ఇది ఖనిజ వెలికితీతవాదం యొక్క తీవ్రతను చూపిస్తుంది.

**ఉపయుక్త రచనలు**


1. Bates, C. & Shah, A. (Eds.). 2014. Savage Attack: Tribal Insurgency in India, New Delhi: Social Science Press.

2. Bhukya, B. 2021. Featuring Adivasi/Indigenous StudiesEconomic & Political Weekly, 56(25), pp.13-17.

3. Bodhi S.R. 2022 Tribal Studies in India: Pre and Post-Xaxa, Journal of Tribal Intellectual Collective India 6(1): 59-76.

4. Elvin, Verrier. 1957. A Philosophy for NEFA. Shillong: Director of Information, NEFA.

5. Furer-Haimendorf, Christoph Von. 1977. Tribal Problems in India in RomeshThappar (Eds) Tribe, Caste and Religion in India, New Delhi: The Macmillan Company.

6. Gandhi, Malli and Vakulabharanam Lalita 2016. Tribal Culture in Andhra and Telangana: Tradition and Change, New Delhi: Manak Publications Pvt. Ltd.

7. Government of India. 2013. Statistical Profile of Scheduled Tribes in India. New Delhi: Ministry of Tribal Affairs. Statistical Division.

8. Gupta, Malvika and Felix Padel. 2022. The Problem, Seminar 751 (March 2022): 10-16.

9. Kumar, K. 2014. Confronting Extractive Capital: Social and Environmental Movements in Odisha, Economic & Political Weekly, 49 (14): 66-73

10. Martinez-Alier, Joan. 2022. Extractivism, Indigenous Resistance and Revival Worldwide, Seminar 751 (March): 17-24.

11. Nongkynrih, A K. 2010. Scheduled tribes and the Census: A sociological Inquiry, Economic & Political Weekly, 45 (19): 43-47.

12. Padel, F. (2015). Sacrificing People: Invasion of Tribal Landscape, Hyderabad: Orient Black Swan.

13. Patnaik, P. (2010). A Left Approach to Development, Economic & Political Weekly, 45 (30): 33-3

14. Pyke, Lewis. 2022. Mining Sponsored Education In West Papua, Seminar 751 (March): 56-58.

15. Reddy, M. Gopinath and K. Anil Kumar. 2010. Political Economy of Tribal Development: A Case Study of Andhra Pradesh, Working Paper, Hyderabad: CESS.

16. Vaditya, Venkatesh. 2021. Human Rights, Development and Tribal Movements in India: Critical Reflections, Social Action 71(3):311-323.

17. Xaxa, Vani. 2022. The Trauma of Being Regrouped In Chhattisgarh, Seminar 751 (March):30-35.

18. Xaxa, Virginious. 2014. State, Society and Tribes: Issues in Post-Colonial India, New Delhi: Pearson.


★ రచయిత:అసోసియేట్ ప్రొఫెసర్, ఇఫ్లూ

# మనుస్మృతి - రాజ్యాంగం

డా॥హారతి వాగీశన్

**భారతదేశం – సంప్రదాయం, ఆధునికత**

పాత నాగరికతతో పూర్తి తెగతెంపులు చేసుకోకుండానే, ఆధునిక వర్తమాన జీవితాన్ని సాగిస్తున్న కొన్ని సమాజాలలో భారత సమాజం ఒకటి. వ్యక్తి స్వేచ్ఛ, హేతుబద్ధ విచారణ, పెట్టుబడిదారీ ఉత్పత్తి అనే ఈ మూడు భావనలు కలిసి సాగే ఆధునికతతో (వాస్తవానికి ఆధునికత కేవలం పెట్టుబడిదారీ విధానానికి సర్వ సమానం కాదు) వర్తమాన సమాజం ఎట్లా సర్దుబాటు చేసుకోవాలి? గతంలో మొదలై వర్తమాన కాలంలో కూడా కొనసాగే సామాజిక, సాంస్కృతిక, రాజకీయార్థిక సమస్యలను పరిష్కరించుకోవడం ఎట్లా? రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక గణతంత్రపు మౌలిక విలువలయిన పుట్టుక, పునాది వివక్షతలు, సామాజికార్థిక అసమానతలను నిర్మూలించు కోవడం ఎట్లా? అనేవి మన ముందున్న పెద్ద ప్రశ్నలు.

ఈ ప్రశ్నలకు సమాధానాలను మనం వర్తమానంలో వెతుక్కోవాల్సి ఉంటుంది. దీనికి అవసరమైన సాధనాలను యూరోపియన్ వలస వాదానికి వ్యతిరేకంగా జరిగిన రెండు శతాబ్దాల పోరాటంలో వెతుక్కోవచ్చు. మన రాజ్యాంగం, అది నిలిపిన విలువలను సమాజంలో పెంచడం ద్వారా వాటిని సాధించుకోవచ్చు. అయితే ఈ ఆలోచనను సాంస్కృతిక ఉనికి రాజకీయాలు అనే పేరిట మెజారిటీ మత తత్వాన్ని వాడుకుని రాజకీయాలు చేస్తున్న వాళ్ళు ఒప్పుకోవడం లేదు. వీరు ప్రధానంగా మత సమూహ వాదులు. బహుళ సంస్కృతులు ఉండే జాతి నిర్మాణానికి వీరు వ్యతిరేకులు. మత విభజన వాదాన్ని, మనుషుల మధ్య ఐక్యతను పెంచే ఆలోచనగా ప్రచారం చేసే రాజకీయ ఆచరణవాదులు. నెహ్రూ, లోహియా వంటి ఆధునిక చింతనాపరుల దృష్టిలో వీరు జాతి వ్యతిరేకులు.

**హిందూ పునరుద్ధరణ వాదం – మనుస్మృతి**

హిందుత్వ వాదులు వాస్తవ పరిస్థితిని కనుమరుగు చేసి, మనుస్మృతిని ప్రాచీన భారత రాజ్యాంగంగా చిత్రిస్తున్నారు. ఈ వాదనను గత కాలంలో ముఖ్యంగా ఆర్యసమాజం వాళ్ళు చేసేవారు. నేడు ఆర్య సమాజం వాళ్ళ వాదనను అడ్డుపెట్టుకొని తిరోగామి హిందూత్వ వాదులు, ఆధిపత్య కుల వాదులు మనుస్మృతిని ప్రాచీన భారత రాజ్యాంగం – శిక్షా స్మృతి అనే పేరుతో ప్రచారం చేస్తూ జనంలోకి తీసుకెళ్తున్నారు.

19 శతాబ్ది నాటి బ్రిటీష్ పాలనలోని భారతీయులకు ఒక రకమైన, ఏక రూప మతం లేదు. ఈ ఆందోళన నుండి పుట్టిన కొత్త మతాలలో ఆర్య సమాజం ఒకటి. గుజరాత్‌లోని కథియా వాడ్ ప్రాంత బ్రాహ్మణ పండితుడు మూల శంకర్ తివారీ సన్యాసం తీసుకుని దయానంద సరస్వతిగా మారారు. ఆ తర్వాత 1875లో ఆర్య సమాజం అనే మతాన్ని స్థాపించారు. సత్యార్థ ప్రకాశం వీరి ప్రామాణిక గ్రంథం. వేదాలకు ప్రామాణిక నూతన వ్యాఖ్యానం చేయడం, పురాణ సాహిత్యాన్ని తిరస్కరించడం, వర్ణ – జాతి భావనలకు పుట్టుక పునాది కాదు అని వాదించడం, విగ్రహారాధనను తిరస్కరించడం, పుట్టు బ్రాహ్మణ ఆధిపత్యాన్ని తిరస్కరించడం ఈ మతంలోని ప్రధాన విషయాలు.

మనుస్మృతిలో అనేక విపరీతాలు, ప్రక్షిప్తాలు ఉన్నాయనీ, వాటిని తీసివేస్తే అది కూడా ఆర్య మత జీవనానికి అనుకూలమయిన ప్రాచీన స్మృతి అవుతుందని అని వీరి ప్రతిపాదించారు. ఇన్ని రకాలుగా మనుస్మృతి గురించి మాట్లాడినా అది వారి ప్రధాన గ్రంథం కాదు. మనుస్మృతి తెలుగులోకి ఎప్పుడో అనువాదం అయింది. అనువాదాలు చేసిన వారు ఎవరూ దీన్ని ప్రాచీన భారత రాజ్యాంగం అని గానీ, శిక్షా స్మృతి అని గానీ చెప్పలేదు. దీన్ని అందరు దృష్టిలో పెట్టుకోవాల్సిన విషయం.

భారతదేశంలో హిందూమత సంస్కరణ, ఆధునిక విలువల పెంపు అనేవి ఆర్య సమాజ ఒక ముఖం లక్ష్యాలు కాగా, మతతత్వ రాజకీయాలకు, జాతీయత స్వభావాన్ని ఇవ్వడం దాని మరో ముఖం. హిందూ మత పునరుజ్జీవన భావన

జాతీయత భావ రాజకీయాలకు అత్యవసరం అని ఆర్య సమాజం భావించింది. ఈ దిశగా రాజకీయాలకు పశ్చిమ ఉత్తర భారత దేశంలో సహకారం అందిస్తుంది. ఈ మతానికి చెందిన స్వామి శ్రద్ధానంద (1856–1926) తీవ్ర హిందుత్వవాద ప్రతిపాదకుడు. ఈయనే ముస్లింలీగ్ కంటే ముందే దేశాన్ని మత ప్రాతిపదికన విభజించాల్సి ఉంటుందన్న భావాలను వెలిబుచ్చాడు.

బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన కుల నిర్మూలన పేర ప్రచారంలో ఉన్న "అన్‌హిలేషన్ ఆఫ్ కాస్ట్" ప్రసంగం రాసేదానికి కారణం, ఆనాటి ఆర్య సామాజిక వాదులు ప్రారంభం చేసిన "జాత్ పాత్ తోడక్ మండల్" వారు ఇచ్చిన ఆహ్వానమే. బాబా సాహెబ్ ఆ ప్రసంగంలో చేసిన వాదనలు ఎక్కువ తీవ్రంగా ఉన్నాయని, తన ప్రసంగ వ్యాసాన్ని మార్చాల్సిందిగా అంబేద్కర్‌ని అడిగారు. బాబా సాహెబ్ ఆ కోరికని తిరస్కరించి ప్రసంగాన్ని వేరే పుస్తకంగా వేశారు.

1950 నాటి రాజ్యాంగం గొప్పదేమీ కాదనీ, దాన్ని విశ్వసించాల్సిన పని లేదని హిందుత్వ వాదుల ప్రచారం. ఈ రాజ్యాంగం సంప్రదాయ వ్యతిరేకము, దానిలో భారతీయ వారసత్వం ఏమీ లేదనీ, భారత రాజ్యాంగం అభారతీయ శాసనం అని భావించడం నాటి హిందుత్వ రాజకీయవాదుల ధోరణి. హిందూ మహాసభ వారు, రామరాజ్య పరిషత్ అనే రాజకీయ పక్షము, ఆర్య సమాజంలోని ఒక పక్షమూ భారత రాజ్యాంగం పట్ల ప్రతికూల ధోరణిని చూపారు. దాన్ని పక్కన పెట్టి హిందూ వివాహ చట్టం మొదలు అనేక సానుకూల, సామాజిక మార్పులకు చట్టబద్ధ ప్రాతిపదికకు రాజ్యాంగమే మూలం అయింది. సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛలను అందించే అనేక చట్టపరమైన ఏర్పాట్లకు, వెసులుబాట్లకు రాజ్యాంగమే పునాది అయింది.

సాంకేతికంగా, రాజకీయ ఆచరణపరంగా ఆధిపత్య కుల వర్గాల వారి అహంకారాలకు, నిరంకుశ అధికార ప్రదర్శనకు ఒక మేర అడ్డుగా ఉన్నది రాజ్యాంగమే. అందుకే గత రెండు మూడు దశాబ్దాల నుండి ఆధిపత్య కుల, వర్గాల నుండి రాజ్యాంగం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఉత్తర భారతదేశంలో దళిత సముదాయాలకు వ్యతిరేకంగా ఉండే బృందాలు రాజ్యాంగాన్ని దహించడం చేయడం ఇటీవలి కాలపు వ్యవహారమే. ఈ రకమైన దుర్మార్గ వ్యూహాలు, ఈ దేశానికి గానీ, ప్రజాస్వామ్యానికి గానీ మేలు చెయ్యవు. ప్రజాస్వామ్యం పట్ల ప్రేమ, ఈ దేశపు చరిత్ర పట్ల విమర్శనాత్మక అవగాహన, దేశం పట్ల అభిమానం, స్వేచ్ఛా, సమానత్వాల పట్ల గౌరవం అనే భావనలకు మనుస్మృతి పునరుద్ధరణ వాదం పూర్తి గా వ్యతిరేకంగా భావిస్తుంది.

కులాంతర వివాహాలను పెద్దఎత్తున ప్రోత్సహించి, వేరే మతాల నుండి వచ్చిన వారికి ఆర్య మతాన్ని ఇచ్చి ఆర్య మతస్తుల నడుమ కులంతో సంబంధము లేకుండా వివాహ సంబంధాలను నెలకొల్పిన ఆర్య సమాజం వారు, ఈ రోజు మను ధర్మ శాస్త్రాన్ని నెత్తికి ఎత్తుకోవడం విడ్డూరం. స్వామి అగ్నివేష్ వంటి గొప్ప సామాజిక స్పృహ గల, పీడిత ప్రజల పక్షపాతులను తయారు చేసిన ఆర్య సమాజం నేడు పాతాళానికి దిగజారింది. మొత్తంగా ఆధిపత్య కుల, వర్గాల అజెండాను మోస్తున్నది. కనీస స్థాయి హిందూ సంస్కరణ వాద బృందాలను సమకాలిక హిందుత్వ, ఆధిపత్య జాతీయవాదులు ఏ తీరులో వాడుకుంటారో తెలిపే ఉదాహరణ ఇది.

హిందూ మతాన్ని ఆధారం చేసుకునే జాతీయ వాద రాజకీయ శక్తులు చాలా బలం పుంజుకుంటున్న నేటి కాలంలో సాంస్కృతిక అంశాలను ఆయుధాలుగా చేసుకుంటుంది. మత వాద రాజకీయవేత్తలు "మన గతం ఎంతో ఘనమైనది, దాన్ని తిరిగి సాధించుకోవాలి" అని వాదిస్తున్నారు. ఆర్యసమాజంలోని ఒక ప్రభావశీల వర్గానికి కూడా అదే చారిత్రక దృక్పథం ఉండటంతో, హిందుత్వ వాదులు వారితో ఇప్పుడు జత కడుతున్నారు.

**మనుస్మృతిని ప్రాచీన భారత దేశ రాజ్యాంగం – శిక్షా స్మృతి అనడం అచారిత్రకం:**

స్మృతులు అనేకం ఉన్నాయి. మనుస్మృతి మాత్రమే భారతదేశాన్ని మొత్తం నడిపిన స్మృతి అనే దానికి ఎటువంటి ఆధారాలు లేవు . పీవీ కాణే పండితుడు రాసిన "హిస్టరీ ఆఫ్ ధర్మ శాస్త్రాస్", పీఠిక చదివిన ఈ సంగతి అర్థం అవుతుంది. ప్రాచీన భారతం నేటి భారతం కన్నా బాహుళత్వాన్ని, వైవిధ్యాన్ని కలిగి ఉన్నది. బాహు స్మృతులు, బహు శ్రుతులు ఈ దేశపు

లక్షణం. అసలు సాంస్కృతికంగా ఆదాన ప్రదానాలు ఉన్న ప్రాంతాలు గల ఈ ఉపఖండం మొత్తంగా ఒకే ఒక పాలన కింద ఒదిగి ఉండలేదు.

సాంస్కృతిక అంశాలలో దగ్గరితనం ఈ నేలలో ప్రత్యేకంగా కనిపిస్తుంది. కానీ అది రాజకీయ ఏక ఛత్ర పాలన కిందికి తర్జుమా కాలేదు. అది ఈ ఉపఖండపు బలహీనత కాదు, దాని బాహుళతకు నిదర్శనం. మౌర్యులు, గుప్తులు, రాష్ట్ర కూటులు, చోళ, చాళుక్య యుగ పాలకులు, మొగలులు, దక్కన్ సుల్తానులు, విజయనగర పాలకులు, మరాఠాలు, సిక్కులు వంటి ప్రభావశీల బృందాలు ఈ ఉపఖండంలో తమ ప్రభావాలను వేశారు. చారిత్రకంగా ఈ నేల బాహుళము. షోడశ మహా జనపదాల నుండి, ఆర్యావర్త, దక్షిణాపథానికి తేడాలు ఉన్నాయి. ఆ బాహుళత ఇప్పటికీ ఏదో ఒక రూపంలో కనిపిస్తూనే ఉంటుంది. ఇక స్మృతి గ్రంథాల విషయానికి వస్తే అది వైవిధ్య సాగరం. ఒక్క మనుస్మృతికే తొమ్మిది వ్యాఖ్యానాలు ఉన్నాయి. భారతీయ విద్యాభవన్ వారు వీటిని ఆరు సంపుటాలుగా పరిశోధించి, ముద్రించారు. అందుకు ఈ ఉప ఖండానికి మొత్తంగా ఒకే ఒక స్మృతి ఉండేదనే వాదనలో బలం లేదు. అఖండ ప్రాచీన భారతానికి ఆమోదం అయిన అఖండ రాజ్యాంగం ఒకటి ఉండేదనే ఆలోచన కేవలం కట్టుకథ అవుతుంది కానీ చరిత్ర కాదు.

**ఆధునిక రాజ్యాంగతా వాదము, మనుస్మృతి అసలు పొసగని భావనలు.**

నియమ బద్ధ పాలన, సమన్యాయం అనే ఆధునిక భావాలు రాజ్యాంగం అనే భావన పుట్టడానికి కారణం. రాజ్యాంగం అనే ఆలోచన, చట్టం ముందు అందరు సమానులే అనే భావన నుండి పుడుతుంది. రాజ్యాంగం అనేది ఒక దేశంలోని ప్రజల పాలనాపర జీవితాలను నడుపుకునే దానికి, కొన్ని మౌలిక విలువల పునాది మీద రూపొందే మౌలిక చట్టం. ప్రజలకు రాజ్యాధికారానికి ఉండే సంబంధం ఏమిటి? ఆ మేరకు ప్రజలకు రాజ్య యంత్రానికి ఉండే హక్కులు బాధ్యతలు ఏమిటి? ప్రభుత్వ అంగాలయిన, శాసన నిర్మాణా, కార్య నిర్వాహక, న్యాయపాలికల రూప కల్పన నిర్వహణ ఎట్లా ఉండాలి? అధికారాల విభజన ఎట్లా ఉండాలి అనే విషయాలు ఏదయినా రాజ్యాంగంలో ఉండే ముఖ్య అంశాలు.

స్మృతులు ఏవీ కూడా చట్టం ముందు అందరూ సమానమే అనే నియమాన్ని నమ్మినవి కావు. స్మృతులు లేదా ధర్మ శాస్త్రాలు అనేవి స్థూలంగా ఆధిపత్య (వర్ణ) సముదాయాలు, తమ దృక్కోణం నుండి సామాజిక జీవనం, ఆమేరకు పాలనా పర విధానాలు ఎట్లా ఉండాలో రాసుకున్న గ్రంథాలు. వాటిలో న్యాయ నియమాలు, వ్యావహారిక అంశాలు ఉన్నప్పటికీ అవి అందరికీ ఆమోదం ఉండే గ్రంథాలు కావు. పై పెచ్చు చాలా స్మృతులు బ్రాహ్మణ , క్షత్రియ, వైశ్య వర్ణాలకు విపరీతమైన పెత్తనాన్ని హక్కులను ఇచ్చి, నాలుగో వర్ణంగా చెప్పబడిన శూద్రులు అనే వస్తూత్పత్తి ప్రధాన కులాలకు విపరీతంగా బాధ్యతలను, లొంగుబాటును, తీవ్ర హింసాత్మక శిక్షలను నిర్దేశించే వాటిగా ఉన్నాయి.

స్మృతులు అన్నీ దైవ దత్త అధికారాన్ని, వర్ణాశ్రమ ధర్మాల రక్షణను, విధులను, నిషేధాలను పేర్కొంటాయి. వర్ణ సంకరం మహా పాపంగా పేర్కొన్నాయి. స్మృతులలో పేర్కొన్న, సామాజిక నియమాల ఉల్లంఘనకు విధించిన శిక్షలు, పుట్టుక పునాది వర్ణ జాతి విధానాన్ని, హెచ్చు తగ్గులను ఎత్తిపట్టినాయి. తక్కువ వర్ణాలకు ఎక్కువ శిక్ష అనే స్థూల సూత్రాన్ని అవి పాటించాయి. ఆ మేరకు అవి స్వేచ్ఛా, సమానత సామాజిక న్యాయం అనే ఆధునిక రాజ్యాంగతా వాదానికి పూర్తిగా వ్యతిరేకం. స్మృతులలో సమానత్వం, స్వేచ్ఛలను వెతకడం కుందేటి కొమ్ముకోసం వెతకడం వంటిదే. స్మృతిని రాజ్యాంగం అని పిలవడం దురుద్దేశ్య పూరితం.

**రాజ్యాంగతా వాదం – స్మృతి ఆచరణల నడుమ ఘర్షణ:**

బ్రిటిష్ వలస పాలన భారతదేశ పాలనా రంగంలోకి, (అనేక పరిమితులతో కూడిన) చట్ట ప్రధాన పాలన అన్న భావనను తీసుకు వచ్చింది. ఈ పరిణామాలు ఒక మేరకు, హక్కులకు దూరం చేయబడిన ప్రజలకు ఏదో కొంత మేర పోరాడే గొంతుకను, హక్కులను అందించాయి.

1923లో బ్రిటిష్ పాలిత బాంబే రాష్ట్ర శాసన సభ సర్కారు వారు నిర్మించిన చెరువులలో అన్ని జాతుల వారికి ప్రవేశం ఉంటుందనే నియమం చేసింది. ఇది బ్రిటిష్ ఇండియా చట్టాల ప్రకారం రూపొందిన రాజ్యాంగబద్ధ నియమం. మహద్ మునిసిపాలిటీ 1927 నాటికి ఈ ఉత్తర్వును తన కౌన్సిల్‌లో

కూడా ఆమోదించింది. అక్కడ ఉన్న చవదర్ చెరువు అందరిది అని తీర్మానం అయిన తర్వాత మహద్‌లోని ఆధిపత్య వర్ణాలు, అంటరానివారు చెరువు నీళ్ళు వాడుకోకూడదనే పట్టు పట్టారు.

1927లో రెండు సార్లు బాబా సాహెబ్ అంబేద్కర్ ఇక్కడ సత్యాగ్రహం చేశారు. సామాజిక జీవనంలో అందరు ప్రజలకు సమాన హక్కును ఇచ్చే ఆధునిక రాజ్యాంగ విలువ ప్రమాణంగా స్వీకరించాలా? లేదా ఆధిపత్య వర్ణాలకు మాత్రమే అన్ని అధికారాలు కట్టగట్టే మనుస్మృతి ప్రమాణమా? అన్న చర్చను బాబాసాహెబ్ నిర్మించారు.

కొన్ని వర్గాలకు మాత్రమే అన్ని సౌకర్యాలు కల్పించి, మరికొందరికి బానిసత్వాన్ని, నిషేధాలు విధించే మనుస్మృతి వంటి స్మృతులు ప్రమాణము కావని ప్రతిపాదించారు. స్థానిక సంస్కర్తలు, అంటరానితనాన్ని వ్యతిరేకించే పోరాట వాదుల మద్దతుతో ఈ చర్చలకు విస్తృత ప్రచారం కల్పించి, పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో భాగంగా వేలాది మందితో మహద్ చెరువులోని నీరు తాగడం, తరువాత మనుస్మృతిని దహించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల అనంతరం ప్రాచీన శ్రుతుల కంటే ఆధునిక రాజ్యాంగతా వాదం మేలు అన్న భావన విజయం సాధించింది.

1927లో ప్రతీకాత్మకంగా దహనం చేయబడిన మనుస్మృతిని 1950 నాటి భారత రాజ్యాంగం పూర్తిగా తిరస్కరించింది. భారతదేశ పౌరులందరికీ సమానత్వాన్ని, స్వేచ్ఛను, సామాజికార్థిక, రాజకీయ న్యాయాన్ని ఇచ్చే దానికి పూచీగా భారత రాజ్యాంగం నిలిచింది. అటువంటి రాజ్యాంగం పుట్టిన నాటి నుండి నోటితో పొగిడి, చేతల ద్వారా దాన్ని వ్యతిరేకించే బలమైన కుల వర్గ శక్తులూ మన నడుమనే ఉన్నాయి. ఈ రిపబ్లిక్ మొదటి నలభై ఏండ్ల కాలంలో ఈ కుల వర్గ శక్తులు, కొంచం ముసుగు వేసుకుని ఉండేవి.

హిందుత్వ రాజకీయాలు, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, అన్ని జీవన రంగాలలో కేవలం లాభం, నష్టం అనే వాణిజ్య తర్కాన్ని చొప్పించాయి. దాంతో ఈ శక్తులు బాగా బలపడి బహిరంగంగా, ముసుగులు లేకుండా రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ప్రాచీన స్మృతులను అందునా మనుస్మృతిని, ప్రాచీన భారత రాజ్యాంగం – శిక్షా స్మృతి అని పిలవడం ద్వారా వాటికి లేని గౌరవాన్ని తెచ్చిపెట్టే పనిని ఆధిపత్య కుల, వర్గాల వారు పూనుకుని చేస్తున్నట్టు అర్థం అవుతున్నది. మాకు రాజ్యాంగం కంటే, మా ఆధిపత్యాన్ని ఎత్తిపట్టే స్మృతులే ముఖ్యమని ప్రకటిస్తున్నారు.

1970 లలో పుట్టిన పౌరహక్కుల ఉద్యమాలు ఒక మేర రాజ్యాంగ హక్కుల గురించి, వాటి సాధన గురించి ప్రజలలో కొంత చైతన్యాన్ని తీసుకువచ్చాయి. 1990ల తరువాత భారత రాజ్యాంగాన్ని దోపిడి శక్తుల డాక్యుమెంట్ అని భావించే విప్లవ వామపక్ష రాజకీయాలు వెనుకపట్టు పట్టినాయి. దళితులు, ఇతర పీడితులు రాజ్యాంగాన్ని ఒక పురోగామి స్వభావం ఉన్న శాసనంగా, తమ బాగు కోసం పనికి వచ్చే సాధనంగా, దాన్ని కాపాడుకోవాల్సిన దానిగా భావించడం మొదలయింది. రాజ్యాంగం పుట్టిన 60 నుండి 70 ఏండ్ల తరువాత ప్రజలకు రాజ్యాంగం మీద ఆసక్తి, మక్కువ కలగడం మొదలయింది. ఇదే కాలంలో ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో రాజ్యాంగ దహనాలు సాధారణం కావడమూ గమనార్హం.

చారిత్రకంగా ఆధిపత్యాన్ని నెరుపుతున్న పాలక కుల, వర్గాలకు, పాలిత, పీడిత కుల వర్గాలకు నడుమ అధికార అసమతుల్యాన్ని తొలగించడానికి రాజ్యాంగం తోడ్పడుతుంది. వ్యక్తి స్వేచ్ఛా, కనీస పాదార్థిక సమానత్వం, సమన్యాయం అనే వాటిని దీర్ఘకాలంలోనయినా శాంతియుతంగా, సామరస్యంగా సాధించవచ్చు.

అట్లా కాక మనుస్మృతిని ప్రాచీన రాజ్యాంగం శిక్షాస్మృతి అనే పేరిట తిరగరాయడం అంటే, మతవాద రాజకీయాలను పెంచి పోషించడమే. ఎన్నికలు మాత్రమే ప్రజాస్వామ్యం అని, పౌరులను కేవలం ఒక కాలావధికి ఓట్లు వేసే ఓటర్లుగా దిగజార్చివేయడం వల్ల హింస, స్వేచ్ఛా రాహిత్యం, అసమానత, అన్యాయాలు పెరిగి ఈ దేశం ఒక విఫల దేశంగా (Failed State) మారే ప్రమాదం ఉంది. అనేక ఆధునిక పోరాటాల వలన విస్మృతిలోకి పోయిన తిరస్కృత స్మృతులను, పురస్కార యోగ్యమని చెప్పడం ఎవరికీ క్షేమం కాదని తెలియడమే సాందర్భిక, కాలిక వివేకం.

★ **రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయం**

# ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్స్: తెలంగాణ కులగణన సర్వే-సవాళ్లు

● సురేష్ గదపాటి, ప్రొఫెసర్ శామన్న

**పరిశోధన పత్ర సంక్షిప్తి:**

భారతదేశ గ్రామీణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్లు (FHWs), ముఖ్యంగా ANMలు, గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (ASHAలు) మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు (AWW) కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణలో ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో ఆరోగ్య కార్యకర్తలు ప్రమేయం, వారి పాత్ర చాలా ముఖ్యమైంది. అయితే వారు తమ విధులను నిర్వర్తించడంలో ఎదుర్కొంటున్న వివిధ రకాల (బహుముఖ) సవాళ్లను ఎత్తి చూపారు. ఈ పరిశోధన పత్రం కులగణన సర్వే సమయంలో ముఖ్యంగా మారుమూల, అట్టడుగు ప్రాంతాలలో ఎఫ్‌హెచ్‌డబ్ల్యులు ఎదుర్కొన్న కీలక సవాళ్లను పరిశీలిస్తుంది. ఇందులో కులాలకు సంబంధించిన సున్నితత్వం, వివిధ అంశాలలో తగిన శిక్షణ, మద్దతు లేకపోవడం, అధిక పనిభారం, సమయ పరిమితులు, డేటా సేకరణలో ఉండే సంభావ్య భద్రతా ప్రమాదాలను సూచిస్తుంది.

సమగ్ర శిక్షణ, తగిన మద్దతు, డేటా భద్రతా చర్యల ద్వారా ఈ సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరాన్ని ఈ పరిశోధన పత్రం నొక్కి చెప్తుంది. ఎఫ్‌హెచ్‌డబ్ల్యులు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించడం, అలాగే వాటిని పరిష్కరించడం ద్వారా ప్రజారోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి, భవిష్యత్ సర్వేలలో సేకరించిన డేటా ఖచ్చితత్వం, సమాచార విశ్వసనీయతను నిర్ధారించడానికి అవసరమైన పద్ధతులను ఈ పత్రం చర్చిస్తుంది.

**ముఖ్యమైన పదాలు:**

*కులగణన, ఆరోగ్య కార్యకర్తలు, ఎన్యుమరేటర్, ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు (ఎఫ్‌హెచ్‌డబ్ల్యులు)*

**పరిచయం:**

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన ఇంటింటి కులగణన సర్వే నవంబర్ 6, 2024న ప్రారంభించబడింది. ఈ సర్వే రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ ఇంటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్యా స్థితిని అంచనా వేయడానికి ఉద్దేశించబడింది. తెలంగాణలో జరిగిన సమగ్ర కులాల సర్వే మొత్తం 33 జిల్లాల నుండి డేటాను సంకలనం చేసి, విశ్లేషించి సమగ్ర నివేదికను సిద్ధం చేసి డిసెంబర్ 9 వ తేదీ నాటికి ప్రభుత్వానికి అందజేసారు. ఎన్యుమరేటర్లకు సర్వే సమయంలో డేటాను సేకరించేందుకు 75 అంశాలతో కూడిన ప్రశ్నావళిని అందించారు. ఇందులో 56 ప్రాథమిక ప్రశ్నలు మరియు 16 అనుబంధ ప్రశ్నలు ఉన్నాయి. ఎనిమిది పేజీల వరకు ఉండే ఈ సర్వే ప్రశ్నాపత్రం రెండు భాగాలుగా విభజించబడింది– అనగా ఒకటి వ్యక్తిగత డేటా, రెండు ఆర్థిక డేటా. ఈ దీర్ఘ ప్రశ్నావళితో సర్వే నిర్వహించే సమయంలో ఎన్యుమరేటర్లకు చాలా రకాల సమస్యలు ఎదురయ్యాయి. భారతదేశ ప్రజారోగ్య వ్యవస్థలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆరోగ్య సంరక్షణను కోరుకునే వ్యక్తులకు, ప్రత్యేకించి తక్కువ సేవలందించే కమ్యూనిటీలలో వారు తరచుగా మొదటి సంప్రదింపు పాయింట్‌గా ఉంటారు. అయితే, తెలంగాణలో ఇటీవల జరిగిన కులగణన సర్వేలో వారి ప్రమేయం, వారు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను వెలుగులోకి తెచ్చింది, ఈ సర్వే వారి యొక్క మద్దతు, గుర్తింపు అవసరాన్ని, ఆవశ్యకతను, అధిక ప్రాధాన్యతను సూచిస్తుంది.

**పద్ధతి:**

ఈ అధ్యయనం ప్రధానంగా సెకండరీ డేటా మూలాధారాలైన విద్యా, వార్తా కథనాలు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఫోరంలపైన ఆధారపడింది. తెలంగాణలో కులాల సర్వే సందర్భంగా ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్స్ (ఎఫ్‌హెచ్‌డబ్ల్యులు) ఎదుర్కొన్న సవాళ్లపై ఈ మూలాధారాలు విలువైన అంతర్ దృష్టిని అందించాయి.

**కులగణన సర్వేలో ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తల పాత్ర:**

ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్స్ కులం, ఉప కులం గురించిన సమాచారంతో సహా కుటుంబాల నుండి సున్నితమైన జనాభా, సామాజిక ఆర్థిక డేటాను సేకరించే పనిలో ఉన్నారు. ఈ బాధ్యత వారిని సున్నితమైన స్థితిలో ఉంచింది. సంక్లిష్టమైన సామాజిక డైనమిక్స్, సంభావ్య పక్షపాతాలను నేవిగేట్ చేయడం వారికి అవసరం.

ఎన్యూమరేటర్లు ఎదుర్కొనే సమస్యలు రకరకాలుగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో వారిని ఇళ్లలోకి అనుమతించలేదు. తమ ఇళ్ల గోడలపై స్టిక్కర్లు వేయడానికి వీల్లేదు అని సంపన్న కుటుంబాలు/ డబ్బున్న కుటుంబాలు ఎన్యుమరేటర్లను తిప్పి పంపాయి. అంతేకాకుండా సంక్షేమ పథకాల కింద లబ్ధి పొందేందుకు అనర్హులను చేసేందుకు డేటా సేకరిస్తున్నారని ప్రజలు భావించి కొన్ని ప్రాంతాల్లో ఎన్యూమరేటర్ల ఐడీ కార్డులు కూడా లాక్కున్నారు. అయితే, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా నుండి తమ పేర్లను తొలగించడానికి సేకరిస్తున్న సర్వే డేటా ఉద్దేశించినది కాదని వారు మొదట ప్రజలను ఒప్పించడానికే సవాళ్లు ఎదుర్కొన్నారు.

**ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు ఎదుర్కొంటున్న సవాళ్లు**

**1. సామాజిక కళంకం మరియు వివక్ష:**

1.1 **కుల సున్నితత్వం:** భారతదేశంలోని కుల వ్యవస్థ సమాజంలో చాలా లోతుగా పాతుకు పోయింది. కులం గురించి చర్చించడం సున్నితమైన అంశం. ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు, తరచుగా అట్టడుగు వర్గాలకు చెందిన వారు అటువంటి సమాచారాన్ని సేకరించినందుకు సామాజిక కళంకం, వివక్షతను ఎదుర్కొంటున్నారు.

1.2 **ప్రతీకార భయం:** కొన్ని ప్రాంతాలలో, ప్రత్యేకించి వివిధ కులాల వారి నుంచి, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించకపోతే లేదా అది తమకు వ్యతిరేకంగా ఉపయోగించబడుతుందని భావించినట్లయితే, ఆ ఆధిపత్య కులాల వారు ప్రతీకారం తీర్చుకుంటారనే భయం ఉంది.

**2. శిక్షణ మరియు మద్దతు లేకపోవడం:**

**2.1 డేటా సేకరణ నైపుణ్యాలు:** ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ పద్ధతుల్లో శిక్షణ పొందినప్పటికీ, వారు డేటా సేకరణ పద్ధతుల్లో, ముఖ్యంగా సున్నితమైన జనాభా సమాచారం కోసం తగిన శిక్షణ పొంది ఉండకపోవచ్చు.

**2.2 గోప్యత:** సేకరించిన సమాచార గోప్యతను నిర్ధారించడం చాలా కీలకం. ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలకు సున్నితమైన సమాచారాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించడానికి అవసరమైన సాధనాలు, శిక్షణ లేకపోవచ్చు.

**3. పనిభారం మరియు సమయ పరిమితులు:**

**3.1 బహుళ పాత్రలు:** ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు ఇప్పటికే ఇమ్యునైజేషన్ ప్రచారాలు, కుటుంబ నియంత్రణ సేవలు, తల్లి, పిల్లల ఆరోగ్య కార్యక్రమాలతో సహా భారీ పని భారాన్ని కలిగి ఉన్నారు. ప్రస్తుతం ఉన్న వారి బాధ్యతలకు కులాల సర్వేను కూడా జోడించడం అధిక పని భారం అవుతుంది.

**3.2 సమయ ఒత్తిడి:** సర్వే కోసం కేటాయించిన సమయం సరిపోకపోవచ్చు. ఇది త్వరితగతిన డేటా సేకరణ మరియు సంభావ్య తప్పిదాలకు దారి తీస్తుంది.

4. **ప్రతిపక్ష రాజకీయ పార్టీ కేడర్ మరియు ప్రజల అభిప్రాయాలు**

**4.1 ప్రభుత్వంపై ఆరోపణ, వాగ్దానాలపై ప్రశ్నించడం:** ఎన్యుమరేటర్లు ఈ ఇంటింటి సర్వేలో ప్రజల నుండి అనేక ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి వచ్చింది, వాటిలో 6 గ్యారంటీల గురించి ప్రజల నుండి ప్రశ్నలు ఎదుర్కొన్నారు. ప్రజా పాలన అనే ప్రోగ్రాంలో తమ సమస్యలకు సంబంధించిన ఫారాలను రెండు మూడు రోజులు లైన్లో నిలబడి ఈయడం కూడా జరిగింది. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లభించకపోవడంతో ఇంటింటి సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్లులను వీటిపై నిలదీస్తూ మా ఫారాలు ఏమైనాయి, వాటి మీదనే ఇప్పటివరకు స్పందన లేదు. ఇక ఈ సర్వే వల్ల మాకు వచ్చే లాభమేంది. మా సమయం వృధా చేయకూడదని, మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని కొందరు ప్రజలు మా పైకి కుక్కలను కూడా వదలడం జరిగింది. అలాగే కొందరు సర్వే పేరు మీద మమ్మల్ని విసిగించొద్దు. దీనివల్ల మాకు ఎలాంటి లాభం చేకూరదని అన్నారు. ఒకవేళ మేము మీరు అడిగింది ఇస్తే మాకు వచ్చే లాభమేంటని ప్రశ్నించడం, దబాయించడం కూడా జరిగింది. అంతేకాకుండా మీకు అడిగింది చెప్పడం వల్ల ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తారా? అని నిలదీస్తున్నారు. కానీ, ఈ రాజకీయానికి సంబంధించిన హామీలకు మా దగ్గర సమాధానం లేక బిత్తర పోవాల్సి వచ్చింది.

**5. భద్రతా ఆందోళనలు:**

**5.1 రిమోట్ మరియు యాక్సెస్ చేయలేని ప్రాంతాలు:** కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో, ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్లు ముఖ్యంగా రిమోట్ మరియు ఐసోలేట్ ఇళ్లను సందర్శించినప్పుడు భద్రతాపరమైన ప్రమాదాలను ఎదుర్కొన్నారు.

**5.2 శత్రు ఎన్‌కౌంటర్లు:** సర్వే ప్రక్రియను నిరోధించే వ్యక్తులు లేదా సమూహాలను ఎదుర్కోవడం జరిగింది.

**6. భాష మరియు సాంస్కృతిక అడ్డంకులు:**

6.1 ఎన్యుమరేటర్లు భాషా సంబంధిత సమస్యలను ఎదుర్కొన్న కొన్ని ప్రాంతాలలో సర్వే సంబంధిత ఫారాలు తెలుగుతోపాటు ఇతర భాషలు, ఏదైతే ఆ ప్రాంత ప్రజల పరిగణలో ఉందో ఆ భాషలో కూడా ఉంటే బాగుండనే సమస్య కూడా ఎదుర్కొన్నారు.

6.2 కమ్యూనికేషన్ సవాళ్లు: భాషా అవరోధాలు, సాంస్కృతిక భేదాలు ప్రతివాదులతో సమర్థవంతమైన కమ్యూనికేషన్‌కు ఆటంకం కలిగిస్తాయి. ఇది అపార్థాలు, తప్పుడు డేటాకు దారితీస్తుంది.

6.3 సాంస్కృతిక నిబంధనలకు సున్నితత్వం: కొన్ని కమ్యూనిటీలలో, ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ లేదా వ్యక్తిగత సమాచారం వంటి సున్నితమైన అంశాలను చర్చించడం నిషిద్ధం. ఈ అంశం డేటా సేకరణకు ఆటంకం కలిగిస్తుంది.

**సవాళ్లను ప్రస్తావించడం**

పైన అంశాలలో పేర్కొన్న సవాళ్లను ఎదుర్కోవడానికి లేదా తగ్గించడానికి, కులగణన సర్వేను విజయవంతంగా అమలు చేయడానికి, ఈ కింది చర్యలు తోడ్పడతాయి.

**1. సమగ్ర శిక్షణ:** ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలకు డేటా సేకరణ పద్ధతులు, గోప్యతా ప్రోటోకాల్‌లు, కుల సంబంధిత సమస్యల పట్ల సున్నితత్వంపై సమగ్ర శిక్షణను అందించాలి.

**2. తగిన మద్దతు/ సహకారం:** లాజిస్టికల్ సహాయం, రక్షణ పరికరాలు, మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్‌తో సహా తగిన మద్దతును మరియు తోడ్పాటును అందించాలి.

**3. కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్:** ఆందోళనలను పరిష్కరించడానికి, ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు, సంఘం మధ్య నమ్మకాన్ని పెంపొందించడానికి కమ్యూనిటీ సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌లను నిర్వహించాలి.

**4. ప్రోత్సాహకాలు మరియు గుర్తింపు:** FHWలను ప్రోత్సహించడానికి, వారి ప్రయత్నాలను అభినందించడానికి తగిన ప్రోత్సాహకాలు, గుర్తింపును కల్పించాలి.

**5. డేటా భద్రత:** సేకరించిన సమాచార గోప్యత, ఆ గోప్యతను రక్షించడానికి బలమైన డేటా భద్రతా చర్యలను అమలు చేయాలి.

**ముగింపు:**

పైన చర్చించినటువంటి వివిధ అంశాలను లేదా సవాళ్లను పరిష్కరించడం, సహాయక పర్యవేక్షణ, మెరుగైన శిక్షణ, నగదు ప్రోత్సాహకాల ద్వారా ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్స్ (ఎఫ్‌హెచ్‌డబ్ల్యులు) కు సాధికారత కల్పించడం అనేది నైతికమైనది. సరైన పని, ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు ఇవి దారి తీస్తాయి. విధాన నిర్ణేతలు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, కమ్యూనిటీలు ఎఫ్‌హెచ్‌డబ్ల్యూలు కేవలం పాల్గొనేవారిగానే కాకుండా నాయకులుగా మారడంలో సహాయం చేయడానికి వారితో కలిసి పని చేయాలి. సంక్లిష్టమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను సులభంగా నిర్వహించడానికి, వారి కమ్యూనిటీల కోసం మాట్లాడటానికి, అంతిమంగా న్యాయమైన ఆరోగ్య ఫలితాలను ప్రోత్సహించడానికి, భవిష్యత్ సర్వేలలో సేకరించిన డేటా యొక్క ఖచ్చితత్వం, విశ్వసనీయతను నిర్ధారించడానికి ఇది వారికి నైపుణ్యాలను కల్పించి ప్రోత్సహిస్తుంది.

Acknowledgement:

ఈ అధ్యయనానికి మద్దతు ఇచ్చినందుకు రచయితలు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ (IoE), తెలుగులో తర్జుమాకు సహకరించిన సంగెం ప్రభాకర్ గారికి ధన్యవాదాలు.

**ఆధార గ్రంథాలు:**

1. Enumerators facing uphill task during caste survey https://www.deccan chronicle .com/southern-states/telangana/ enumerators-facing-uphill-task-during-caste-survey-1836889

2. 'Half-baked' data, shortage of time hit caste survey in Telangana; officials doubt authenticity https://www.hindustantimes .com/india-news/halfbaked-data-shortage-of-time-hit-caste-survey-in-telangana-officials-doubt-authenticity 101731781579489.html

3. Gadapati, Suresh, and B. R. Shamanna. "A Review on Violence Against Health Care Professionals in India and Its Impact." National Journal of Community Medicine 14.08 (2023): 525-533.

4. Gadapati, Suresh, and B. R. Shamanna. "Workplace violence against community health workers in Lower Middle-Income Country-India." work 19: 20.

5. Telangana: People up against caste survey; enumerators complain of resistance https://telanganatoday.com/telangana-people-up-against-caste-survey-enumerators-complain-of-resistance

6. 'Half-baked' data, shortage of time hit caste survey in Telangana; officials doubt authenticity

https://www.hindustantimes.com/india-news/halfbaked-data-shortage-of-time-hit-caste-survey-in-telangana-officials-doubt-authenticity 101731781579489.html

**రచయిత: పరిశోధక విద్యార్థి హెచ్.సి.యు**

# సహకారం అందని చేనేత మహిళ

డా.ఎ.కళ్యాణి

**పరిచయం:**

సమాజానికి నాగరికత నేర్పినది చేనేత వృత్తి. ఇది ఒకప్పుడు పద్మశాలీల కులవృత్తి. కానీ నేడు అన్ని కులాల వారు ఇందులో భాగమైనారు. చేనేత గణన 2009-10, 2019-2020 ప్రకారం మన దేశంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద పరిశ్రమగా సామాజికార్థిక రంగాలలో నిర్మాణాత్మక స్థితిలో ఉన్నది చేనేత పరిశ్రమ.

భారతదేశంలోని మొత్తం నేత కార్మికులలో 72% మంది మహిళలు ఉన్నారు. వారిలో 83% మంది తెలంగాణలో ఉన్నారు. మణిపూర్‌లో అత్యధికంగా 95%, అస్సాంలో 93% మహిళలు ఈ వృత్తిలో పనిచేస్తున్నారు. ఇంటిపట్టున ఉండి చేసే పనే కాబట్టి మహిళలు ఇంటి పని, వంట పనితో పాటు ఈ వృత్తిలో కూడా రకరకాలుగా 365 రోజులు పనిచేస్తూనే ఉన్నారు. దీనివల్ల వారు మగవారికంటే ఎక్కువే కష్టపడుతున్నారు. ఈ వృత్తిలో ప్రధానమైన పని మగ్గం నేయడం. అది ఎక్కువగా మగవారే చేస్తారు. దానికి సన్నాహక పనులు చాలా ఉంటాయి. అవి 90% మహిళలే చేస్తారు. ఉదాహరణ కండెలు పట్టడం, ఆసు పోయడం, చిటికీలు కట్టడం, రంగులు అద్దడంలో సహాయం చేయడం, అచ్చు అతకడం, అల్లు కలపడం వంటి పనులు.

ఆసుపోయడం ఒకప్పుడు చాలా కష్టమైన పనిగా ఉండేది. మహిళలు కుడిచేతితో అనేక వేల సార్లు దారాన్ని తిప్పుతూ, ఫ్రేముకు చుడుతూ ఉండేవారు. దీని వల్ల వాళ్ళ భుజం కీలు అరిగి నొప్పితో విలవిలలాడి పోయేవారు. దీనికి మన తెలంగాణవాసి శ్రీ చింతకింది మల్లేశం గారు తన తల్లి పడే కష్టాన్ని చూడలేక పరిష్కారాన్ని కనుగొన్నారు. అదే ఆసు యంత్రం. ఇంకా అచ్చు అతకడం లాంటి పనులు చేయడానికి కంటి చూపు, ఏకాగ్రత చాలా అవసరం. ఆ రకంగా చూస్తే మహిళలు ఈ పనుల వల్ల కొన్నేళ్ల తర్వాత మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఈ పనులన్నింటిలో మగ్గం నేసే వ్యక్తికి ఒక చీర నేసినందుకు ఇంత అని కూలీ ఇస్తున్నారు. కానీ, నేయడానికి ముందు చేసే సన్నాహక పనులకు, ఆ పనులు చేసే మహిళలకు మాత్రం ఎలాంటి వేతనం ఇవ్వడం లేదు. ఇది మహిళల శ్రమను దోచుకున్నట్లే. బహుశా ఈ తరహా శ్రమదోపిడి ప్రపంచంలో మరే వృత్తిలోనూ కనిపించదేమో.

ఒక మగ్గం ఉన్న వ్యక్తి వ్యాపారస్తుని దగ్గర నుండి ముడిసరుకు తెచ్చుకొని మగ్గం నేస్తే, భార్యాభర్తలిద్దరూ పనిచేసే ఒక వ్యక్తి కూలీ పొందుతున్నారు. అదే నాలుగు మగ్గాలు సొంతంగా ఉన్న వాళ్లు ముడి దారం మాత్రమే తెచ్చుకొని, దారాలకు రంగులు అద్దడం, డిజైన్లు కట్టడం, కండెలు పట్టడం, అచ్చు అతకడం, అల్లు కలపడం వంటి అన్ని పనులు ఇంటిల్లిపాది (కనీసం నలుగురు) చేసి మగ్గం నేస్తున్నారు. ఇందులో కూడా మహిళల శ్రమదోపిడి కనిపిస్తుంది. వారికి ప్రత్యేకమైన వేతనం అంటూ ఏమీ ఉండదు. ఇలా ఒకరి కూలీకి ఇద్దరు లేదా ముగ్గురు పనిచేస్తూ, చాలీచాలని డబ్బులతో, ఆర్థికలేమితో బతుకు వెల్లదీస్తున్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ళు వంటి వాటికి ఆర్థిక భారం మోయలేక అప్పులు చేసి వాటికి వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. లేదా, తాగుడుకు బానిసలు అవుతున్నారు. ఈ రెండింటిలో ఏది జరిగినా కుటుంబ భారం మొత్తం ఆడవారిపైనే పడుతుంది. ఇది వారిని ఇంకా కుంగదీస్తుంది. ఒంటరి మహిళలు చాలామంది వారే స్వయంగా మగ్గం నేస్తున్నారు. ఈ మగ్గం మగవారి శారీరక ధారుఢ్యాన్ని అనుసరించి తయారు చేయబడింది. కానీ మహిళలు దానిపై పనిచేయడం వల్ల అనేక శారీరక సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. ముఖ్యంగా ఎక్కువ సేపు మగ్గంలో కూర్చోవడం వల్ల కండరాల నొప్పులు, కాళ్ల నొప్పులు, గర్భాశయ వ్యాధులు, మూత్రశయ సమస్యలతో బాధపడుతున్నారు. కండెలు పట్టడం భుజం నొప్పికి దారితీస్తుంది.

**సహకార సంఘాలు:**

చేనేత రక్షణకు సహకార రంగం అవసరమని అనేక ఆందోళనలు జరిగిన నేపథ్యంలో 1964లో చేనేత సహకార రంగ చట్టం వచ్చింది. ఆ చట్టం ద్వారా చేనేత కార్మికుల షేర్ ధనంతో, సొసైటీలో సభ్యులుగా చేరిన వారితో కమిటీ ఏర్పడి, ఆ కమిటీ నాయకత్వంలో ప్రభుత్వ సహకారంతో సొసైటీలు నడవాలని చట్టం చెప్తోంది. అదే కాలంలో సహకార సంఘాలు తయారుచేసిన వస్త్రాలను మార్కెటింగ్ చేయడం కోసం ఆప్కోను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని చేనేత రంగ అభివృద్ధి కోసం ఏర్పాటు చేయబడిన సంస్థ టెస్కో. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 380 ప్రాథమిక

చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్షన్నర కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి.

ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2013లో చేనేత సంఘాలకు ఎన్నికలు జరిగాయి. తర్వాత ఐదేండ్లకు ఒకసారి రెన్యువల్ చేస్తున్నారే తప్ప ఎన్నికలు నిర్వహించలేదు. పర్సన్ ఇన్-చార్జులను నియమించి సంఘాల కాలపరిమితి పొడిగిస్తున్నారు. ఇప్పటికే 9 సార్లు పొడిగించడం వల్ల సహకార సంఘాల ఉనికి ప్రమాదంలో పడిపోయింది.

చేనేత కార్మికులు ఇప్పుడు సంక్షోభంలో కూరుకుపోవడానికి కారణం ప్రభుత్వ విధానాలే కావడం దురదృష్టకరం. యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా చేనేత రంగాన్ని దెబ్బతీశారు. ప్రభుత్వం నూలు ఎగుమతికి అనుమతి ఇవ్వడంతో ధర పెరిగిపోయింది. కేంద్రం 9.25% ఎక్సైజ్ సుంకం విధించడం ద్వారా ఈ కుటీర పరిశ్రమ పూర్తిగా దెబ్బతిన్నది. మరోవైపు పెద్ద పరిశ్రమలకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించడవే కాక పాత యంత్రాలు దిగుమతి చేసుకోవడానికి కస్టమ్స్ సుంకం తగ్గించింది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం పేరుతో 50% సబ్సిడీ ఇచ్చింది. దీనితో ఈ పెద్ద కంపెనీలు నూలు వడకడం, నేయడం, రంగులద్దడం వంటి పనులు చౌకగా జరుపుతున్నాయి. ఈ రకంగా ప్రభుత్వ విధానాల ద్వారా చేనేత కార్మికుల జీవితాలు వీధిన పడ్డాయి. చేనేత కార్మికుల ఆత్మహత్యలు రాజకీయ అంశాలు అయ్యాయి తప్ప వారి కన్నీళ్లు తుడవలేకపోయాయి. సూక్ష్మంగా పరిశీలిస్తే వీటన్నిటి వల్ల అంతిమంగా కష్టనష్టాలు అనుభవించేది మహిళలే. వారి జీవితాలు సామాజికంగా, ఆర్థికంగా అట్టడుగుకు చేరుతున్నాయి. వారిని సహకార సంఘాలు ఆదుకునే పరిస్థితి కూడా లేదు.

60 సంవత్సరాల చరిత్ర కలిగిన చేనేత సహకార సంఘాలలో మహిళల భాగస్వామ్యం నామమాత్రం. సహకార సంఘాలు స్వయం సహాయం, ప్రజాస్వామ్యం, సమానత్వం మరియు సంఘీభావం వంటి విలువలపై ఆధారపడి ఉంటాయి. సహకార సంఘాల యొక్క ఉద్దేశించిన ప్రజాస్వామ్య నిర్మాణం, సభ్యులు పంచుకునే విలువలు మరియు ప్రయోజనాలు ఉన్నప్పటికీ మహిళల పాత్ర పై సంప్రదాయ లింగ నిబంధనల కారణంగా మరియు ఇతర అంతర్గత సాంస్కృతిక అభ్యాసాల కారణంగా చట్టపరమైన రక్షణలను పక్కదారి పట్టించడం వలన, మహిళలు అనమానంగా తక్కువ ప్రాతినిధ్యంతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సహకార సభ్యత్వంలో క్రియాశీల సభ్యత్వం (సమావేశాలలో పాల్గొనడం మరియు ఓటింగ్ వరకు చూపడం) అలాగే నాయకత్వం మరియు నిర్వాహక స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత తక్కువగా ఉంది. ఇది సహకార సంఘాలలో నిర్ణయాధికారంలో మహిళలకు తక్కువ స్వరం కలిగిస్తుంది, తద్వారా వారి అవసరాలకు ప్రాముఖ్యత లేకుండా పోతుంది.

ప్రజాస్వామ్య ప్రదేశాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండడం వల్ల వారు ప్రతినిధులుగా లేదా నాయకులుగా ఎన్నికయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. కో-ఆప్‌లో బాధ్యతాయుతమైన ఉద్యోగాలలో కూడా మహిళలు ఇప్పటికే తక్కువ ప్రాతినిధ్యం వహిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి

**ముగింపు:**

చేనేత రంగంలో మహిళల భాగస్వామ్యం లేనిదే ముందుకు సాగదు. అయినా కూడా ఈ రంగంలో మహిళల పనికి తగిన గుర్తింపు, విలువ, ప్రతిఫలం లభించడం లేదు. చేనేత పరిశ్రమలోని పనులను ప్రథమ, ద్వితీయ శ్రేణి అంటూ విభజించుకుంటే మగ్గం నేయడం ప్రథమ శ్రేణి కిందికి వస్తుంది. దానికి కావలసిన సామగ్రిని సమకూర్చడం ద్వితీయ శ్రేణి కిందకి వస్తుంది. ప్రథమ శ్రేణిలో 90% మగవారే పనిచేస్తారు. ద్వితీయ శ్రేణిలో ఆడవారే పనిచేస్తారు. ఈ ద్వితీయ శ్రేణిలో పనిచేసే వారికి ప్రభుత్వ పరంగా ఎలాంటి గుర్తింపు లేదు.

**ప్రభుత్వపరంగా చేనేత రంగంలోని మహిళలకు అందాల్సినవి:**

1. మహిళలు కండలు పట్టినా, అచ్చులు అతికినా కూడా వారికి ఒక గుర్తింపు కార్డు ఉండాలి.

2. ఆ గుర్తింపు కార్డుతోనే వారికి ఆరోగ్యశ్రీ కూడా అనుసంధానించబడాలి.

3. చేనేత సహకార సంఘాలలో మహిళల పాత్ర పెరగాలి.

4. వారి శ్రమకు తగిన వేతనం లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార చట్టంలో మార్పులు చేయాలి.

5. చేనేత ప్రాబల్యం ఎక్కువగా ఉన్న గ్రామాల మధ్య షెడ్లను వేసి అక్కడే రంగులద్దడం, దారాలు పోయడం, కండెలు పట్టడం, డిజైన్లు తయారు చేయడం వంటి అన్ని విభాగాలను ఒకే చోట చేర్చి ప్రతి వ్యక్తికి సరైన వేతనం కల్పించగలిగితే మహిళల శ్రమదోపిడి ఆగుతుంది.

**ఆధార గ్రంథాలు:**


1. Ministry of Textiles (2019). Handloom Weavers Press Release. Accessed at https://pib.gov.in Press Release Page.aspx?PRIDR1596372

2. Ministry of Textiles, Government of India (2019-20). Fourth All India Handloom Census 2019-20 accessed at https://handlooms.nic.in/assets/img/Statistics/3736.pdf

3. https://tsht.telangana.gov.in/HNDM/Views/LawsofTsco.aspx

4. రచయిత క్షేత్ర పరిశోధన


**రచయిత: స్వతంత్ర పరిశోధకురాలు** T

# ఇంతవరకూ అచ్చమైన గిరిజన కథ రాలేదు
# - గంటేడు గౌరునాయుడు

సారిపల్లి నాగరాజు

*(తెలుగు కథా సాహిత్యంలో "ఏటిపాట" తో వారి సాహిత్య జీవితాన్ని ప్రారంభించారు. "ఒక రాత్రి రెండు స్వప్నాలు" కని ఉత్తరాంధ్ర రైతుల గాథలను గేయమై పలికారు. తీతువుపిట్ట "ఎగిరిపోతున్న పిట్టల కోసం" పాటల గానమై "ఇది నా ఊరేనా!" అని మారిపోతున్న పల్లెల రూపురేఖలను, వలసబాట పట్టిన రైతుల స్థితిగతులను చూసి చలించిపోయిన మానవతావాది. ప్రపంచీకరణ మార్పులను కథావస్తువులుగా తీసుకుని రైతుకూలీల జీవితాలను అక్షరీకరించిన అక్షరం ఆయన. పల్లె జీవనాడిని పట్టుకొని, ప్రజల స్వచ్ఛమైన యాసను తన పాత్రలలో పలికించిన వాగ్గేయకారుడాయన. విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను "బడి కతలు" ద్వారా చూపించారు. భూమికి దూరం చేస్తున్న పాలకుల "మాయ" ను బహిర్గత పరుస్తున్నవారు. 'స్నేహకళాసాహితి' ద్వారా కళాకారులను, రచయితలను చెక్కిన శిల్పకారుడైయన గంటేడ గౌరునాయుడు మాష్టారితో నడుస్తున్న తెలంగాణ మాసపత్రిక తరపున సారిపల్లి నాగరాజు జరిపిన ముఖాముఖి...)*

**1. పద్యం, కవిత, కథ, గేయం, గజల్ ఇలా విభిన్న ప్రక్రియల్లో రాస్తున్నారు మీరు. ఆయా ప్రక్రియల్లో ఇమిడిపోయి పాఠకుడికి భిన్నంగా చూపే ప్రయత్నం ఎలా చేయగలుగుతున్నారు?**

ప్రక్రియ వేరుకావచ్చు కానీ చెప్పదలచుకున్న విషయం ఏమిటన్నదే ప్రధానం. చెప్పాల్సిన విషయం ఏ ప్రక్రియలో అయితే చెప్పడానికి అనువుగా ఉంటుందో, ఏ ప్రక్రియ ద్వారా విషయం పాఠకులకు లేదా శ్రోతలకు లేదా ప్రేక్షకులకు సూటిగా చేరుతుందో అన్నది రాతకు ముందు మరో ముఖ్యమైన ఎంపిక. కొందరు కవిత్వం మాత్రమే రాస్తారు, కొందరు కథ మాత్రమే రాయగలరు. పద్యంలో చెప్పాలనుకున్నవారు కొందరైతే పాట కొందరికి ప్రజల దగ్గరికి తొందరగా చేర్చే మార్గం. అందరూ అన్నీ చేయలేరు, చేయగలిగిన ప్రతిభ ఉన్నా చేయరు కొందరు. నేనైతే విషయాన్ని బట్టి అప్పటి సామాజిక అవసరాన్ని బట్టి ప్రక్రియ ఏదైతే అనువైనదో దాన్నే ఎంచుకుంటాను. ఏ ప్రక్రియను ఎంచుకుంటానో దానికి అనువుగా నన్ను నేను సమాయత్తపరుచుకుంటాను. అదేమీ కష్టమైన పనిగా అనిపించదు కూడా. ఆయా ప్రక్రియల్ని సరిగా నిర్వహించానా లేదా అన్నది పాఠక విమర్శకులు చెప్పాలి.

**2. కథకుడిగా మీ ప్రయాణంలో ఆది అంకం ఏమిటి? ఎలా ఉండేది?**

పందొమ్మిదివందల ఎనభై నాలుగులో నా తొలికథ మద్రాస్ నుండి వెలువడే కథాంజలి మాసపత్రికలో వొచ్చింది. అప్పటికి కథ, దాని లక్షణాలు అంటూ ఏమీ తెలీదు. అప్పటికి ఏ రచయితనూ నేను చూడలేదు కూడా. పెదపెంకి (ఎస్.టి. జ్ఞానానంద కవి, కందికుప్ప అప్పలాచార్యవంటి కవుల స్వగ్రామమని తరువాతెప్పుడో తెలిసింది) మా చుట్టాలింటికి వెళ్తే అక్కడ కరపవలస బలరాం ప్రసాద్ అనే (పోస్ట్ మాష్టర్) యువకుడు నా ఈడువాడే, పరిచయం అయ్యేడు. అతడు రాసిన కథ ఒకటి అప్పుడు కథాంజలి పత్రికలో వచ్చింది. అది చూసేన్నేను. ఆ కథలో పెదపెంకి ఊరు, కొండ, చెరువు అన్నీ స్పష్టంగా చిత్రించడం బాగుందనిపించి పత్రికకు ఎలా పంపాలి? అనడిగేను. పత్రిక చిరునామా ఇచ్చి ఎలా పంపించాలో చెప్పేడు. అప్పుడొక కథ రాసి కథాంజలికి పంపిస్తే ఆ పత్రికవారు కథని ప్రచురించి పత్రిక పంపించేరు. ఆ తరువాత మరో రెండు కథలు, ఒక నాటిక కథాంజలిలో వచ్చేయి.

తరువాత 1988లో అట్టాడ అప్పల్నాయుడి "పోడు-పోరు" కథాసంపుటం చదివేక కథలిలా మన వాడుకభాషలో రాయాలి అనిపించి 'ఆశ' అనే కథ రాసి ఆకాశవాణి విశాఖపట్నం వారికి పంపిస్తే ప్రసారం చేసేరు. కాకపోతే మాండలిక పదాల్ని అర్థవంతంగా పలకలేకపోయారా కథ చదివినామె. అదే కథ 'రేపటి ఉదయం కోసం' పేరుతో సాహితీ లహరి పార్వతీపురం ప్రచురణ 'కథాలహరి'లో ప్రచురితమైంది. తరువాత 1989లో మిత్రసాహితి పి.వి.బి. శ్రీరామమూర్తి మాష్టారి ప్రోత్సాహంతో రాసిన కథ 'విముక్తి' ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిలో అచ్చయ్యింది. ఆ కథ కథలగురువు కాళీపట్నం మాష్టారు చదివి నా గురించి భోగట్టా చేసేరని తరువాత



తెలిసింది. విశాఖపట్నంలో ఐ.టి.డి.ఎ వారి 'నానూ సదువుకుంతాను' సినిమా కేసెట్ ఆవిష్కరణ సభలో మాష్టారు నన్ను పట్టుకున్నారు. అది నా సాహిత్య జీవితానికి గొప్ప 'మలుపు' అని భావిస్తాను. మాష్టారు కథకు సంబంధించిన అనేక విషయాల్ని బోధపరుస్తూ వచ్చేరు.

**3. ప్రభావితం చేసిన వ్యక్తులు, సంఘటనలు, రచనలు?**

నేను తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు ఒకాయన మాస్కూల్లో 'ఫిరదౌసి' ఏక పాత్రాభినయం ప్రదర్శించేడు. 'జాషువా' పేరు తొలిసారి విన్నాను. ఆయన పాడిన జాషువా పద్యాలు గొప్పగా ఉన్నాయనిపించింది. కవి గొప్పతనం ఆరోజు ఆ అజ్ఞాత కళాకారుని ద్వారా విన్నాను. 'కవిని' కావాలి అనిపించిందప్పుడే. పాటలతో నాటిక రాసి నా మిత్రులతో మా ఊర్లో ప్రదర్శించేము. అలా నన్ను ప్రభావితం చేసిన వాళ్ళలో ఆ అజ్ఞాత కళాకారుడొరు.

బావు (నాన్న) మంచిగాయకుడు, హార్మణీ, ఫ్లూట్, డోలక్ బాగా వాయించేవాడు. చిన్నప్పట్నించీ పాటలపట్ల కలిగిన ఆసక్తి నా సాహిత్య ప్రయాణంలో తోడయ్యింది. మావూరి బడిలో హెడ్మాష్టర్ గొట్టిపల్లి బలరామస్వామిగారు నాచేత పాటలు పాడించేవారు. మావూర్లో నాటక సమాజం, భజన సమాజాల్ని నడపింది ఆయన, మా బావు.

మా బావు తరం తరువాత నాటక, భజన సమాజాలకు నాదే నాయకత్వం. ఆ రోజుల్లో ఎన్ని భజనగీతాలు రాసేనో. ఇక మా వూర్లో పాటుకుడు (జానపద గాయకుడు) పైడయ్య జముకుల పాట, జాలారిబాగోతం వంటివి నామీద బాగా ప్రభావం చూపేయి. పాటుకుడు పైడయ్య కోసం, మా పెద్ద మామయ్య బుర్రకథ దళం కోసం పాటలు రాసేవాడిని. ఇవన్నీ నామీద ప్రభావం చూపినవే.

సాహిత్యంలో తొలినాళ్ళలో వాడ్రేవు చినవీరభద్రుడు గార్ని చూస్తే ఒక ఆశ్చర్యం. 1986 నాటికే ఆయన "నిర్వికల్పగీతం" కవితా సంపుటి వచ్చిందంటే అదొక అద్భుతం అనిపించింది. ఆయన మాకు గిరిజన సంక్షేమ అధికారిగా వచ్చేరు. అప్పటికి కథకు సంబంధించిన ఏ జ్ఞానమూ లేదు పిల్లలకు పాటలు రాసి నేర్పడం తప్ప. కవిత్వం, కథ వాటి లోతులు తెలీదు. చినవీరభద్రుడు వచ్చేక ఆయన అందించిన ప్రోత్సాహం గొప్పది. కథకులగురువు కా.రా మాష్టారి పరిచయం కలిగింది చినవీరభద్రుడుగారి వల్లనే. ఆ తర్వాత అట్టాడ అప్పల్నాయుడు రచన 'పోడు-పోరు' కథాసంపుటం చదివేక ఇలా కథలు రాయాలి అనే భావన కలిగింది. తెలిసిన జీవితమే కథావస్తువు కావాలి అనే ఆలోచననిచ్చింది. 'పోడు-పోరు'. తరువాత అప్పల్నాయుడు ద్వారా శ్రీకాకుళ సాహితి పరిచయం. రాసిన రచనల్ని సమీక్షించుకోడానికి శ్రీకాకుళ సాహితి బాగా సహకరించింది. కా.రా మాష్టారి పరిచయంతో సాహిత్య ప్రపంచంలో నా మార్గమేదో స్పష్టమయింది.

అంతకుముందు నన్ను దగ్గర కూర్చోబెట్టుకుని సంస్కృత నాటకాల్ని, కావ్యాల్ని పరిచయం చేసారు మా

గురువుగారు సామవేదుల రామగోపాలశాస్త్రిగారు. నాకు ఇద్దరు గురువులు.. ఒకరు దుక్కి దున్నుకుని బతకాల్సిన నాకు తన ఇంట్లో పెట్టుకుని చదువు చెప్పి ఉద్యోగం వచ్చే బతుకుదారి చూపించినవారు సామవేదుల రామగోపాలశాస్త్రిగారైతే, మరొకరు కథలదారి చూపించి సాహిత్య ప్రపంచంలో నాకూ చిన్నస్థానం లభించడానికి కారణమైన కాళీపట్నం రామారావు మాష్టారు.

ఇక ప్రభావం చూపిన రచనలంటారా... ఒకటనేమిటి? ప్రాచీన సాహిత్యంనుండి వర్తమాన సాహిత్యందాకా కా.రా మాష్టారి 'హింస, ఆర్తి, చావు' కథలు చదివేక ఎంత కదిలిపోయేనో. చాసో 'వాయులీనం' విశ్వనాథ సత్యనారాయణ 'జీవుడి ఇష్టం' బలివాడ 'ముంగిస' అల్లం శేషగిరిరావు 'చీకటి' కేశవరెడ్డి 'మూగవాని పిల్లనగ్రోవి' రాచకొండ విశ్వానాథశాస్త్రి 'ఆరుసారా కథలు' కల్యాణ సుందరీ జగన్నాథ్ 'అలరాస పుట్టిళు ్లు' ఇలా చాలా కథలు నాకిష్టమైనవీ, ఏదో రూపంలో ఎంతో కొంత ప్రభావం చూపినవే.

**4. మీ దృష్టిలో కథకు మంచి కథకు మధ్య గల వ్యత్యాసం?**

కథ కావడానికి అది ముందు కథై ఉండాలి. వ్యాసంలాగో, కరపత్రంలాగో రాసి ఇది కథ అని బుకాయించకూడదు. ఇక మంచికథ అంటే కథ చదివేక కొంతసేపు ఆ కథ ప్రభావంలోనే ఉండాలి పాఠకుడు. చదివించే గుణం ప్రధానం. తమాషా ఏమిటంటే కొందరు మంచికథ అన్నది కొందరికి నచ్చని సందర్భాలున్నాయి. కొందరు ఇదేం కథ? అనుకున్నది కొందరు మంచికథ అన్న సందర్భాలూ ఉన్నాయి. మంచికథలు అని ఎంపిక చేసి వేసే కథా సిరీస్ (వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్)లో కొన్ని కథల విషయంలో ఇదే జరిగింది. కథ మంచిదైనా తన భావజాలానికి చెందనిదైతే 'అదేం కథ' అని పెదవి విరిచేవారుంటారు. ఇక్కడ భావజాలం సంగతి పక్కనపెడితే శిల్పనైపుణ్యంతో కథా నిర్వచనాలకి సరిపోయే రచన మంచి కథ. మంచి కథలో సమాజానికి ఒక కొత్త ఆలోచననిచ్చే, నిర్మాణాత్మకమైన చర్చకు అవకాశాన్ని ఇచ్చే అంశం ఏదైనా ఉంటే అప్పుడది 'గొప్పకథ' అవుతుంది. 'యజ్ఞం' కథ మీద అంత చర్చ జరిగిందంటే అదే కారణం. అలాంటి గొప్పకథలు అరుదుగా వస్తాయి. కథలు ఎందరో రాస్తుంటారు.. మంచికథలు చాలామంది రాస్తారు. గొప్పకథలు రాయగలిగేది గొప్పవారు మాత్రమే. జీవితంపట్ల, సమాజంపట్ల, సాహిత్యంపట్ల బాధ్యత, ప్రేమగల వారినుంచి మాత్రమే మంచికథలు వస్తాయని నేను నమ్ముతాను. గొప్ప కథలంటారా ఎప్పుడోగాని రావు.

**5. తెలుగు కథాసాహిత్యంలో గిరిజన కథ ఏ మేరకు చిత్రించబడింది? ఇప్పుడు ఏ స్థాయిలో ఉంది?**

తెలుగు కథాసాహిత్యం ఒక స్రవంతి అనుకుంటే గిరిజన కథ ఒక పాయ. తొలి కథ గూడూరు రాజేంద్రరావు 'చెంచి' (1932) నుండి ఇప్పటిదాకా వచ్చిన గిరిజన జీవితాలకు సంబంధించిన కథలు రాసిన గిరిజన మూలాలున్న కథకులు ఆరుగురు మాత్రమే. జీవన్ సంపాదకత్వంలో వచ్చిన 'ఇప్పపూలు' కథాసంకలనంలో నలభై కథల్లో ముప్పైఆరు కథలు గిరిజన జీవితాల్ని చిత్రించినవే అయినా అవి ఆయా కథకులు సమీపంగా చూసి తమ పరిశీలన మేరకు సహానుభూతితో రాసినవే. నాకు తెలిసినంతవరకు గిరిజన కథ ఆయా గిరిజన తెగల జీవద్భాషలో, ఆ భాషల్లోని జాతీయాలు, పలుకుబడులతో చిత్రించిన కథలు రాలేదనే అంటాను. సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు పట్టుకుని యాసలో చిత్రించినంతగా సామెతలు, జాతీయాలు, పలుకుబడులు చిత్రించడం ఆ జీవితాల్ని జీవించినప్పుడు మాత్రమే సాధ్యమౌతుంది. బయటనుండి గమనించి రాసిన రాతల్లో ఆ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. గిరిజన మూలాలున్న రచయితల రచనల్లో కూడా వారి వ్యావహారిక మాండలిక భాషలో గల సామెతలు, జాతీయాలు, నుడికారమూ, పలుకుబడి నాకు కనబడలేదు నేను చదివిన ఏ కథలోనూ. (ఏ కథలోనైనా ఉంటే తెలుసు కోవాలనుంది) కాబట్టి ఇంతవరకూ అచ్చుమైన గిరిజన కథ రాలేదనే నా అభిప్రాయం.

గిరిజన తెగలకు చెందిన కథకులు ఎక్కువ సంఖ్యలో రావాలి. వారు సామెతల్ని సేకరించాలి. అవి తాము రాసే కథల్లో ఆయా సందర్భాలకు తగినట్టు ప్రయోగించగలగాలి. వర్తమాన గిరిజన తెగలకు చెందిన కథకులు ఇదొక తప్పనిసరి బాధ్యతగా స్వీకరించాలి. అప్పుడు మాత్రమే గిరిజన కథ సమగ్రమవుతుంది. "చరిత్రలో పడి కనిపించని కథలన్నీ కావాలిప్పుడు" అన్న శ్రీశ్రీ మాట ఇక్కడ ఇంకా బాగా వర్తిస్తుంది. బయటి ప్రపంచానికి తెలీని గిరిజన తెగల, సంచార జాతుల సమూహాల జీవితాల లోతుల్ని చూపే కథలెన్నో..! మనకి తెలిసిన గిరిజన జీవితం చాలా చాలా స్వల్పం. అక్కడినుండి మొలుచుకొచ్చిన కథకులే తవ్వి తియ్యాలి.

**6 'సంధ్య', 'ఇండియాగాడి టీ.సి.' వంటి గిరిజన కథల్లో చూపిన సంఘటనలు నేటికీ పునరావృతం అవుతున్నాయంటారా?**

అమాయకత్వం, అజ్ఞానంపై దోపిడి, బలహీనుల బక్కచిక్కిన ప్రాణులపై పీడన నిరంతరమూ కొనసాగుతూనే ఉంటాయి. కాకపోతే వాటి రూపాలు మారొచ్చు. సంధ్య అసహాయతను వార్డెన్ అవకాశంగా తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. అటువంటి సంధ్యలు, వార్డెన్లు గిరిజన ప్రాంతంలోనే కాదు సమాజంలో ఎక్కడైనా ఉండొచ్చు. ఇండియాగాడిలాంటి విద్యార్థులు రిజర్వేషన్లు అమలయ్యే చోట తారసపడుతుంటారు.

ఒకప్పుడు మైదానం నుండి కొండమీదికి వెళ్ళిన నాగరికులు గిరిజనుల్ని మోసం చేసిన, దోపిడి చేసే కథలే మనకు తెలుసు. కానీ ఇప్పుడు అక్కడివాళ్ళే తమ వాళ్ళను దోపిడి చేస్తున్నా నాకు తెలిసీ ఆ సంఘటనలు అక్షరబద్ధం కాలేదు. గిరిజనేతర ఉపాధ్యాయుల వల్ల చదువుకుని ఉపాధ్యాయులై, ఉద్యోగులై, ''గిరిజనేతరులు వార్డెన్లగా పనిచేయడాన్ని మేము అంగీకరించం, మేమే వార్డెన్లుగా ఉండాలి'' అని వాదించినవారు, ఆ సంఘటనలు నాకు తెలుసు. డబ్బు ప్రధానపాత్ర వహిస్తున్న సమాజంలో స్వార్థం, మోసం, దగా విస్తృతం కావడం సహజం. స్వార్థపర శక్తులకు తన, పర అనే భేదం ఉండదు కదా. ఇప్పుడు దోపిడికి, మోసానికి గురికాని మనిషంటూ ఉన్నాడా సమాజంలో? ఇందుకు ఆదివాసీ సమాజం మినహాయింపేమీ కాదు. గిరీశంలాగే సంధ్య, ఇండియా చిరంజీవులే అనడానికి నాకేమీ సంకోచం లేదు. మోసం, దగా రంగులు మార్చుకునే ఊసరవెల్లులు.

గిరిజన ప్రాంతాలలోననే ఏముంది? నాగరిక సమాజాలుగా పిలవబడే మైదానప్రాంతాల్లో మాత్రం లేవా? మోసపోయే వాడున్నంతవరకూ మోసగాళ్ళు ఉండనే ఉంటారు, 'డామిట్ కథ అడ్డం తిరిగింది' అని అక్కడినుంచి పరారైన గిరీశం మరోచోట తన నాటకం మొదలెట్టడా! మరింత తెలివిడితనంతో కొనసాగిస్తాడు మరో రూపంలో. గిరీశాల సంఖ్య మరింత పెరిగిందే తప్ప తరగలేదని మనకు తెలుసును. కాబట్టి 'సంధ్య'లు, 'ఇండియా'లు ఎప్పుడూ ఉంటారు. కాకపోతే మనకి చూడగలిగే కళ్ళుండాలి. చరిత్ర పునరావృతం అవుతుందంటారు కదా... ఈ కథలూ చరిత్రలో భాగాలే మరి.

**7. మీదృష్టిలో గిరిజన కథకు ఉండాల్సిన లక్షణాలేమిటి?**

కథ ఏదైనా, ఏ భాషలోనైనా, ఏ ప్రాంతానిదైనా ఎక్కడైనా ఒకటే. గిరిజన కథకి ప్రత్యేక లక్షణాలేమీ ఉండవు. ఉంటాయనీ, ఉండాలనీ నేననుకోను. మనం కథకి చెప్పుకునే నిర్వచనాలేవైతే ఉన్నాయో గిరిజన కథకీ అవే వర్తిస్తాయి, వర్తించాలి కూడా. ఏ ప్రాంతపు కథకైనా చదివించే గుణం ప్రధానం. జీవితాన్ని పట్టుకోగలిగిన రచయిత యొక్క శిల్పనైపుణ్యమే కథను బ్రతికిస్తుంది తప్ప మతము, జాతి, తెగ, కులము, లింగము కాదు.

**8. ఉత్తరాంధ్రనుంచి రావలసినంతగా గిరిజన సాహిత్యం వెలువడలేదనే వాదన ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంనుండి గిరిజన సాహిత్యం రాస్తున్న వారి గురించి?**

ఒక్క ఉత్తరాంధ్రనుంచే కాదు రెండు తెలుగు రాష్ట్రాలనుండీ కూడా వచ్చిన, వస్తున్న గిరిజన సాహిత్యం చెప్పుకోదగ్గ సంఖ్యలో లేదు. దానికి కారణం ఆయా గిరిజన ప్రాంతాలనుండి రచయితల సంఖ్య పెరగకపోవడమే. 'ఇప్పపూలు' కథాసంకలనం మొదటి ప్రచురణలో ముగ్గురు గిరిజన తెగల మూలాలకు చెందిన కథకులుంటే రెండో ప్రచురణ నాటికి మరో ముగ్గురు కలిసేరు. ఆ ఆరుగురు తప్ప తరువాత ఎవరైనా వొచ్చేరా? గిరిజన రచయితల్ని తయారుచేసుకోవలసిన బాధ్యత ప్రస్తుత గిరిజన రచయితలపైనే ఉంది. కొత్తతరం రచయితలు వస్తే తప్ప గిరిజన సాహిత్యం విస్తృతమయ్యే అవకాశం లేదు.

ఇక ఉత్తరాంధ్రనుంచి ప్రస్తుతం గిరిజన సాహిత్యం రాస్తున్నది మల్లిపురం జగదీశ్ మాత్రమే. తిమ్మక రాంప్రసాద్ కొన్ని కవితలు రాసేడు. ఇంతవరకూ రాసిన కథ ఒకటి మాత్రమే అనుకుంటాను. రాంప్రసాద్ కూడా ఆరు నుంచి పదోతరగతిదాకా టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలో నాదగ్గర చదువుకున్న విద్యార్థి. రాంప్రసాద్ గిరిజన జీవితాన్ని జీవించినవాడు. అతని తల్లిదండ్రులు వేసవిలో కొండ మీద పోడు మంటలేసి, వ్యవసాయ యోగ్యంగా మార్చి కంకతో తవ్వి విత్తనాలు వేసినవారు. గిరిజన భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు తమ ఇంట ఆచరిస్తున్నవారు, తననుండి అచ్చమైన గిరిజన కథ వస్తుందని ఆశ ఉండేది కానీ తనకి రాతపై అంత శ్రద్ధ ఉన్నట్టు లేదు. చేసే కృషీ కనబడదు.

**9. 'కొండమల్లె', 'రాగాల చెట్టు'వంటి గిరిజన కథల్లోనేకాక మీ మిగిలిన కథల్లో కూడా పాట వినిపిస్తుంది. అసలు పాట మీ జీవితంలోకి ఎలా ప్రవేశించింది?**

నా బాల్యం పాటల మధ్యనే గడిచింది. నా చిన్నప్పుడు మా ఇల్లొక 'పాటశాల' అనాలి. మా బావు కళాకారుడని చెప్పేనుకదా! మా ఇంట్లో హార్మణీ ఒకటుండీది. సాయంత్రాలు మా ఇంటి గడపలో మా బావు హార్మణీ వాయిస్తుంటే వీధివీధంతా రాగాల పల్లకిలో తేలిపోయీది. పౌరాణిక నాటక పద్యాలతో, పాటలతో సందడిగా ముగిసేది రోజు. మా బావు నేర్పిన పాటలు బడిలో పాడేవాడిని. అప్పటికి మాబడిలో నేనే మహాగాయకుణ్ణి కాబట్టి ఆగష్టు పదిహేను, గణతంత్ర దినోత్సవంవంటి సందర్భాల్లో బహుమతులు నాకే దక్కేవి. జానపదుల పాటలు, రాత్రి వీధుల్లో పాటుకుడు పైడయ్య పాడే జముకుల కథలు, ఎర్రగొల్లోల బాగోతాలు, జాలారి బాగోతం, బుర్రకథలు, పొలాల్లో ఉడుపుల పాటలు, ఇవన్నీ నాకు పాటలు పాడ్డం నేర్పేయి. పాట నిరంతరం నాతో ఉండీది. 'పాట నా ఉనికి' పాట నా మనికి, అన్నట్టుండీది. నేను వ్యవసాయం చేసే రోజుల్లో 'పని పాట' రెండూ నానుండి విడదీయలేనివి.

"పనికితోడు పాట, పాటకు సైదోడు పని,

పని పాట ఇద్దరు కవల పిల్లలు..

ప్రజలపాటకెప్పుడూ లేవులే ఎల్లలు" అనే పాట రాసేను ఆ తరువాతెప్పుడో. నాతో

పాటు నడిచొచ్చిన పాట కథలోకి రాకుండా ఎలా వుంటుంది?

**10. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని అవకతవకలను కథలుగా రాసేరు కదా, మీ ముందుతరం గిరిజన కథాసాహిత్యంలో పాఠశాల వ్యవస్థ కథల్లో ఏమేరకు చిత్రితమయ్యింది?**

నాకు ముందు గిరిజన కథలు రాసినవారు భూషణం మాష్టారు, అట్టాడ అప్పల్నాయుడు. వారి కథల్లో పాఠశాల నేపథ్యంగా కథలు వచ్చినట్టు లేదు. నేను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోనే నా ఉద్యోగ జీవితం సాగింది కాబట్టి నా కథలు కొన్ని పాఠశాల నేపథ్యంలో వచ్చేయి. నిజానికి పాఠశాల నేపథ్యంలో కనీసం పదో పదిహేనో కథలు రాసి పుస్తకం తేవాలని ఉండీది. కానీ ఆపని చెయ్యలేక పోయేను. నాకెప్పటికీ అదొక అసంతృప్తి. బడి నేపథ్యంలో రాసిన కొన్ని కథలు పోగొట్టుకుని నా కథల పుస్తకంలోకి వెయ్యలేకపోయేను. నాతో కలిసి పనిచేసిన మిత్రుడు ఉపాధ్యాయుల గౌరీశంకరరావు బడి నేపథ్యంలో ఒక కథ రాసినట్టు గుర్తు. కమలకుమారి గారిదొక కథ ఉంది 'నీటిచక్రం' నా సంపాదకత్వంలో స్నేహకళాసాహితి 'బడికథలు' సంకలనం ప్రచురించింది. అందులో కొన్ని కథలు గిరిజన విద్య నేపథ్యంలో వొచ్చినవే. ఆ సంకలనానికి ప్రముఖ సాహితీవేత్త, కవి, కథకుడు వాడ్రేవు చినవీరభద్రుడుగారు అద్భుతమైన ముందుమాట రాసేరు.

**11. థీమ్, ప్లాట్ రెండింటికి తేడా ఏమిటి? మీరు ఏది ముందుగా తీసుకుని కథ రాస్తారు?**

ఒక ఆలోచనని లేదా స్పందనని పాఠకులతో పంచుకోడానికి కథ రాయాలనుకున్నప్పుడు అందుకు తగ్గట్టుగా పాత్రలు సన్నివేశాలు కల్పించుకుంటారెవరైనా. ఏ ఆలోచనా లేకుండా కథ రూపుకట్టదు. మనసులో సుడి రేగే ఆలోచన 'థీమ్' (నేపథ్యం అనాలేమో) అయితే అది కథగా రూపొందడానికి 'ప్లాట్' కావాలి. "ఒక కార్యకారణ సంబంధం గల కథా సంవిధానమే ప్లాట్" అని 'కథానికా రచన' గురించి వివరిస్తూ అంటారు మహమ్మద్ ఖాసింఖాన్. అంటే 'థీమ్'ని 'ప్లాట్'గా తనదైన శైలిలో కళాత్మకంగా నిర్మించిన కల్పనే కథానిక. నావరకూ నేను కథ చెప్పాల్సిన నేపథ్యం గురించిన ఆలోచన కొంతకాలం అది రోజులు కావచ్చు, లేదా నెలలు కావచ్చు. ఉదాహరణకి 'ఒక ప్రేమికుడైన జానపద గాయకుడు ఉద్యమ కార్యకర్తగా పరిణమించడం నా 'ఏటిపాట' కథ వృత్తాంతము. అదే 'థీమ్'. అది మనసులో ఎన్నాళ్ళో సుడులు తిరిగి లోలోపలే 'ప్లాట్'గా అనుకుని కథ రాయడానికి ఉపక్రమించేను. అంటే 'థీమ్'ని 'ప్లాట్'గా కథారచన సాగిందనే కదా.

**12. ఒక కథకుడిగా సమకాలీన కథాసాహిత్యాన్ని ఎలా చూస్తున్నారు?**

ఏ కథనైనా ఒక కథకుడిగా కాక సాధారణ పాఠకుడిగానే చదువుతాను. అలా చదివినపుడు రచయిత చెప్పదలచుకున్నది హృదయానికి హత్తుకుని నాలో ఏమైనా కొత్త ఆలోచనలకు తావిచ్చిందా? అని ఆలోచిస్తాను. పదేపదే గుర్తొచ్చి ఆలోచనలో పడేస్తే అటువంటి కథని మళ్ళీమళ్ళీ చదువుతాను. ముఖ్యంగా ఏ సమస్యను ఎలా చిత్రించాడీ రచయిత అని చూస్తాను. ఇపుడొస్తున్న కొత్త కథలు ఎక్కువగా ఉత్తమపురుషలోనే సాగడం విశేషం. ఈ పద్ధతిలో కథ విస్తృతంగా చెప్పడానికి అవకాశం

ఉండదని నా అభిప్రాయం. ఎందుకంటే రచయిత పరకాయప్రవేశం చేసి చెప్పాల్సి ఉంటుంది. స్వీయానుభవాలైతే అది వేరే సంగతి. ఏవో కొన్ని కథలు తప్ప కొత్తకథలు సంతృప్తికరంగా ఉన్నట్టనిపించడం లేదు. కొత్తతరం కథకులు కొత్తకొత్త అంశాల్ని కథలుగా రాస్తున్నారు. కాకపోతే అవి కొంతకాలం వెంటాడే కథలుగా ఉండడం లేదు. అంటే శిల్పపరంగా ఏదో లోపం ఉన్నట్టే. కథకుల గురువు కా.రా మాష్టారు అన్నట్టు "వృత్తాంతం మాత్రమే కథ అయిపోదు". ఇప్పటి కథలు చాలావరకు వృత్తాంతమే 'కథ' అన్నట్టు ఉంటున్నాయి. నాకు తోచింది రాస్తాను. పూర్వరచనలు చదవాల్సిన అవసరమేముంది అనే కథకుల్నీ చూస్తున్నాను. వారి కథలు వృత్తాంతాలుగా తేలిపోవడం అందువల్లనే అని నా అభిప్రాయం.

**13. మీరు రాసిన ప్రక్రియల్లో మీకు సంతృప్తిని ఇచ్చిన ప్రక్రియ?**

నేను రాసిన అన్ని ప్రక్రియల్లోనూ నేను సంతృప్తిగానే ఉన్నాను. చెప్పాల్సిన విషయానికి ఏ ప్రక్రియ అనువైనదో ఎంచి ఆ ప్రక్రియల్లో రాసేను. చెప్పాల్సిన విషయం కళ్ళకు కట్టినట్టు స్థలము, కాలము, భాష, రక్తమాంసాలతో సజీవంగా చైతన్యంతో కదిలే పాత్రలకు కథలో అవకాశం ఉంటుంది. ఉద్వేగ క్షణాల్ని, భావావేశాన్ని కొద్ది సమయంలోనూ, తక్కువ చోటులోనూ వ్యక్తం చేయడానికి కవిత, స్వల్పవ్యవధిలో సూటిగా శ్రోత గుండెలోకి దూసుకుపోతుంది. గాయకుల ప్రతిభను బట్టి పాట, పద్యం కూడా. వీటిలో నా వరకూ నాకు ఇష్టమైందీ, కష్టంతో కూడినది కథ, ఇష్టంగానూ కొంత సులువుగానూ నిర్వహించేది పాట. మూడో స్థానం కవితదైతే, నాలుగో స్థానం పద్యానిది.

**14. మీ తరం సాహిత్య వాతావరణానికీ, ఇప్పటికీ ఏమైనా మార్పులున్నాయా?**

నేను కథలు రాయాలనుకున్న కాలంనాటికి నాకు కథలెలా రాయాలో చెప్పేవారు నా దరిదాపుల్లో ఎవరూ లేరు. నేనున్న ప్రాంతానికి పుస్తకాలు దొరికే అవకాశం లేదు. వారపత్రికల్లో వొచ్చిన కథలు చదివి అలా రాయాలనుకోవడమే తప్ప సరైన సూచనలు ఇచ్చేవారు అందుబాటులో లేరు. దృక్పథము, దృష్టికోణము, కంఠస్వరమూ వంటి మాటలసలే తెలీవు. అందువల్ల తొలినాళ్ళలో నేను రాసిన వేల పేజీలు చిత్తుకాగితాలుగా మిగిలిపోయాయంటే నమ్మాలి మీరు.

అప్పల్నాయుడి స్నేహమూ, కా.రా మాష్టారి పరిచయమూ, శ్రీకాకుళ సాహితి నన్ను కథాప్రపంచంలో నిలబడ్డానికి కారణమని చెప్పాలి. నాలాగా కాకుండా సాహిత్య సమాచారం, సలహాలు తరువాతి తరానికి అందుబాటులో ఉండాలని స్నేహకళాసాహితి (కురుపాంలో) ఏర్పాటుచేసి మిత్రులలో పఠనాసక్తి కలిగించి, రచనలు చేయాలనుకునేవారికి తగిన సూచనలు, సలహాలు అందే అవకాశాన్నివ్వడం, సభలు సమావేశాలు నిర్వహించడం, పుస్తకపరిచయాలు, ప్రముఖుల సాహిత్య ప్రసంగాలు ఏర్పాటు చెయ్యడం ద్వారా స్నేహకళాసాహితి సమర్థవంతంగా పనిచేసిందని ఒకింత గర్వంగానే చెప్పొచ్చు.

**15. గిరిజన కథలో మీరు ఆశిస్తున్న మార్పు?**

వర్తమానంలో గిరిజన కథలు రాసే రచయితలు లేకపోవడం పెద్దలోటు. గిరిజనేతరులు వెలుపలినుండి గమనించింది మాత్రమే చెప్పగలరు. గిరిజన సమాజంనుండి వచ్చినవారు రాస్తే ఆ రచనలో అక్కడి జీవితచిత్రణ సమగ్రంగా ఉంటాది. ప్రస్తుతం ఉత్తరాంధ్రవరకు చెప్పుకుంటే మల్లిపురం జగదీశ్ మాత్రమే గిరిజన తెగ మూలాలున్న రచయిత. తిమ్మక రాంప్రసాద్ కూడా. అయితే రాంప్రసాద్ విశేషకృషి చేస్తే గిరిజన కథ సజీవంగా వచ్చే అవకాశం ఉంది. మల్లిపురం జగదీశ్ గిరిజన ప్రాంత సమస్యల్ని కథలుగా మలుస్తున్నా గిరిజన జీవితాన్ని జీవించినవాడు కాకపోవడం వల్ల ఆదివాసీ ప్రాంత జీవితము, భాష, భాషకు ప్రాణమైన పలుకుబడి, సామెతలు, జాతీయాలు అతని కథల్లో కనబడవు. అతని కథల్లోనే కాదు నాతో పాటు భూషణం, అప్పల్నాయుడు, సువర్ణముఖి కథల్లో కూడా. అవి అంత సులభంగా పట్టుబడేవి కావు ఆదివాసీగా జీవిస్తే తప్ప. జగదీశ్ కథలు కూడా అందుకు మినహాయింపు కాదు. తండ్రి, తను కూడా ఉద్యోగరీత్యా బయట సమాజంలో భాగమైవారవ్వడం మరో కారణం. కాకపోతే తాను గిరిజన ప్రాంతంలో పుట్టిపెరిగిన వాడిగా దగ్గరగా పరిశీలించే అవకాశం ఉండడం కొంత గిరిజన కథ రాయడానికి కొంత అనుకూలమైనది.

మిగతా అన్ని భాషల్లోలాగే సవర, జాతాపు, గదబ భాషల్లో కూడా వ్యవహారిక భాష ఉంటాది. ఆ భాషావ్యవహారాలకు సంబంధించిన ఒక ఒడుపు, ఓ చిత్రమైన ఉచ్చారణ, భాషకు ప్రాణమైన పలుకుబడి, సామెతలు, జాతీయాలు, ఇవన్నీ పట్టుకోగలిగే గిరిజనతెగకు చెందిన, ఆ జీవితాన్ని జీవించిన ఆదివాసీ కథకుడు రాసే కథ కోసం ఎదురుచూస్తాను.

**16. మీరు చిత్రకారులని విన్నాం. అసలు బొమ్మలవేపు ఎలా ఆకర్షితులయ్యారు?**

చిత్రకారుడిని అని చెప్పుకోదగిన స్థాయి నాకు లేదు. కాకపోతే చిత్రలేఖనం నాకు బాల్యం నుండీ ఇష్టమైన కళల్లో ఒకటి. నా చిన్నప్పుడు మా బావు రంగుపెన్సిళ్ళు, వాటర్ కలర్స్ బాక్స్ తెచ్చి మా ఇంటి గోడమీద బొమ్మలేయడం నాకు చిత్రలేఖనంపట్ల ఆసక్తి కలిగింది. బొమ్మలేయడం నా హాబీగా మారిపోయింది. ఇంటర్లో నాది ఆర్ట్స్ గ్రూప్, నా రూమ్మేట్ ది సైన్స్ గ్రూప్. నాకు బొమ్మలేయడం ఇష్టం కదా. వాడి సైన్స్ రికార్డు బొమ్మలెయ్యడం నాపని, వంట చెయ్యడం వాడి పని. వాడి బొమ్మలేకాక ఇతర సైన్స్ గ్రూప్ మిత్రుల రికార్డు బొమ్మలు నేనే గీసేవాడిని. బదులుగా వారు నాకు సినిమా టిక్కెట్లు తియ్యాలి. అదీ మా ఒప్పందం. అలా ఇంటర్ రెండేళ్ళూ నలుగురైదుగురు మిత్రుల సైన్సు రికార్డుల్లో బొమ్మలు నేనే వేసేను.

నాకు చిత్రలేఖనంపట్ల గల ఆసక్తిని గమనించి నాచే ప్రైవేటుగా తెలుగు పరీక్షలు రాయించిన గురువుగారు సామవేదుల రామగోపాలశాస్త్రిగారు. చెప్పిన పాఠానికి తగిన బొమ్మ వేసి చూపించమనేవారు. గేయమో, పద్యమో రాయమనేవారు. నా ఆసక్తుల్ని గమనించి అలా ప్రోత్సహించిన ఆయన నిజమైన గురువు. ఇంటర్ తరువాత ఇంట్లోనూ బొమ్మలెయ్యడం కొనసాగింది. ఉద్యోగం వచ్చేక పాఠ్యబోధనకు నాకు బాగా సహకరించింది ఈ చిత్రలేఖనం. నల్లబల్ల మీద బొమ్మ వెయ్యకుండా చెప్పిన పాఠంగానీ, రోజుగానీ లేదు. గానం, చిత్రలేఖనం నా ఉద్యోగ జీవితంలో ఎంతగానో ఉపయోగపడ్డాయి. సాహిత్య ప్రపంచంలోకి వచ్చేక చిత్రలేఖనంపట్ల శ్రద్ధ ఎందుకో తగ్గుతూ వచ్చింది. బహుశా రంగులు, కుంచెలు, డ్రాయింగ్ పేపర్లు వాటితోపాటు సమయం కూడా అదనపు బరువుగా మారిపోయి కావచ్చు. నా పుస్తకాలకు నేను ముఖచిత్రం వేసుకోవాలని కూడా అనిపించలేదెప్పుడూ. 'కళింగోర' 'గీతాంజలి' పుస్తకాలకు మాత్రమే వేసేను. అదీ ఆ సమయానికి మరో అవకాశం కుదరక.

ప్రముఖ చిత్ర, నఖచిత్ర కళాకారుడు మిత్రుడు పల్ల పరిశినాయుడు సూచనలతో నఖచిత్రాలు కూడా వేసేను. అవి కొన్ని పత్రికల్లో అచ్చయ్యేయి కూడా. తరువాత నా గోళ్ళు చిట్లిపోతుండడం కారణంగా నఖచిత్రాలు వెయ్యడం ఆపేసేను. మిత్రుడు, చిత్రకారుడు చందనపల్లి గోపాలరావు రంగులు, కుంచెలు తెచ్చిచ్చి "తిరిగి చిత్రలేఖనం మొదలెట్టండి" అన్నాడు. చూడాలి మరి. 'నేనూ బొమ్మలేసేవాడినే' అని చెప్పుకోడానికి ఒక్క పెయింటింగూ నాదగ్గర లేదిప్పుడు. అలాగని బొమ్మ నానుండి దూరం కాలేదు. మా మనవరాళ్ళకు బొమ్మలేసి చూపించి వాళ్ళతో గీయిస్తుంటాను. మా ఇద్దరబ్బాయిలూ బొమ్మలు గీస్తారు కానీ వారిని వారి ఉద్యోగాలు గియ్యనిచ్చేలా లేవు.

**17. మీరు స్థాపించిన 'స్నేహకళాసాహితి' సంస్థ మూడు దశాబ్దాలు పూర్తి చేసుకుంది కదా సంస్థ సాధించిన మైలురాళ్ళవంటి సంఘటనల గురించి?**

ఔను... 'స్నేహకళాసాహితి' సంస్థ ముప్పయ్యేళ్ళ కాలంలో చాలా కార్యక్రమాలు చేసింది. సభలు, సమావేశాలు నిర్వహించింది. కురుపాంలో సంస్థ కోసం ఒక భవనాన్ని నిర్మించుకోవడం కూడా జరిగింది. అనుబంధంగా లైబ్రరీని కూడా ఏర్పాటు చేసుకున్నాం. లైబ్రరీకి కా.రా మాష్టారూ, చినవీరభద్రుడుగారూ చాలా పుస్తకాలిచ్చేరు. అనివార్యంగా నేనూ, కార్యదర్శి జి. రామకృష్ణ (శాంతి) పార్వతీపురంలో నివాసం ఏర్పరుచుకోవాల్సిన తప్పనిసరి పరిస్థితుల్లో కురుపాంనుండి సంస్థ కార్యకలాపాలు పార్వతీపురంలో జరుగుతున్నాయిప్పుడు.

సాహిత్యంలో ప్రముఖులనదగ్గవారెందరో 'స్నేహకళాసాహితి' సభల్లో పాల్గొని అపురూపమైన ప్రసంగాలు చేసేరు. కథాదీపధారి కాళీపట్నం రామారావు మాష్టారు, ప్రముఖకవి కె. శివారెడ్డి, కవనశర్మ, కోడూరి శ్రీరామమూర్తి, వాడ్రేవు చినవీరభద్రుడు, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, భూషణం, అట్టాడ అప్పల్నాయుడు, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, డా? రామసూరి, పాలపిట్ట ఎడిటర్ గుడిపాటి, నవ్య వీక్లీ ఎడిటర్ ఎ.ఎన్. జగన్నాథశర్మ వంటి సాహితీమేరువులు అనదగిన వారెందరో 'స్నేహకళాసాహితి' సభలలో ప్రసంగాలు చేసేరు.

చింతా అప్పలనాయుడు, సిరికి స్వామినాయుడు, మల్లిపురం జగదీశ్, చందనపల్లి గోపాలరావు, పల్ల రోహిణీ కుమార్, జాగాన సింహాచలం, రావుపల్లి వాసుదేవరావు, ఎన్. గౌతమి మొదలైనవారు కవులుగా కథకులు, రచయితలుగా రూపుదిద్దుకున్నది 'స్నేహకళాసాహితి' లోనే. పాలకొల్లు రామలింగస్వామి, పి. కమల కుమారి స్నేహకళాసాహితి సభ్యులే.

పుస్తక ప్రచురణ బాధ్యతలు కూడా చేపట్టి ఇప్పటివరకూ ముప్ఫైకిపైగా పుస్తకాలు (సంస్థ సభ్యుల రచనలు) ప్రచురించడమైంది. స్నే.క.సా ప్రచురించిన చాలా పుస్తకాలకు ప్రతిష్ఠాత్మకమైన సాహిత్య పురస్కారాలూ వచ్చేయి.

పార్వతీపురమూ పరిసరాల రచయితలు రాసిన ఏభైనాలుగు కథలతో 'కథాపార్వతీపురం' (ఆచంట సాంఖ్యాయనశర్మ నుండి వర్తమాన కథకుల దాకా) కథాసంకలనం, నాగావళి నదిపై నిర్మాణమైన తోటపల్లి బేరేజి కారణంగా ముంపునకు గురయిన గ్రామాల నేపథ్యంలో వచ్చిన కథలను 'పొద్దుములిగి పోయింది' పేరుతో కథాసంకలనం, నిర్భయ నేపథ్యంలో కవితాసంకలనం ప్రత్యేకంగా ప్రచురించింది 'స్నేహకళాసాహితి'. పుస్తక ప్రచురణలో స్థానిక, సంస్థ సభ్యుల రచనలు అదీ బాధ్యతాయుతమైన రచనలనే పుస్తకాలుగా ప్రచురించాలన్నదే లక్ష్యంగా పుస్తకప్రచురణ ఎంపిక జరుగుతుంది. వారంవారం కథా చర్చలు, పుస్తక పరిచయాలు జరుపుతూ తన బాధ్యతగా సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తోంది 'స్నేహకళాసాహితి'.

**18. 'స్నేహకళాసాహితి'లో తయారైన కవులు, కథకులు సాధించిన విజయాలు గురించి?**

'స్నేహకళాసాహితి'లో సభ్యులుగా చేరి కవులుగా, కథకులుగా ఎదిగినవారు చింతా అప్పలనాయుడు, సిరికి స్వామినాయుడు, మల్లిపురం జగదీశ్ ఈ ముగ్గురూ రెండు తెలుగు రాష్ట్రాలలో సాహిత్యాభిమానులకు సుపరిచితులు. చింతా అప్పలనాయుడు 'దుక్కి', 'అరిచేతిలో బువ్వపువ్వు' (కవితా సంపుటాలు), 'నకజనకరి నాం... నాం...' (కథా సంపుటి) ప్రచురణ అయ్యేయి. 'దుక్కి' కవితా సంపుటికి 'ఫ్రీవెర్స్ ఫ్రంట్ పురస్కారం' ఇంకా మరికొన్ని పురస్కారాలు లభించేయి. సిరికి స్వామినాయుడు 'మంటిదివ్వ', 'మట్టిరంగు బొమ్మలు' కవితా సంపుటాలు ప్రచురించేడు. మంటిదివ్వకు 'ఉమ్మడిశెట్టి సాహిత్య అవార్డు', 'రంగినేని సాహిత్య పురస్కారం' ఇంకా మరికొన్ని ప్రతిష్టాత్మక పురస్కారాలు లభించేయి.

మల్లిపురం జగదీశ్ కళింగాంధ్రలో గిరిజన తెగకు చెందిన ఏకైక కథకుడు. 'శిలకోల', 'గురి' అనే రెండు కథా సంపుటాలు, 'దుర్ల' కవితాసంపుటి ప్రచురించేడు. 'రంగినేని ఎల్లమ్మ పురస్కారం', 'మాడభూషి రంగాచారి స్మారక సాహిత్య పురస్కారం', 'రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం'వంటి అనేక పురస్కారాలు స్వీకరించేడు. చందనపల్లి గోపాలరావు తన మొదటి కథకే బహుమతి పొందడం విశేషం. పల్ల రోహిణీ కుమార్ తన కవితకు 'శ్రీశ్రీ సాహిత్య పురస్కారం' స్వీకరించేడు. వీరిద్దరూ కథకులుగానేకాక చిత్రకారులుగా కూడా రాణిస్తున్నారు.

**19. ఉత్తరాంధ్ర నాటి-నేటి సాహిత్య విమర్శ గురించి?**

ఉత్తరాంధ్రకు సంబంధించినంతవరకు విమర్శక రంగంలో కృషిచేస్తున్నవారు అరుదు. ఒకప్పుడు కోడూరి శ్రీరామమూర్తిగారు విమర్శ రంగంలో విశేషకృషి చేసేరు. ఆయన అనంతరం రచయితలకు మంచి ప్రోత్సాహం అందించినవారు. ఆ తరువాత విమర్శ ఈ ప్రాంతంనుండి లేదనే చెప్పాలి. అప్పుడప్పుడూ ఒకట్రెండు విమర్శనా వ్యాసాలు రాసినవారుంటే ఉండొచ్చుగాక కానీ విమర్శ ప్రధానంగా కృషిచేసినవారు నాకైతే కనిపించలేదు. వర్తమానంలో అయితే విరివిగా విమర్శ వ్యాసాలు రాస్తున్న 'పిల్లా తిరుపతిరావు'ను చెప్పుకోవాలి. అయితే ఇప్పుడు విమర్శ పేరుతో వస్తున్న వాటిని సాహిత్య పరామర్శ, విశ్లేషణ, లేదా పరిచయం అనాలేమో... (ఒకవేళ నిజాయితీగా విమర్శ చేసినా కవులు, రచయితలు స్వీకరించే స్థితిలో ఉన్నారా?) ఉంటే ఎక్కడో... ఎవరో... ఏ మూలనో... ఇప్పుడొస్తున్నవి సాహిత్య పరిచయాలు, పరామర్శలు, విశ్లేషణలు అనొచ్చు. ప్రయత్నిస్తే బాల సుధాకరమౌళి, ఆల్తి మోహన్, పొదిలాపు శ్రీనివాసరావు, సారిపల్లి నాగరాజు... వీరు మంచి విమర్శనా వ్యాసాలు రాయగల అవకాశం ఉన్నవారని నాకనిపిస్తుంది. వారు అప్పుడప్పుడూ రాస్తున్న వ్యాసాలు అందుకు ఉదాహరణలు.

**20. యువత నుంచి వస్తున్న సాహిత్యంలో నగర జీవనమే అధికమోతాదులో ఉంది, మీలా గ్రామీణ జీవితంనుంచి వస్తున్న యువరచయితలు ఎవరన్నా ఉన్నారా?**

నిజమే... ఒకప్పుడు గ్రామీణ జీవితమే ఎక్కువగా కథా రచనకు పాదుగా ఉండీది. క్రమంగా కథ బస్తీబాట పట్టినట్టుంది. పూర్వకథకుల కథల్ని ఒకసారి అవలోకిస్తే ఎక్కువ సంఖ్యలో గ్రామీణ జీవితమే కథావస్తువు కావడం కనిపిస్తుంది. ప్రస్తుతం కథ పల్లెనొదిలి పట్నాలకొచ్చిందన్నది ఆలోచించాల్సిన విషయమే. బహుశా రచయితలు ఎక్కువ శాతము ఉద్యోగాల్లో ఉన్నవారు కావడం, పట్నాల్లో నివాసం ఉండడం కారణం కావచ్చు. ఒకసారి పల్లెకి దూరమైనాక అక్కడి ఆచార వ్యవహారాలకు ముఖ్యంగా ఆ భాషకు దూఽరమైపోవడం, అక్కడి సమస్యల పరిశీలనకు అవకాశం లేకపోవడం, పెరిగే జీవనవేగం, కాలంతోపాటు పరుగు తీయాల్సి రావడం, రకరకాల వొత్తిడులు ఇవన్నీ కారణమే. పల్లెలిప్పుడు లేవు. పల్లెలే అనుకుంటున్నా అవి స్వభావానికి పట్నాలే. పల్లె స్వరూప స్వభావాలు మారిపోయేయి. అందువల్ల సాహిత్యంలో గ్రామీణ జీవనచిత్రణకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు గ్రామాల్లో ఉండి రాస్తున్నవారు నాకు తెలిసినంతవరకూ లేరనే.

**రచయిత: పరిశోధక విద్యార్థి హెచ్.సి.యు** T

# పేరిణి శివతాండవం వీరశౌర్యాలకు ప్రతీకనా? హాస్య రసభరితమా?

డా.రామకృష్ణ వి.

**సంక్షిప్తి (Abstract)**

పేరిణి శివతాండవం ఇటీవలి నృత్యరూపం. దీనిని దివంగత ప్రొఫెసర్ నటరాజ రామకృష్ణ పునరావిష్కరించారు. కాకతీయులపాలనలో వీరశైవ సంప్రదాయంద్వారా ఇది ప్రజాదరణ పొందిందని ఆయన నమ్ముతారు. ఇది ఒక పురాతన కళారూపం. ముఖ్యంగా 'దేశీ' సంప్రదాయానికి సంబంధించినది. శతాబ్దాల క్రితంనుండి ఇది మన భారతదేశంలో 'దక్కన్' ప్రాంతంలో బాగా అభివృద్ధి చెందింది. ఈ పూర్తి నృత్యాన్ని శివునికి అంకితం చేస్తూ గర్భగుడిలో ఆరాధనాపరంగా ప్రదర్శించేవారట. కాకతీయుల తర్వాత అది కనుమరుగైంది. నేడు ఈ కళారూపం ఉనికిలో ఉందంటే దానికి ప్రధాన కారణం డాక్టర్ నటరాజ రామకృష్ణ పరిశోధన కృషి. తెలంగాణ రాష్ట్రావతరణ తర్వాత ఇది మరింత ప్రచారంలోకి వచ్చింది.

**పేరిణి నృత్యం-చారిత్రక ఆధారాలు:**

ఈ నృత్యాన్ని ప్రదర్శించే నృత్యకారులను 'పెరణిన్' అని పిలుస్తారు. పెరణిన్ తన శరీరమంతా బూడిదను పూసుకుని, గుండుపై చిన్న పిలకని ఉంచుకొని తక్కినభాగం శుభ్రంగా కత్తిరించుకోవాలి. అతను మధురమైన గాయకుడితోపాటు తాళ, నృత్యం, లయ వంటి అంశాలలో మంచిపట్టును కలిగి ఉండాలి. పిక్కల చుట్టూ గజ్జెలు కట్టి ప్రదర్శనలివ్వాలి.

నందికేశ్వరుని భరతార్ణవం, పార్శ్వదేవుని సంగీత-సమయ-సార, సారంగదేవుని సంగీతరత్నాకర, జాయపసేనాని నృత్తరత్నావళి ప్రకారం పేరిణి అభినయం దాని ఐదు ముఖ్యమైన లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. వాటినే 'పేరిణి పంచంగాలు' అని పిలుస్తారు.

1. ఘర్ఘర-ఇది పాదాలతో చేసే నృత్తప్రక్రియ. 6 లేదా 7 రకాలను కలిగి ఉంటుంది. అవి- పరిపాట/పరివాద, చాపదప/చవద, శిరిపిట్టి/సిరిపిటి, అలగ్నపాట, చిరిహిర/సిరిచిరం, ఖులూహుల మరియు రుంధ.

2. విషమ/నృత్తం-కాళ్లు, పాదాల కదలికతో ఒక ఉత్పత్తితో ప్రారంభమవుతుంది/లాస్య, తాండవ పద్ధతిలో ప్రదర్శించాలి.

3. భావాశ్రయ/వికట/వాగడ - హాస్యాస్పదమైన విషయాలను అనుకరిస్తుంది (హాస్యరసాన్ని ఉత్పత్తి చేయడానికి) ప్రదర్శించాలి.

4. కవిచారక/కైవార - ఉత్తమ నాయక/రాజు ఉన్నత లక్షణాలను కీర్తిస్తుండాలి.

5. గీత -సాలగ సూడ పాటలు పాడాలి.

డాక్టర్ నటరాజ రామకృష్ణ శివభగవానుడి పట్ల, శైవాగమ సంప్రదాయాలపై ఉన్న భక్తి ప్రభావాలచే 'పేరిణి శివ తాండవం' అనే సంప్రదాయాన్ని తిరిగి ఆవిష్కరించేలా చేసింది. డాక్టర్ నటరాజ రామకృష్ణ పేరిణి ప్రదర్శన గురించి ఆలోచించింది పురాతన గ్రంథాలకు విరుద్ధంగా ఉంది. అతని ప్రకారం, పేరిణి ఒక పురుష ప్రధాన నృత్య రూపం. వీర, రౌద్ర రసభావాలచే ప్రబలమైనది' కానీ ఈ ప్రకటన పూర్తిగా నిరాధారమైనది. నిజానికి, పేరిణి అనేది వీర, శౌర్య నృత్య రూపం కాదు, ఇది ఒక హాస్యరసభరితమైన నృత్యకళ. శాస్త్రాల ప్రకారం ఇది కేవలం హాస్య రసముత్పత్తి చేసే ఒక 'దేశీ' కళారూపం. నృత్త ఆధారిత నృత్య రూపం. నర్తకులు/నర్తకుడు స్వయంగా మంచి గాయకులై/గాయకుడై, సంగీతకారులై/సంగీతకారుడై ఉండాలి. వారు సంగీతం, తాళాన్ని ఆదేశించాలి. ఇది కాకుండా, నర్తకులు మొత్తం ప్రదర్శనలో ప్రేక్షకులకు హాస్య భావాలను సృష్టించేందుకు హాస్యాస్పదమైన విషయాలను అనుకరించవలసి ఉంటుంది.

**పరిశోధన పత్ర పరిచయం:**

ప్రస్తుత పేరిణి నృత్యరూపాన్ని 'పేరిణి శివ తాండవం' అని పిలుస్తారుబీ ఇది డాక్టర్ నటరాజ రామకృష్ణ పునరుద్ధరణ రూపం. డా. నటరాజ రామకృష్ణ ప్రకారం - పేరిణి అంటే 'స్ఫూర్తి'. పేరిణి అనే పదాన్ని తెలుగు మాట్లాడే ప్రజలు 'ప్రేరణ' గా మార్చారు. కాకతీయుల కాలంలో, ఈ నృత్యరూపాన్ని శివుని దివ్య శక్తులను ఆవాహన చేయడానికి , విజయంకోసం, యుద్ధంలో బలాన్ని పొందడానికి, యుద్ధభూమికి వెళ్ళే ముందు అతని ఆశీర్వాదంకోసం సైనికుల ముందు ప్రదర్శించబడేదని నమ్ముతారు.

డా. నటరాజ రామకృష్ణ ప్రకారం, ఈ నృత్యరూపం గర్భగుడిలో ఆరాధనగా శివునికి పూర్తి ప్రదర్శనను అంకితం

చేస్తారు. మొత్తం ప్రదర్శన పేరిణి–పంచాంగాలపై ఆధారపడి ఉంటుంది, అవిబీ ఘర్ఘర, విషమ, భావాశ్రయ, కైవారక, గీత. పేరిణి కళాకారులు క్రమబద్ధంగా ప్రదర్శించాల్సిన ఐదు భాగాలు ఇవే. ఈ పంచాంగాలన్నీ పంచభూతారాధన, ప్రకృతిలోని ఐదు అంశాలు అంటే పృథ్వీ, ఆకాశ, తేజో, జల, వాయు (శివుని అవతారాలు) వంటి వాటిని శివునికి అంకితం చేసి నిర్వహిస్తారు.

నాట్యశాస్త్రాన్ని అధ్యయనం చేసిన పండితులు కూడా భరతుని నాట్యశాస్త్రంలో 'పేరిణి'ని పేర్కొనలేదు. నందికేశ్వరుడు తన గ్రంథంలో పేరిణిని ప్రస్తావించినవారికి మార్గదర్శకుడు. భరతార్ణవ ప్రకారం పేరిణి లాస్య సంప్రదాయంగా ఉద్భవించింది. అతను తన గ్రంథంలో పేరిణిని సప్తలాస్యాలలో ఒకటిగా పేర్కొన్నాడు. భరతార్ణవ గ్రంథం తరువాత, ఇది శతాబ్దాల క్రితం భారతదేశంలోని దక్కన్ పీఠభూమిలో 'దేశీ'గా పరిణామం చెందింది. పేరిణి అనే పదాన్ని చాలామంది రచయితలు తమ గ్రంథాలలో ఉపయోగించారు. అభినవగుప్తుడు వంటి కొందరు రచయితలు దీనిని ఉపరూపాలలో ఒకటిగా ఉపయోగించారు. ప్రేరణ అనే పదానికి అంతిమ అర్థం ఎప్పటినుంచో ఉపయోగించబడింది అంటే అది హాస్య భావనతో కూడిన ఒక నాటకం అని అర్థం.

ప్రస్తుత పేరిణి శివతాండవం కచేరీ సంబంధిత శాస్త్రాల ప్రకారం పంచాంగాలకు విరుద్ధంగా ఉంది. డా. నటరాజ రామకృష్ణ ప్రకారం, పేరిణి శివతాండవం 'శౌర్య' నృత్యం ప్రధానమైనది. 'వీర, రౌద్ర రసభావాలు శివుని భక్తితో ప్రదర్శించబడతాయి. కానీ శాస్త్రాల ప్రకారం ఇది ఒక హాస్యభరిత కళారూపం. ఇందులో ఎటువంటి దైవము, దైవభక్తి పరమైన ప్రదర్శనకు ఎలాంటి తావులేదు. ప్రస్తుత పేరిణి శివతాండవం శాస్త్రాలకు విరుద్ధంగా ఉంది.

**ప్రబంధాలు/ శాస్త్రాలలో పేరిణి స్వరూపం:**

**నందికేశ్వరుని భరతార్ణవం, శార్గదేవుని సంగీతరత్నాకరం:**

పేరిణికి సంబంధించిన పై రెండు గ్రంథాలలో అందించిన సమాచారం దాదాపు ఒకే విధంగా ఉంది.

పేరిణి పంచాంగాలు:

పేరిణి ఐదు అంగాలు: 1. ఘర్ఘర, 2. విషమ, 3. భావాశ్రయ, 4. కవిచారక 5. గీతం.

1. ఘర్ఘరికా: అనగా పాదాల అడుగుల కదలికలు. ఇది: ఆరు రకాల ఘర్ఘరికలను కలిగి ఉంటుంది.

అవి–1. పరిపాట, 2. చాపదప, 3. సిరిపిట్టి, 4. అలగ పాట, 5. చిరిహిర 6. ఖులుహుల.

2. విషమ: ఉత్ప్లుతీకారణాలతో మొదలయ్యే కరణాలకు పెట్టిన పేరు.

3. భావాశ్రయ: విచిత్రమైన లేదా వికృత (కామిక్ ఎఫెక్ట్ విషయాలను సృష్టించడం) అనుకరణగా పండితులచే అంగీకరించబడింది.

4. కవిచార: ఇది నాయకుడి ఉన్నత లక్షణాలను వర్ణించడం. (కానీ దేవిదేవతలు కాదు)

5. గీతం: కుండలి/గొండలికి సూచించబడిన సాలగ (పాటలు మూడు రకాలుగా ఉంటాయి: శుద్ధ, చిత్ర, సాలగ)ను సూచిస్తుంది.

**పార్శ్వదేవుని సంగీత సమయ సార:**

పేరిణి:

నృత్త, కైవార, ఘర్ఘర, వికట మరియు గీత అనేవి పేరిణిలోని పంచాంగాలు (ఐదు భాగాలు).

1. నృత్తం: నృత్త అనేది తాండవ, లాస్య అనే రెండు రకాలు. తద్వారా వివిధ తాళాలు, లయలకు ఉపలయంగా అనుసరించాలి.

2. కైవారం: ప్రాచీన రాజుల నిష్ఠాత స్వభావాన్ని వివరించడం. పీఠాధిపతి వివిధ పాత్రలను ఆపాదించడం కైవారం.

3. ఘర్ఘర: తాళాల సంకలనం ఘర్ఘరా.

4. వికట: కోతులు, మరుగుజ్జులు మొదలైనవాటి హాస్య వేషధారణపై ఆధారపడి ఉంటుంది. ఇక్కడ వికటాభినయ కలయికలో వాగడ ఉంటుంది.

5. గీతం: ప్రదర్శకుడు తాళ (లయ) కలయికలో, కథ (కథ) సహాయంతో లేదా సంకీర్ణ రాగం ద్వారా పాడాలి. దీని ద్వారా ప్రజలు పాటకు ఆకర్షితులవుతారు.

అతను ఘర్ఘర ఉప భాగాలను ప్రస్తావించలేదు. విషమ స్థానంలో అతను నృత్తంను వివరించాడు. భావాశ్రయ పేరుతో వాగడాన్ని పేర్కొన్నాడు.

**జాయప సేనాని– నృత్తరత్నావళి:**

పేరిణి:

నృత్త, కైవార, ఘర్ఘర, వాగడ, గీత పేరిణిలోని పంచాంగాలు (ఐదు భాగాలు).

1. నృత్త: ఇది లాస్య, తాండవ విభాగాలను కలిగి ఉంటుంది.

2. కైవార: ప్రసిద్ధ చక్రవర్తులపై ప్రశంసలు, ప్రజల రాష్ట్రపతిని కూడా ఉద్దేశించినది, కైవారం

3. ఘర్ఘర: కాళ్ళగజ్జెలను తాళం లోపల, వెలుపల ప్రత్యామ్నాయంగా మోగించడం ఘర్ఘర. ఇవి ఏడు రకాలు.

అవి: 1. చావడ: 2. పడివాడ: 3. రుంధ: రెండు పాదాల అంచులను ఏకకాలంలో జారడం రుంధ. ఇది కష్టమైన చర్య. అప్పుడప్పుడు ప్రదర్శించినప్పుడు నవ్వు తెప్పిస్తుంది. 4. సిరిభిర: 5. ఖులూహుల: 6. అలగ్నపాఠ, 7. సిరిపీఠి.

4. వికట: ఆత్మలు, కోతుల వేషధారణ. హావభావాలు వికృతమైన ముఖం, పెదవులు, కళ్ళు, కడుపు, భుజాలు, కాళు ్ళ మొదలైనవాటి ద్వారా కొట్టబడిన కదలికలలో, విచిత్రంగా మార్చబడిన నృత్యం ద్వారా అనుకరించబడతాయి. ఇది వికట. ఇది భండిక అనే పక్షి కదలికలను అనుసరిస్తుందని కొంతమంది అభిప్రాయపడ్డారు. దీన్ని వాగడ అని పిలుస్తారు.

5. గీత: ప్రాచీనకావ్యాలలో నుండి పాటను స్వచ్ఛమైన లేదా తేలికైన రూపంలో పాడటమే గీతం.

ఘర్ఘరను వినిపించే ఈ వైవిధ్యమైన మార్గాలు తాళాలతో లేదా తాళం లేకుండా ఉండవచ్చని జాయప చెప్పారు. సార్ంగదేవుడు తాళాన్ని (VII.1314) అనుసరించాలని స్పష్టంగా పేర్కొన్నాడు, ఇది మరింత నైపుణ్యం, అభ్యాసానికి సంబంధించిన అంశం. హాస్య రసముత్పన్నం చేయడం ఈ నృత్యంలో భాగం. సార్ంగదేవుడు 'అట్ట-బోడక' ద్వారా హాస్య కదలికల ప్రాథమిక ప్రదర్శనను పేర్కొన్నట్లు తెలుస్తోంది. పేరిణి అనేది పశ్చిమ భారతదేశంలో (బసవపురాణం దానిని సౌరాష్ట్రకు సంబంధించినది), డెక్కన్, భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో రాసిన, నృత్తరత్నావళి లేదా సంగీతరత్నాకర వంటి రచనలను సంప్రదించని సహజంగా నృత్య-గ్రంథాలను సరిగ్గా అధ్యయనం చేయలేదు. పేరిణి గురించి సరైన లేదా పూర్తి భావన లేదు. సభరంజని పుస్తకంలో రచయిత వెలుగోట్టి సర్వజ్ఞ కుమార్ యాచేంద్ర నందికేశ్వరుని భరతార్ణవ వచనం ప్రకారం పేరిణి పంచాంగాల పేర్లను ప్రస్తావించారు. కానీ అతను ఏ ఒక్క గ్రంథాల పేర్లను పేర్కొనలేదు. అంతేకాకుండా అతను 6 రకాలుగా ఉన్న ఘర్ఘర ఉపభాగాల నృత్త నడకలు/ అక్షరాలను వివరించాడు. అతను పుష్పాంజలిని వివరించాడు (అంటే సభాపతికి వందనం). ఇది ఇందులోని సరికొత్త అంశం.

పేరిణి సంప్రదాయం ఆవిష్కరణబీ డాక్టర్ నటరాజ రామకృష్ణ (పేరిణి శివతాండవ ఆవిర్భావం)

డాక్టర్ నటరాజ రామకృష్ణ ఇలా అంటాడు- "ఓ పరమ శివా! శివశక్తిని నాలో ప్రవేశింపజేసి, నా శరీరాన్ని పవిత్రమొనరించి, నా శరీరం ద్వారా నీ పవిత్ర నాట్యాన్ని లోకానికెరుక పరచుము". నాట్యము చేసేవారు దేవతను ఇలా ప్రార్థించాలిబీ "ఓ దేవా! మీ శక్తిని నా శరీరంలోకి ప్రవేశింపజేసి, నన్ను శుద్ధి చేయండి. నా శరీరంద్వారా మీ పవిత్రమైన నృత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయండి. శివుని ఈ రకమైన భావోద్వేగం ప్రతి ప్రదర్శకుడి ఆత్మలో జరగాలని అతను విశ్వసిస్తాడు, తద్వారా ప్రదర్శకుడు శివతాండవానికి న్యాయం చేయగలడు. డాక్టర్ నటరాజ రామకృష్ణ పేరిణి శివతాండవం ప్రదర్శనాంశములు/కచేరీలు:

1. మేలప్రాప్తి,
2. తహనావిన్యాసం (పుష్పాంజలి),
3. యతి నర్తనం,
4. కైవారం (పంచముఖ శబ్ద నర్తనం),
5. సమీకరణం

గ్రంథాలలో పేరిణి ప్రదర్శన (భారతార్ణవ, సంగీతరత్నాకర, సంగీత సమయ సార %�
% నృత్తరత్నావళి)

పంచాంగాల ఆధారంగా - పేరిణి శివతాండవం: శాస్త్రాల ఆధారంగా పేరిణి ప్రదర్శన అధ్యయనం, డాక్టర్ నటరాజ రామకృష్ణ పేరిణి శివ తాండవం పునఃసృష్టి ద్వారా గ్రహించిన కొన్ని ముఖ్యమైన పరిశీలనలను ఈ క్రింది విధంగా సంగ్రహించవచ్చు:

పేరిణి పంచాంగాల నుండి నాకు కనిపించిన అసమానతలు డా. నటరాజ రామకృష్ణ పునర్నిర్మించిన పేరిణి శివతాండవంతో శాస్త్రాలకే పరిమితమయ్యాయి. ఘర్ఘర మొదటి భాగం నుండి చూద్దాం. నేటి పేరిణి శివతాండవంలో, ఘర్ఘర పేరుతో ప్రదర్శకులు మేలప్రాప్తిని ప్రదర్శిస్తున్నారు. మేలప్రాప్తి అనే అంశాన్ని ప్రారంభించే ముందు, వారు శివుడిని ఇలా పాట ద్వారా స్తుతిస్తారుబీ హరహర ప్రమద గాధాధిప దేవా%
% ఘర్ఘర భాగంలో దేవతల స్తోత్రం ప్రస్తావించబడలేదు! శాస్త్రాల ప్రకారం, ఘర్ఘర అంటే, ఘర్ఘరా ఉప భాగాలలో పాదచారులు వేయబడుట, ఈ భాగంలో అనుసరించాల్సిన పాట ఏదీ లేదు. కాబట్టి, సంబంధిత శాస్త్రాల ప్రకారం ఇది సారూప్యం కాదు.

శాస్త్రాల ప్రకారం, రెండవ భాగం విషమ, అభినయానికి ఆస్కారం లేదు. సంగీతసమయసార, నృత్తరత్నావళి గ్రంథాలలో ఈ భాగం నృత్తం అని పేర్కొనబడింది. దీనిని లాస్య, తాండవాలనే రెండు విభాగాలలో ప్రదర్శించవచ్చు. ప్రదర్శకులు కొన్ని కరణాలు, చారీలను ప్రదర్శించాలి. ఎటువంటి అభినయానికి చోటు ఉండదు. ఇది భావాభినయం లేనిదైనటువంటి భాగము.

పేరిణి శివతాండవంలోని రెండవ అంశం పుష్పాంజలిబీ పేరిణి వివరములోని సభారంజని పుస్తకంలో పేర్కొనబడిన ఈ అంశాన్ని డా. నటరాజ రామకృష్ణ ఉపయోగించారు. ఇది సభాపతికి వందన సమర్పణ. కానీ ఈ అంశం పేరిణి పంచాంగంలో భాగం కాదు.

భావాశ్రయం లేదా వికతం లేదా వాగడం, కోతి, మరుగుజ్జు (అల్లరిపాత్ర), దెయ్యం వంటి వికృతమైన ముఖం, పెదవులు, కళ్ళు, కడుపు, భుజాలు, కాళ్లు మొదలైనవాటి ద్వారా వికృతమైన వాటిని అనుకరించడం, హాస్య భావాలను సృష్టించడం అభినయాన్ని కలిగి ఉన్న ముఖ్యమైన భాగం. ఈ భాగంలో, ప్రదర్శకుడు పైన చెప్పిన పద్ధతిలో నృత్యాన్ని తాళం లేకుండా ప్రదర్శిస్తూ హాస్య నాటకాన్ని సృష్టించాలి. నిర్దిష్ట తాళాలను అనుసరించకుండానే అభినయ హాస్య ప్రభావాన్ని అందించడానికి ఆస్కారం ఉంటుంది. భావాశ్రయ లేదా వికట లేదా వాగడ, ఇందులో ఎలాంటి గీతానికి కానీ తాళానికి కానీ తావుండదు.

భావాశ్రయ లేదా వికట లేదా వాగడ, పేరిణి శివ తాండవంలో, నటరాజరామకృష్ణ కాకతీయుల పశుపతి సంప్రదాయానికి ప్రభావితుడై తథనుగుణంగా పంచముఖుడైన శివునికి (ఆకాశ, తేజ, వాయు, జల అమృయు పృథ్వీ) శివభక్తిని పోలి ఉండే వివిధ మృదంగ అక్షరాల జతులను సమకూర్చి వాటికి నృత్యకల్పన చేసినాడు. కానీ శాస్త్రాలతో పోల్చి చూస్తే అతని (డా. నటరాజ రామకృష్ణ) అభిప్రాయం పూర్తిగా భిన్నమైనది.

కైవార, దీనిని కవిచారక అని కూడా అంటారు. ఈ భాగంలో ప్రదర్శకుడు రాజులు లేదా నాయకుల సద్గుణ లక్షణాలను స్తుతించాలి. అంతేకానీ ఎటువంటి దేవతలను స్మరించరాదు. కేవలం ప్రదర్శకుడు రాజులను మాత్రమే స్తుతించాలి. ప్రదర్శకుడు రాజుకు సంబధించిన మంచి లక్షణాలను పఠించవచ్చు. మెచ్చుకోవచ్చు. ఇది పూర్తిగా రాజులకు అంకితం చేయబడింది. కానీ ఈ భాగములో ఎటువంటి తాళము, లయ లేదా గీతాలను గూర్చి ప్రస్తావించబడలేదు. కానీ డాక్టర్ నటరాజ రామకృష్ణ పంచలింగాలపై, కైవరాలపై నృత్యకల్పన చేశారు. తన గురువైన శ్రీమతి నాయుడుపేట రాజమ్మ నుండి నేర్చుకున్న శైవాగమాల ప్రభావం, కాకతీయుల పశుపతి సంప్రదాయం అతన్ని పంచలింగాలపై, కైవరాలపై కొరియోగ్రాఫ్/నృత్యకల్పన చేసేలా చేసింది. అయితే ఈ భాగం శాస్త్రాలకు పూర్తిగా భిన్నంగా ఉంది.

డాక్టర్ నటరాజ రామకృష్ణ ప్రకారం, గీతము అను చివరి భాగంలో కైవార ప్రబంధ గీతాలకు నృత్యం చేయాల్సి ఉంటుందని ఆయన అనుకున్నారు. కానీ శాస్త్రాల ప్రకారముబీ గీత అను భాగమునందు, పేరిణి నర్తకులు గీతాలు (పాటలు) పాడాలి అంతేగానీ ఆ పాటలకి నృత్యం చేయకూడదు.

శాస్త్రాలలో పేరిణి ప్రదర్శకుల లక్షణాలలో ఇలా ప్రస్తావించారుబీ పేరిణిని ప్రదర్శించేవారు వాయిద్య సంగీతంలో జ్ఞానాన్ని కలిగి ఉండాలి. తాళాలు, గతులపై మంచిపట్టు కలిగి ఉండాలి. అలానే శాస్త్రీయ గ్రంథాలనుండి పాటలు పాడటంలో ప్రావీణ్యం కలిగి ఉండాలి. ఈ విధంగా ప్రదర్శకులు తమ ప్రదర్శనను అందించాలి. కానీ ప్రస్తుత పేరిణి శివతాండవం ప్రదర్శనలో ఈ భాగం కనిపించదు.

**ముగింపు:**

ప్రస్తుతం మనం చూసే "పేరిణి శివతాండవం" నిజానికి ఒక "వినోదం" లేదా "హాస్య" రూపకం అంటే అతిశయోక్తిగా అనిపించవచ్చు. కానీ సంబంధిత శాస్త్రాల ప్రకారం ప్రాచీన పండితులు వివరించిన విధంగా ఈ కళ ఒక జనరంజకమైన హాస్యకళ. ఈ కళ ఎలాంటి దైవభక్తికి సంబంధం లేని అద్భుతమైన హాస్యరస రంజకమైనది. నిజానికి, మన ప్రాచీన శాస్త్రాలైన భారతార్ణవం, సంగీతసమయసార, సంగీతరత్నాకర, నృత్తరత్నావళి వంటి గ్రంథాలను పరిశీలిస్తే, అది వీరము, శౌర్యము అనిపించుకోదు. ఇది మొత్తం ప్రదర్శనలో ప్రేక్షకులకు హాస్యభావాలను సృష్టించేందుకు అనువుగా ఉంటుంది.

డాక్టర్ నటరాజ రామకృష్ణ, బాల్యం నుండి నాట్య అభ్యాస ప్రభావం, శివునిపై అపారమైన భక్తి, అతని పాండిత్యం, నైపుణ్యం, నాట్యం పట్ల జ్ఞానం, కాకతీయ సామ్రారాజ్యంపై ఉన్న గౌరవం, శిల్పసంపదపై అవగాహన, చరిత్ర ప్రభావం, రామకృష్ణమఠంలో తన చిన్నతనంనుండి శిల్పాల అధ్యయనం, అతనిని వీర, రౌద్ర రసభావాలలో పేరిణిని పునరుద్ధరించేలా చేసి ఉండవచ్చు.

శివతాండవానికి సంబంధించిన నాట్యశాస్త్రం, ఇతర నృత్యగ్రంథాల సహాయంతో అతను అన్ని కరణాలు, అంగహారాలు, చారీ, రేచక, హస్త, పాద, భ్రమరీ, ఉత్ప్లుతి మొదలైనవాటిని సంపాదించాడు. కేవలం భయంకరమైన వాతావరణాన్ని సృష్టించడానికి, రసవత్తరమైన వ్యక్తీకరణను సృష్టించాడు అదే ఈనాటి పేరిణి శివతాండవం.

శివాగమ సంప్రదాయాన్ని తన గురువైన నాయుడుపేట రాజమ్మ నుండి తెలుసుకున్నాడు. వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి నుండి కూచిపూడి, భరతనాట్యం పందనల్లూరు మీనాక్షి సుందరం పిళ్ళై, కథక్ సుఖ్‌దేవ్ జీ, వంటి ప్రముఖు లందరినుంచి దేవదాసి సాంప్రదాయాలను తెలుసుకున్నాడు. కొత్త నృత్యరూపాలకు నాంది పలికాడు.

పేరిణిని వరాక్రమంలో, ఉగ్రరూపంలో చూపించాలనుకున్నాడు. కానీ వాస్తవానికి, దాని ప్రధాన రసం 'హాస్య' రసం. పేరిణి ఆడువారు 'అట్ట–బోడక' తలతో హాస్యభావాలను సృష్టించడానికి హాస్యాస్పదమైన విషయాలను అనుకరించవలసి ఉంటుంది.

డాక్టర్ నటరాజ రామకృష్ణ జాయప సేనాని రాసిన నృత్తరత్నావళి గ్రంథం సహాయంతో పేరిణిని పునర్నిర్మించేటప్పుడు పేరిణిని వీర, శౌర్య స్థితిలో భావించి ఉంటారు. రచయిత జాయపకు పేరిణి నృత్యం గురించి తెలుసుననీ, అతను గణపతిదేవుని రాజ్యంలో గజసేనాని అనీ, యుద్ధభూమికి వెళ్లేముందు ఏనుగులకు, సైనికులకు శిక్షణ ఇవ్వడం అతని ఉద్యోగమనీ, ఈ పేరిణి యుద్ధభూమికి క్రూరమైన స్థితిలో వెళ్ళే సైనికుల ముందు ప్రదర్శింపబడేదనీ, కావున ఇది వీర, రౌద్ర రసాలను కలిగి ఉంటుందని అతను భావించి ఉండవచ్చు. కానీ జాయప మాత్రం కేవలం తన గ్రంథంలో రెండవ భాగంలో మాత్రమే తనకాలంలో అత్యంత ఉనికిలో ఉన్న అన్ని దేశీ నృత్యరూపాలలో ఒకటైన పేరిణిని ప్రస్తావించాడు. డా. నటరాజ రామకృష్ణ అనుకున్నట్లుగా పేరిణి నృత్యానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. కానీ జాయప తనకాలంలో వృద్ధిచెందిన అన్ని దేశీ నృత్యరూపాలను సమాన ప్రాముఖ్యతతో వివరించాడు. డా. నటరాజ రామకృష్ణ, జాయప పట్ల మరీ ముఖ్యంగా, పేరిణి నృత్యంపై, కాకతీయుల పశుపతి సంప్రదాయం (దాన వీర, దయా వీర, యుద్ధ వీర)పై కొంచెం అతిశయోక్తిగా ప్రేరేపణ పొంది, పురుషుల ఆధారిత తాండవ సంప్రదాయంపట్ల ఆసక్తి అతనిని ఆకర్షించి, పేరిణి శివతాండవన్నీ పునర్నిర్మించడానికి కారణమై ఉండవచ్చు.

పేరిణి నృత్యరూపానికి సంబంధించిన చాలా సమాచారం అందుబాటులో లేదు. లేదా కాలగర్భంలో కలసిపోయింది. ఇప్పుడు మనకందుబాటులోనున్న అతికొద్ది గ్రంథాలలో మాత్రమే పేరిణి సమాచారం చాలా కొద్దిమాత్రమే లభ్యమౌతున్నది. అందులోనూ కొన్ని తాళపత్రాలు కనుమరుగైనవి. ప్రస్తుతం మనకు లభ్యమైన పరిమిత సమాచారంతో అసంపూర్ణ నృత్యరూపంగా కనిపిస్తోంది. దీనికి చాలా చరిత్ర ఉంది. కానీ దురదృష్టవశాత్తు అనుసంధానము పోయింది/అందుబాటులో లేదు. పేరిణి, దాని స్వరూపానికి సంబంధించి దొరికిన సామగ్రి సరిపడినంత లేదు. ఆచరణాత్మక పనితీరు లేదా దాని కచేరీల అంశాలు ఆ రోజుల్లో వారు నిజంగా ప్రదర్శించేవాటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవు.

డాక్టర్ నటరాజ రామకృష్ణ రూపొందించిన ప్రస్తుత పేరిణి శివతాండవం అసలు గ్రంథాలలో వర్ణించిన పేరిణిపై భిన్నమైన దృక్కోణంలో ప్రకటితమౌతున్నది, అతని ఆవిష్కరణ నిజమైన పేరిణి అంటే ఏమిటో మరచిపోయేలా చేస్తుంది!

**ఆధార గ్రంథాలు:**


1. అనంతకృష్ణశర్మ, రాళ్లపల్లి. జయప విరచిత నృత్తరత్నావళి. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2007.

2. అప్పారావు, పి.ఎస్.ఆర్. అభినయ దర్పణం. హైదరాబాద్.

3. అప్పారావు, పి.ఎస్.ఆర్. నాట్యశాస్త్రము. హైదరాబాద్.

4. కుసుమాభాయి, కె. నాయకరాజుల చరిత్ర –కళా సంస్కృతి. శ్రీ సాయి ప్రక్రియ. హైదరాబాద్, 2001.

5. కుసుమారెడ్డి, కె. తెలుగు నృత్యకళా సంస్కృతి. శ్రీ ఉదయ్ ప్రింటర్స్. హైదరాబాద్, 2011.

6. కృష్ణ, కళా. పేరిణి తాండవ నృత్య వికాసం. ప్రపంచ తెలుగు సదస్సు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్, 2012.

7. భావనారాయణరావు, ద్వారం. శ్రీపార్శ్వదేవవిరచిత సంగీతసమయసార? శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్. కొవ్వూరు, 2004.

8. మంజులత, అవుల. పేరిణి ఆంధ్ర నాట్యోత్సవాలు – 2007. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2007.

9. రామకృష్ణ, నటరాజు. దక్షిణాత్య నాట్యకళ చరిత్ర. విజయవాడ, 1968.

10. రామకృష్ణ, నటరాజు. ఆంధ్రనాట్యం ఆరాధన నృత్యాలు. పేరిణి ఇంటర్నేషనల్. హైదరాబాద్, 1987.

11. రామకృష్ణ, నటరాజు. ఆంధ్రనాట్యం ఆలయనృత్యాలు. పేరిణి ఇంటర్నేషనల్. హైదరాబాద్, 1987.

12. రామకృష్ణ, నటరాజు. ఆంధ్రనాట్యం ఆస్థాన నర్తనలు. పేరిణి ఇంటర్నేషనల్. హైదరాబాద్, 1987.

13. రామకృష్ణ, నటరాజు. ఆంధ్రనాట్యం పేరిణి–నవజనార్ధనపారిజాతం. పేరిణి అంతర్జాతీయ. హైదరాబాద్, 1987.

14. రామకృష్ణ, నటరాజు. పేరిణి శివ తాండవం. నెలవారీ పేపర్ ప్రత్యేక సంచిక, n.d.

15. రామకృష్ణ, నటరాజు. పేరిణి శివతాండవం. పేరిణి ఇంటర్నేషనల్, హైదరాబాద్, 1984.

16. రామప్ప శిల్పాలు – కళాకృష్ణచే పేరిణి నాట్య పునరుద్ధరణ, ఎన్.డి.

17. సర్వజ్ఞకుమార్ యాచ్చర, వెలుగోటి. సభరంజని. వావిళ్ల రామస్వామిశాస్త్రులు, కుమారులు. చెన్నపురి. మచిలీపట్నం, 1949.

18. సుబ్రహ్మణ్యశాస్త్రి, కల్లినాథ కళానిధితో సారంగదేవుని ఎస్. సంగీతరత్నాకర, సింహభూపాల సుధాకర. వాల్యూమ్ - IV అధ్యాయ్ 7. అడయార్ లైబ్రరీ. మద్రాసు, 1953.


★ రచయిత:అసిస్టెంట్ ప్రొఫెసర్(సి), ఆర్జీయుకెటి–శ్రీకాకుళం

# తెలంగాణ చారిత్రక నాటకాలు-అధ్యయనం

పర్లపల్లి శ్రీశైలం

**పరిశోధన పత్ర సంక్షిప్తి:**

చారిత్రక నాటకానికి ఉండవలసిన ముఖ్య లక్షణం చారిత్రకత. సాంఘిక నాటకం సమకాలీన సమాజాన్ని వాస్తవికంగా చిత్రిస్తుంది. కానీ సామాజిక పరిస్థితులు ఎంత వాస్తవికంగా, ఎంత విపులంగా, ఎంత కళాత్మకంగా చిత్రించినా ఆ దేశ కాల పరిస్థితులు అలా ఎందుకున్నాయనే సందేహం రాదు. యదార్థ జీవితం లోని దేశ, కాల పరిస్థితులు ఎలా ఉన్నా వాటిని అలా చిత్రించటమే సాంఘిక నాటక కర్తవ్యం. ఆయా పరిస్థితుల పూర్వాపరాల పరిశీలన గానీ, కార్యకారణాల పరిశీలన గాని, దానికి అనవసరం. కానీ చారిత్రక పరిణామంతో అది ఒక దశా విశేషమని, పాఠకునికి లేదా ప్రేక్షకునికి తప్పక స్పృహ వుండి తీరుతుంది. ఈ లక్షణాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణలో ఉన్న చారిత్రక నాటకాలను అధ్యయనం చేయడం ఈ పరిశోధన పత్ర ముఖ్య ఉద్దేశ్యం.

**కీలక పదాలు:**

చారిత్రకత, చారిత్రక నాటకాలు, సాంఘిక నాటకం, సమకాలీనత, చరిత్ర.

**పరిచయం:**

గతకాలానికి చెందిన రాజకీయాలు చరిత్ర ఆధారంగా ప్రజలలో చైతన్యం కలిగించడానికి దోహదపడే విధంగా తెలంగాణలో చారిత్రక నాటకాలు రూపుదిద్దుకున్నాయి. నిజానికి చరిత్ర అనేది గతం అన్న దానికి ప్రతీకగా ఉంటుంది. సుప్రసిద్ధ చారిత్రక శాస్త్రవేత్త ఇ.హెచ్. కార్ చరిత్రను "గతానికి, వర్తమానానికి మధ్య సాగే అనంతమైన సంభాషణ"గా అభివర్ణించారు. వర్తమానంతో సంబంధం లేకుండా ఏ చరిత్రకారుడు గత చరిత్రను అధ్యయనం చెయ్యడు. చారిత్రక నాటక రచయితకు ఈ సూత్రం వర్తిస్తుంది.

ఓరుగల్లు సాహిత్యంలో రుద్రమదేవి సేనాని జాయపసేనాని రచించిన 'నృత్త రత్నావళి' మొట్టమొదటి నాట్యశాస్త్రముగా పేర్కొంటున్నారు. గంగాధర కవి భారతము (నాటకము), నరసింహ కవి - కాదంబరి నాటకం, విశ్వనాధుడు సౌగంధికాపహరణము (రూపకం), ప్రతాపరుద్రుని అస్థాన పండితుడు వీర వల్లభ దేశికుడు రాసిన నాట్య శేఖరములను తొలి కాలపు నాటక సాహిత్యంగా మనం చెప్పుకొనవచ్చును.

**తెలంగాణ చారిత్రక నాటకం – రచన విశేషాలు:**

1947కి ముందు రాయబడిన చారిత్రక నాటకాలు చాలా భాగం పరోక్షంగా స్వాతంత్ర్యోద్యమానికి చేయూతనివ్వడానికి, దేశభక్తిని ఉద్బోధించడానికి రాయబడ్డాయి. 1947 తరువాత ఈ రకమైన దేశభక్తి ఉద్బోధన అవసరం లేకుండా పోయింది. అందువల్ల ఆ తరువాత వచ్చిన చారిత్రక నాటకాలు ఇతివృత్త నిర్మాణం మీద పాత్ర పోషణ మీద ఎక్కువ దృష్టి కేంద్రీకరించాయి. పౌరాణిక నాటక రచయితలు పరోక్షంగా స్వాతంత్ర్యోద్యమానికి తోడ్పడితే, చారిత్రక వీరుల వీరోచిత గాథలు ప్రజలపై ఎక్కువ ప్రభావం చూపగలవని భావించిన చారిత్రక నాటక కర్తలు ఉద్యమ సందేశాన్ని చారిత్రక నాటకాల ద్వారా చేరవేశారు. మహావీరులైన రాణా ప్రతాపుడు, ఛత్రపతి శివాజీ వంటి వీరుల వీరోచిత గాథలను నాటకాలుగా మలిచారు తెలంగాణా నాటక రచయితలు.

తెలంగాణలో వెలసిన మొదటి చారిత్రక నాటకము 13వ శతాబ్దంలోని విద్యానాథుని ప్రతాపరుద్ర కల్యాణమే. ఆ తరువాత 20వ శతాబ్దం వరకూ లేవనే చెప్పవచ్చు. 1929 'సుజాత' పత్రికలో ప్రచురించబడిన "పాదుకా పట్టాభిషేకము" శేషాద్రి రమణ కవులు వ్రాసినది. ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు జీవిత చరిత్రను "దాస బోధ" అనే గ్రంథంగా వెలయించారు శేషాద్రి రమణ కవులు. పాదుకా పట్టాభిషేకానికి మూలం "దాస బోధ" యే. శివాజీ సతారా ప్రభువుగా వున్న రోజులలో ఆయన గురువైన సమర్థ రామదాసు మాత్రం సన్యాస జీవితమే గడప సాగాడు. ఒక రోజున ఆయన శిష్యులు భిక్షాటన చేస్తూ శివాజీ వద్దకు వెళ్తారు. శివాజీ తన రాజ్యాలన్నింటినీ దానం చేస్తున్నట్లు ఒక చీటీ మీద వ్రాసి వారి జోలెలో వేస్తాడు. సర్వ సంగ పరిత్యాగం చేసిన తమకు రాజ్యమెందుకని చెప్పి, తిరిగి శివాజీనే దానికి అధికారిగా నియమిస్తాడు, సమర్థ

రామదాసు. శివాజీ గురు భక్తిని, సమర్ధ రామదాసు శిష్య వాత్సల్యాన్ని చాటి చెప్పేది ఈ పాదుకా పట్టాభిషేక నాటకము.

బొబ్బిలి సింహం అయిన తాండ్ర పాపా రాయుని వీరగాథను ఇతివృత్తంగా తీసికొని శేషాద్రి రమణ కవులు వ్రాసిన "పాపరాయ నిర్యాణం" నాటకం 1915 లోనే వచ్చింది. అలాగే దాశరధి కృష్ణమాచార్య రచించిన చారిత్రక నాటకం "ఏకశిల" – ఏకశిల నగరం రాజధానిగా సువిశాలమైన ఆంధ్ర సామ్రాజ్యాన్ని పాలించిన కాకతీయులలో రుద్రమదేవి ప్రసిద్ధురాలు. ఆమె భర్త వీరభద్ర దేవుడు. స్త్రీ పరిపాలన నచ్చని వీరభద్ర దేవుడు ఆమె పాలనను ధిక్కరించి యాదవ రాజులతో కలిసి ఓరుగల్లు మీద దండెత్తుతాడు. రుద్రమ దేవి తన పరాక్రమాన్ని ప్రదర్శించి, దేశ కళ్యాణం కోసం తన భర్తను సంహరించటం ఇందులోని ఇతివృత్తం.

దాశరధి రాసిన మరొక నాటకం "మహాబోధి". 1956 లో స్రవంతి పత్రికలో ప్రచురింపబడింది. విశ్వ శాంతి కోసం బుద్ధుడు అనుభవించిన ఆవేదన ఇందులోని ఇతివృత్తం. దాశరధి రచించిన మరొక నాటకము "గోలుకొండ" తాను ప్రేమించిన సామాన్య స్త్రీ శాంతి కోసం రాజ్య త్యాగమే చేసిన సుల్తాన్ అమరగాథ ఇందులోని ఇతివృత్తం. తెలంగాణా ప్రాంతంలో రాయబడక పోయినా ఈ ప్రాంతపు వీరుని చరిత్రను ఇతి వృత్తంగా తీసుకొని పంపన సూర్యనారాయణ గారు రాసిన "సర్దార్ పాపన్న" నాటకం 1988లో వచ్చింది. వరంగల్ జిల్లాలోని ఖిలాషాపురంలో దుర్గాన్ని నిర్మించుకొని, గోలుకొండ నవాబును జయించి ఏడు ఘడియలు గోలుకొండ సింహాసనం అధిష్టించిన సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఇందులోని ఇతివృత్తం.

**పాపరాయ నిర్వాణము:**

ఈ నాటక కర్తలు శేషాద్రి రమణ కవులు. తాండ్ర పాపా రాయుని కథను తెలుగునాట ప్రచారంలో ఉన్నదాన్ని నాటక రూపంగా మలిచి అతని వీరోచిత గుణాన్ని తెలంగాణ పోరాట వీరులకు స్ఫూర్తిగా అందించినట్లుగా అవగతమౌతుంది.

ప్రాంతాలు వేరైనా జాతీయత, జాతి గౌరవం ఎప్పుడూ స్వేచ్ఛనే ఆశ్రయిస్తాయని నాటక కర్తలు తెలియజేశారు. ఈ నాటకం తెలుగుదేశంలో వేదం ద్వారా ప్రఖ్యాతమైనప్పటికీ తెలంగాణ ప్రాంతంలో శేషాద్రి రమణ కవుల పాండిత్య పరిమళంతో ఈ నాటకం అంతే ఖ్యాతిని తన సొంతం చేసుకుంది. ఆరు అంకాల ఈ నాటకంలో దాదాపు తాండ్ర పాపా రాయుని శౌర్య పరాక్రమాలు ఏ విధంగా అతని ప్రాంతాన్ని రక్షించుకోవడానికి ఉపకరించాయో చక్కగా తెలియజేశారు. సంభాషణల్లో చతురత, సమయస్ఫూర్తి, లక్ష్య శుద్ధి వీరి నాటకంలో ప్రస్ఫుటమౌతుంది. వీరుడు మరణించినా వీరత్వం మరణించదని అది తరువాత తరాలకు ఆదర్శమౌతుందనే మార్గదర్శక సూత్రాన్ని ఈ నాటకం ద్వారా రచయితలు తెలిపారు.

అయితే అప్పటికే ప్రాచుర్యంలో ప్రసిద్ధమైన ఈ నాటకాన్నే శేషాద్రి రమణ కవులు రాయడంలో ఓ విశేషం ఉంది. అదేమిటంటే వారు నివసిస్తున్న తెలంగాణ ప్రాంతంలో ఆనాడు అనేక ఉద్యమాలు తమ సంస్థానాలు, భూములను కాపాడుకోవడానికి జరగడం, ఉద్యమాల గడ్డగా తెలంగాణ విఖ్యాతం కావడం, పవిత్ర ఆశయంతో చేస్తున్న ఉద్యమానికి ప్రజల చేయూత అవసరం అనే భావాన్ని ఈ నాటకం ప్రకటిస్తుంది. ప్రజల్లో భయాన్ని పోగొట్టి ఆ స్థానంలో పోరాటానికి మరింత ప్రాముఖ్యతనిస్తూ, ప్రాణత్యాగానికైనా సిద్ధపడే విధంగా వారిని మానసికంగా తయారు చేయడానికి ఈ నాటకం ఏ ప్రాంతంలో జరిగిందైనా వీరులు, వీరత్వం ఎప్పటికీ విశ్వజనీనమే అనే సందేశాన్ని అందించినట్లుగా ఈ నాటకం కనిపిస్తుంది. జానపద సాహిత్యంలో వీరగాథలు ఏ విధంగా ఆ ప్రాంతం లోనే గాక ఇతర ప్రాంతాలలో కూడా ప్రాచుర్యం సాధిస్తామో, అదే విధంగా ఈ నాటకం శేషాద్రి రమణ కవులు పాండిత్య ప్రౌఢికి ఒక మచ్చుతునకగా మిగిలిపోయింది.

**వైశాలినీ పరిణయం:**

దీని నాటక కర్త వానమామలై వరదాచార్యులు. వారు. వీరు పోతన చరిత్ర కావ్యాన్ని రచించి"అభినవ పోతన" బిరుదును పొందిన పండిత శ్రేష్టులు. ఈ నాటకం చరిత్రలో ప్రాముఖ్యం కలిగిన ఒక రాజ వంశానికి చెందిన వీరగాథను కనులకు కట్టినట్లుగా దృశ్యమయం చేస్తూ తీర్చిదిద్దారు.

**హాలికుడు:**

ఈ నాటక కర్త చెలమచర్ల రంగాచార్యులు గారు. ఈ నాటకం అనేక పర్యాయాలు విశ్వవిద్యాలయ కోర్సులకు పాఠ్యాంశంగా ఉండటం విశేషం. ఆ నాటకంలో వీరి కవిత్వ విశేషాలను స్థూలంగా తెలియజేసే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తుంది. వీరు హాలికుడు నాటకంలో పోతన, శ్రీనాధులు

బావా బావామరుదులుగా తెలియజేయడం విశేషంగా కనిపిస్తుంది. రసవత్తరమైన సన్నివేశాలతో పాత్రోచిత సంభాషణలతో సందర్భానికి తగిన విధంగా పద్యాలను ప్రవేశపెట్టి చక్కగా తీర్చిదిద్దారు. ఇది ప్రదర్శించబడిన నాటకంగా చెప్పడం కన్నా అధ్యయన నాటకంగా దీనికి ఎక్కువ ప్రాముఖ్యత ఉంది.

"ఈ నాటకంలో పోతన మనోభావాలు తెలియజేసే సందర్భంలో రచయిత పాండిత్యాన్నే గాక సమయస్ఫూర్తిని కూడా తెలియజేయడం కనబడుతుంది. పోతనను తెలుగు వారికి మరింత దగ్గర చేస్తూ వారి ఆత్మాభిమానానికి ప్రతీకగా నిలిచిన 'బాలరసాలసాల' అనే పద్యం దాని ఆవిర్భావ ఘట్టాన్ని ప్రత్యేకంగా తెలియజేసి సందర్భ శుద్ధిని పాటించడం విశేషంగా చెప్పుకోవచ్చు". ఈ నాటకంలో పద్యాలు భాగవతంలోనివి కొన్ని, కొన్ని రచయిత ప్రవేశపెట్టినవి అవడం నాటకానికి సజీవత్వాన్ని కలిగించినట్లు అనిపిస్తుంది.

దేశీ నాటకాలకు ఆద్యుడు పాల్కురి సోమనాధుడు. ఇతడు 'సిరియాల చరిత్ర' నాటకాన్ని ఆ నాడు ప్రదర్శించినట్లు బసవ పురాణంలో "సాంగ – భాషాంగ – క్రియాంగ పటు నాటకంబుల" అని చెప్పిన దాన్ని బట్టి తెలుగులో నాటక ప్రదర్శన ఆ నాటికే జరిగిందని గమనించవచ్చు. "ఆంధ్ర సామ్రాజ్యం' అనే నాటకం అసంపూర్తిగా ఉండిపోయిన నాటకము. అచ్చుకాలేదు. నాటకంలోని భాష, శైలిని బట్టి వారు దీన్ని 1939 – 40 ప్రాంతాల్లో వ్రాసి ఉంటారనుకోవడానికి వీలుంది. ప్రతాపరుద్రుని కాలంలో కాకతీయ సామ్రాజ్యం ఉన్నత స్థితికి చేరుకొన్నది. సామ్రాజ్యం విస్తరించింది. ఇంచుమించు తెలుగు దేశమంతా ఏక ఛత్రాధిపత్యం కిందికి వచ్చింది. తురుష్కులు ఓరుగల్లుపై దండెత్తడం అంటే ఆంధ్ర సామ్రాజ్యంపై దండయాత్ర చేయడమే అవుతుంది. అలాగే ఓరుగల్లును కాపాడుకోవడం అంటే ఆంధ్ర సామ్రాజ్యాన్ని, ఆంధ్రుల స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడమే అవుతుంది.

సురవరం ప్రతాపరెడ్డి "ఉచ్ఛల విషాదము" నాటకాన్ని 1921 వ సంవత్సరం లో బి.ఏ చదువుతుండగా ఒక నాటక కంపెనీ పోటీ కొరకు రాసారు. ఇది అయిదు అంకాల నాటకము. దీనిని తన పిన తండ్రైన రామకృష్ణారెడ్డికి అంకితమిచ్చాడు. దీన్ని 1933 సంవత్సరం లో గోల్కొండ పత్రిక ముద్రణాలయంలో ముద్రించారు. ఇది గ్రాంథిక భాషలో రాయబడిన నాటకము. సురవరం ప్రతాప రెడ్డి ఉచ్ఛల విషాద నాటకాన్ని కల్హణుడిచేత సంస్కృతంలో రాయబడిన 'రాజతరంగిణి' అనే చారిత్రక గ్రంధం ఆధారంగా వ్రాశారు 'రాజ తరంగిణి' లోని ఉచ్ఛలుని కథను సూక్ష్మంగా గ్రహించి నాటకంగా రూపొందించారు. ఈ నాటకం లో నాయకుడు ఉచ్ఛలుడు ఇతని చుట్టూ నాటకం మొత్తం నడుస్తుంది. ఉచ్ఛలుడు అధికారానికి వచ్చిన వెంటనే ప్రతికూలురైన వారిని తుదముట్టిస్తాడు. లంచగొండులైన ఉద్యోగులను తొలగిస్తాడు. అంతేకాకుండా భూస్వాముల పై అనేక ఆంక్షలు విధిస్తాడు. మరి కొందరు దేశద్రోహులుగా మారుతారు.

**ముగింపు:**

ఈ విధంగా తొలగించబడిన ఉద్యోగులు, భూస్వాములు మరికొంతమంది ద్రోహులు కలిసి ఉచ్ఛలుని చంపుతారు. చివరకు ఉచ్ఛలుని తమ్ముడైన సుస్సలుడు ఆ ద్రోహులందరినీ హతమారుస్తాడు. నాటకంలో పాత్రలన్నీ చనిపోతాయి. ఈ నాటకంలో నాయక స్థానంలో ఉన్న ఉచ్ఛలుడు మరణించటం చేత నాటకం విషాదాంతంగా మారుతుంది. ఇది ఔచితీమంతంగా ఉంది. ఈ విధంగా తెలంగాణ ప్రాంతంలో వచ్చిన చారిత్రక నాటకాలను పరిశీలించవచ్చు

**ఆధార గ్రంధాలు:**

1. చారిత్రక నాటకం – కె.ఎల్. నరసింహారావు గారి నాటకాలు – ఓ పరిశీలన – డా. ఎ. రాజేశ్వరి, గురుకృప ప్రచురణ, హైదరాబాద్, 1999, పుట. 116.

2. నవలాశిల్పం – వల్లంపాటి వెంకట సుబ్బయ్య. విశాలాంధ్ర ప్రచురణ – 1989, పుట. 113, 114.

3. పాతిక సంవత్సరాల తెలుగు నాటకం (వ్యాసం) – శ్రీ మొదలి నాగభూషణ శర్మ మహతి – తెలుగు అకాడమి – హైదరాబాదు 2008 పుట: 230.

4. శేషాద్రి రమణ కవుల చారిత్రక పౌరాణిక నాటకాలు – పరిశీలన – కంటే సహదేవుడు. ఎం.ఫిల్ సిద్ధాంతవ్యాసం – కాకతీయ విశ్వవిద్యాలయం – వరంగల్లు – 1999 పుట:9

5. శేషాద్రి రమణ కవులు (జీవితం – సాహిత్యం) డా.ఐ. కిషన్ రావు. పుట. 211 జూన్ 1994.


6. సాహితీ గవాక్షం – పుట : 81 డా. టి. శ్రీరంగ స్వామి. శ్రీ లేఖ సాహితి – వరంగల్.

**రచయిత: తెలుగు విభాగం, కెయు** T

# దళిత స్త్రీవాద అస్తిత్వ చైతన్య వికాసానికి మిళింద కథల చేర్పు

ఇమ్మిడి మహేందర్

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో కొన్ని సమూహాల ప్రాతినిధ్యం తక్కువ. శాస్త్ర సాంకేతిక రంగాలు ఇంతగా అభివృద్ధి చెందిన ఈ దశలో కూడా సాహిత్యంలోకి రాని జీవితాలు ఎన్నో ఉన్నాయి. కుల, వర్గ సమాజంలో స్త్రీలు నిత్యం అణచి వేయ బడతారు. అణచి వేయబడ్డ సమూహాల్లో కూడా మంద్రస్థాయిలో విభేదాలు చోటు చేసుకుంటాయి. ఆ విధంగా సామాజిక, రాజకీయ, సాహిత్యాది రంగాలలో ఉన్న పురుషస్వామ్యానికి వ్యతిరేకంగా స్త్రీవాదం ముందుకు వచ్చింది. వివక్షతలకు వ్యతిరేకంగా ఏర్పడిన సమూహంలో కూడా కొన్ని సమూహాలకు, వాటి అస్తిత్వాలకు, ఆలోచనలకు ప్రాతినిధ్యం దక్కాల్సిన స్థాయిలో దక్కలేదనే స్పృహతో దళిత స్త్రీవాదం ఏర్పడింది. ఇలా ఏర్పడిన దళిత స్త్రీవాద అస్తిత్వ చైతన్యానికి చాలా మంది దళిత రచయిత్రులు కృషి చేశారు. ఈ క్రమంలో దళిత స్త్రీవాదానికి, దాని అస్తిత్వ చైతన్య వికాసానికి యువ కథా రచయిత్రి ఎండ్లూరి మానస రాసిన మిళింద కథలు ఎలా ఉపయోగపడ్డాయో, మిళింద కథలు వస్తు, శిల్పాల్లో ఎటువంటి వైవిధ్యాన్ని సాధించాయో చెప్పడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం.




భారతదేశ సామాజిక నిర్మాణం చాలా సంక్లిష్టమైంది. ఏ దేశ ప్రగతి అయినా ఆ దేశంలోని సామాజికార్థిక, రాజకీయ రంగాల్లో కల్పించే అవకాశాలపై ఆధారపడి ఉంటుంది. కానీ, మన దేశంలోని కుల వ్యవస్థ పుట్టుక ఆధారంగా కొందరికి ఉన్నత అవకాశాలు, మరికొందరికి తక్కువ అవకాశాలు కల్పించింది. ఇటువంటి వివక్షా పూరితమైన పరిస్థితులపై ప్రాచీన కాలం నుండి నేటి వరకు అనేక మంది పోరాడుతూనే ఉన్నారు. మార్పు కోసం పరితపిస్తూనే ఉన్నారు. ఒక సమాజం వివక్షత రహితంగా, సమసమాజంగా రూపొందడానికి అనేక అడ్డంకులు ఉంటాయి. భారతదేశంలో కూడా ఇట్లాంటి ప్రత్యేక పరిస్థితి ఉంది. ప్రపంచమంతా వర్ణ, వర్గ, లింగపరమైన వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడితే, ఇక్కడ వర్ణ, వర్గ, లింగ వివక్షతలతో పాటు, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉంటుంది. మరికొంత నిర్ధిష్టతల్లోకి వెళితే ఇక్కడి కులానికి, వర్గానికి మధ్య అంతర్గత సంబంధాలు ఉన్నాయి. కులం, వర్గం, లింగం పరస్పర ప్రభావాన్ని కలిగి వుంటాయి.

భారతదేశంలో కులం ఆధారంగా స్త్రీ వివక్షతలో హెచ్చుతగ్గులు ఉంటాయి. పురుషస్వామ్యం అన్ని వేళల ఒకటిగా ఉండదు. ఇక్కడి పురుషస్వామ్యానికి కులస్వామ్యం కూడా ఒక బలమైన కుదురు. ఆధిపత్య కులాల స్త్రీల సమస్యలకు, అణచి వేయబడుతున్న కులాల స్త్రీ సమస్యలకు తేడాలు ఉన్నాయి. ఈ విధంగా తెలుగు సాహిత్యంలో, అందులోను ప్రధాన స్రవంతి స్త్రీవాదంలో తమ సమస్యల చిత్రణ జరగడం లేదని దళిత స్త్రీలు కొంతమంది విమర్శ పెట్టారు. వారు దళిత స్త్రీవాదాన్ని నిర్మిస్తున్నట్లుగా ప్రకటించి రచనలు చేశారు. పరిశోధనలు చేశారు. విదేశీ సాహిత్యంలోని ఫెమినిజంలో వచ్చిన బ్లాక్ ఫెమినిజం మాదిరిగా, స్త్రీ వాదంలో దళిత స్త్రీవాదం ధిక్కార స్వరంగా ముందుకు వచ్చిందని ప్రతిపాదించారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రాంతం నుండి జూపాక సుభద్ర, గోగు శ్యామల,

జాజుల గౌరి ఆంధ్రప్రదేశ్ ప్రాంతం నుండి ఎం. ఎం. వినోదిని, చల్లాపిళ్ల స్వరూప రాణి వంటి వారు దళిత స్త్రీవాద చైతన్యంలో ముందుకు నడుస్తున్నారు. వీరికి తోడుగా సరికొత్త వస్తువుతో, శిల్పంతో కథా సాహిత్యంలోకి దూసుకువచ్చిన రచయిత్రి ఎండ్లూరి మానస. ఈవిడ రాసిన కథలన్నింటినీ "మిళింద" (2018) పేరుతో సంపుటిగా ప్రచురించారు. ఈ గ్రంథానికి 2020 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ, యువ పురస్కారాన్ని అందించింది.

సామాజిక పెనుగులాటలు సాహిత్య వస్తువుగా మారటం ఆధునిక కాలపు చైతన్యం. ప్రాచీన కాలం నాటి వస్తువుకు ఆనాటి సామాజిక, రాజకీయావసరాలు పునాది అయితే, ఈనాటి వస్తువుకు సామాజిక చైతన్యం పునాదిగా పని చేస్తుంది. ఆధునిక కాలంలో కూడా మారని, స్త్రీ అణచివేత రూపాలను రచయిత్రి అందుకోగలిగింది. వాటిని కథా వస్తువుగా మార్చడంలోనే రచయిత్రి విజయం ఉంది. సాధారణ రచయితలు చూడలేని సాహిత్య వస్తువును ఎండ్లూరి మానస చూడగలిగింది. దళిత స్త్రీగా, అందులోని మైనారిటీ మతం అయిన క్రిస్టియన్ స్త్రీగా లోతైన వివక్షాపూరిత విషయాలను సమన్వయం చేసుకోగలిగింది. ఈ కథల్లో ప్రధానంగా రూపం మార్చుకున్న కుల వివక్షత తాలూకా విషయాలు తెలుస్తాయి. అలాగే మెజారిటీ మతం మైనారిటీ మతాలపై అనధికారికంగా చూపుతున్న వివక్షతను, ఆధిపత్యాన్ని పట్టి చూపుతాయి.

స్త్రీలపై అనేక వివక్షత రూపాలు పనిచేస్తాయి. పేదరికం, ఆడతనం, గృహిణి జీవితం ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో. అలాంటి జీవితమే "అవిటి పెనిమిటి" కథలో కన్పిస్తుంది. దుర్గ, పద్మావతి ఇద్దరూ స్త్రీలే. ఇందులో ఒకరు దళిత స్త్రీకాగా, మరొకరు ఆధిపత్య కులానికి సంబంధించిన స్త్రీ. ఇద్దరికి భర్తలు ఉన్నారు. ఒకరు శారీరక సవాళ్లను ఎదుర్కొనే వారు, మరొకరు ఉద్యోగం చేసి, డబ్బు సంపాదించే వారు. ఇద్దరి జీవితంలోకి మగవాళ్లు వారి ప్రమేయం లేకుండా వచ్చినారే. ఈ సందర్భాలు స్త్రీల విషయంలోనే ఎక్కువగా ఉంటాయి. ఈ కథ స్త్రీని అర్థం చేసుకోవడంలో ఉన్న పార్శ్వాలను పట్టిస్తుంది. అలాగే అన్ని సకల సౌకర్యాలు, సుఖవంతమైన ఆర్థిక జీవితం కన్నా, అర్థం చేసుకునే మనసులోనే నిజమైన ప్రేమ దాగి ఉంటుందని చూపించే తత్వాన్ని బోధపడేట్లుగా కథను చిత్రించింది రచయిత్రి. చేసే పనుల్లో కూడా కులాన్ని బట్టి విభజన ఉండే విషయాన్ని రచయిత్రి అందుకోగలిగింది. వివక్షత కళ్లముందర అనుభవంలోకి వచ్చినప్పుడు, దాని ప్రతిఘటనను కూడా వెనువెంటనే పాత్ర ద్వారా వ్యక్తం చేయడం రచనా పద్ధతిలో నూతనత్వాన్ని తెలియజేస్తుంది. ఈ కథలోని దుర్గ పాత్రను ఆత్మాభిమానం కలిగిన స్త్రీగా చిత్రించింది. ఈ పాత్ర సందర్భం వచ్చినప్పుడు "దళిత స్త్రీలు కడగడానికి, తూడ్చడానికి మాత్రమే పనికి వస్తాము కానీ, మా చేతితో చేసినదాన్ని తినడానికి మీకు కులం అడ్డువస్తుందని, అట్లాంటి చోట పనిచేయలేనని" తెగించి చెప్పే లక్షణాన్ని అవిటి పెనిమిటి కథలో చూస్తాం.

బొట్టు అనేది సాంస్కృతిక వ్యక్తీకరణ రూపమేనా? లేదా వివక్షత చూపించడానికి కూడా అదొక మార్గంగా ఉంటుందా అనే ప్రశ్నలు వేసుకొని చర్చించడానికి ఈ కథలు అవకాశం ఇస్తాయి. ఇందులో బొట్టుని కేంద్రంగా చేసుకొని బొట్టు, బొట్టు కుక్క, బొట్టు భోజనాలు, బొట్టు గుర్తు, దొంగ బొట్టు వంటి ఐదు కథలు రాసింది. వస్తువు ఒకటే అయినా, వాటిని వ్యక్తపరచడంలో నూతనత్వం సాధించింది. మతాలు సాంస్కృతిక జీవనాన్ని శాసిస్తాయి. నిత్య సామాజిక జీవితంలో మనుషుల రూపంలో మతం, కులం, సంస్కృతి కలగాపులగం అయి, సంచరిస్తుంటాయి. వాటి చుట్టూ అనేక అవసరాలు, దక్కించుకోవాల్సిన అవకాశాలు ముడిపడి ఉంటాయి. ఈ కోణం నుంచి చూసినప్పుడు దొంగ బొట్టు కథ మనల్ని కలచివేస్తుంది. ఆలోచింపజేస్తుంది.

LGBTQIH (Lesbian, Gay, By Sexual, Transe Gender and Queer) సమూహాలు, భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో అనేక అవమానాలు ఎదుర్కొంటున్నారు. వీరి గురించిన సాహిత్యం తెలుగులో చాలా తక్కువ. వీరి అనుభవాలకు జీవం ఇస్తూ, వారిలో ఉండే మానవీయత, ప్రేమ, ఆకర్షణ, హింస తదితర విషయాలను "కరెక్టివ్ రేప్" అనే కథలో చర్చించింది. స్పందన, శిరీషల ప్రేమ విషయం. ఇద్దరు అమ్మాయిల ప్రేమ, వాటిని అర్థం చేసుకునే చైతన్యం లేని కుటుంబం, సమాజాన్ని ఇందులో గమనించవచ్చు. అలాగే ప్రతి లైంగిక, మానసిక సమస్యలకు శారీరక కలయికలే మందుగా పనిచేస్తాయనే అశాస్త్రీయ ఆలోచనలు ఇందులో కన్పిస్తాయి. వివాహేతర సంబంధాలకు శరీరాలే తప్ప, వారి ఆలోచనలు, ఆశయాలు, బాధ్యతలు ప్రధానం కావని ఈ కథ నిరూపిస్తుంది. అలాగే వేశ్యా గృహాల్లో

అక్రమంగా నిర్బంధించబడ్డ ఆడపిల్లలు, వారి కుటుంబాలు, వారి ఆర్థిక పరిస్థితిని కూతురుని అందులో ఉండి డబ్బులు పంపియ్యమని కోరెంత స్థితిని తీసుకొచ్చిన విధానాన్ని హృద్యంగా చిత్రించింది. పేదరికంతో వేశ్యగా మారాల్సిన స్థితిలో కూడా తల్లిపై ఉన్న నమ్మకాన్ని, సభ్య సమాజంలో వేశ్య ఊరికి తిరిగి వచ్చి తన కాళ్లపై తాను నడుస్తానని చెప్పినా, తల్లే సభ్య సమాజానికి లొంగి శరీరాన్ని అమ్ముకొని డబ్బు మాత్రమే పంపియ్యమని చెప్పి, నువ్వు రావాల్సిన అవసరం లేదని చెప్పడం వంటి స్థితిని "అమ్మకో లేఖ" అనే కథలో మానస రూపుకట్టింది.

పుట్టబోయేది ఆడబిడ్డా, మగ బిడ్డా అని తేల్చుకునే సమాజం కూడా నిర్దాక్షిణ్యంగా మనదే. రెండవ సారి కూడా ఆడబిడ్డ పుట్టిందని చెప్పుకోలేని తండ్రులు చాలా మంది ఉంటారు. అలాగే ఇద్దరిని సమంగా చూసుకునే మనస్తత్వం కలిగినవారు కూడా ఉంటారు. అలాగని సమస్య లేదని చెప్పలేం. దానికి భిన్నమైన రూపాలు ఉంటాయి. అందులోని ఒక రూపమే అబద్ధం కథ. ఇలా చెప్పుకుంటూ పోతే 22 కథల్లో 16 కథల్లో భిన్నమైన వస్తువు ఉంది. ఈ వస్తువు అన్ని కొందరు కవయిత్రులు ఇప్పటికే రాసినప్పటికీ, ఈ కథల్లో వస్తువును దర్శించిన విధానం భిన్నమైంది. దళిత క్రిస్టియన్ స్త్రీగా చూడగలిగిన వస్తువులు ఇందులో ప్రత్యేకం. దళిత స్త్రీలలో కూడా గ్రామీణ స్త్రీలకు, పట్టణ స్త్రీలకు, హిందూ మతంలో ఉన్న స్త్రీలకు, క్రిస్టియన్ మతాన్ని ఆచరిస్తున్న స్త్రీలకు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. వాటన్నింటిని ఆలోచనలకు వదిలేస్తూ వస్తు వైవిధ్యాన్ని పాటిస్తూ ఈ కథా సంపుటి దళిత స్త్రీ అస్తిత్వ చైతన్యానికి తోడ్పాటునందించింది. కొత్త ఆలోచనలు రేకెత్తించింది.

వస్తువు వ్యక్తమైన విధానమే శిల్పం. ఎంత గొప్ప వస్తువు అయినా, సాహిత్య గౌరవం పొందాలంటే దానిలో శిల్పం ప్రధానం. కేవలం చెప్పే విధానమే ఉంటే సరిపోదు. దానికి తగ్గ వస్తువు ఉండాలి. సాహిత్యానికి వస్తు, శిల్పాలు రెండు కన్నులు. రెండు ఒక రూపాన్ని అందించగలిగినప్పుడే అది సాహిత్యంగా మనగలుగుతుంది. రచయిత్రి మానస చదువు, పుట్టి పెరిగిన వాతావరణం తన రచనా పద్ధతిలో కనబడుతుంది. ఒక రోజు కథలో భోజనాల దగ్గర ప్రస్తావించిన పేర్లన్ని ఆంధ్ర ప్రాంతం వంటకాలు. రచయిత్రి పుట్టి పెరిగిన వాతావరణం అక్కడిది కావడం కూడా ఒక కారణం. తర్వాత క్రిస్టియన్ పదజాలం కూడా కన్పిస్తుంది. చర్చ్ సంబంధిత భాష ప్రత్యేకంగా గుర్తించగలుగుతాము.

భాషను ఉపయోగించుకోవడంలో రచయిత్రి పరిణతి సాధించింది. కథలకు శీర్షికను నిర్ణయించడంలో కూడా రచయిత్రి వైవిధ్యాన్ని సాధించింది. "బొట్టు కుక్క" అనే శీర్షికను, బొచ్చు కుక్క అని పలికే విధానానికి దగ్గరగా ఉంది. అలాగే ఇందులోని పాత్ర చిత్రణ, కథ కథనం మారుతున్న యువత ఆలోచనలను పట్టిస్తాయి. సున్నితమైన సందర్భాలను సైతం మనసుకు హత్తుకునేలా, పాఠకుణ్ణి సైతం ఆలోచించేలా చేసిన పద్ధతి, రచనా వైవిధ్యాన్ని యువ రచయితలు అధ్యయనం చేయదగ్గది. దళిత క్రిస్టియన్ స్త్రీ రచయిత్రులు చాలా తక్కువ. వారి శైలి భిన్నంగా, జీవిస్తున్న సమాజానికి దగ్గరగా నిర్మాణమై ఉంటుంది. ఈ ప్రత్యేకతను మిళింద కథలు సాధించాయి.

ఈ కథల్లో రచయిత్రి సమాజాన్ని మార్చాలనే తాపత్రయ పడింది. రచయిత్రి చెప్పాలనుకున్న విషయాన్ని పాత్రలు వ్యాఖ్యానం చేయకుండా నేరుగా రచయిత్రే వ్యాఖ్యానం చేసినట్లు ఉంది. పాత్రల ద్వారా సమాజానికి విషయాన్ని చొప్పించాలి. అలాగే సమాజం లేదా వ్యక్తులు మార్పు వ్యక్తిగత, సామాజిక అవసరంగా మారినప్పుడే వారు మారుతారు. దీన్ని రచయిత్రి గుర్తించాలి. అలాగే పాఠకుని కష్టాన్ని కూడా రచయిత్రే పడింది. పాఠకుడు చదివి, విశ్లేషించుకోవాల్సిన విషయాలను నేరుగా రచయిత్రే విశ్లేషించారు. సాహిత్యం ఆపాత మధురంగా ఉండాలని ఆలంకారికుల ఆలోచన. అంటే ఆలోచించినా కొద్ది లోతైన ఆలోచనలు, ఆనందం వంటివి దక్కాలని సూచన. కానీ, పాఠకున్ని ఆలోచించనీయకుండా అన్ని విషయాలు రచయిత్రే చెప్పినట్లు అనిపించింది.

దళిత నేపథ్యంగా అందులోను, స్త్రీల నేపథ్యంగా కథా సాహిత్యం విస్తృతమవుతున్న దశ ఇది. అస్తిత్వోద్యమాలు నిర్మాణమై, అనేక మలుపులు తిరుగుతున్న దశలో మనం ఉన్నాం. అస్తిత్వ ఉద్యమాల ఆలోచనలు అంతగా ప్రసరించని కొన్ని సమూహాలైన దళిత క్రిస్టియన్ స్త్రీ సమూహం నుంచి వచ్చిన ఈ కథలు దళిత స్త్రీ అస్తిత్వ చైతన్య వికాసానికి తోడ్పాటునందించాయి. కొత్త చూపును అందించాయి. కట్టు, బొట్టు, భాష, చదువు, LGBTQIH సమూహాల ఆలోచనలు, వారి మధ్య ఉండే ఆకర్షణలు వంటి అనేక విషయాల్లో ఈ కథలు నూతన కోణాన్ని ఆవిష్కరించాయి.

★ రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, సైఫాబాద్ కాలేజ్

# అపూర్వ తెలంగాణ సాంస్కృతిక పదకోశం

డా॥డి.ఉదయ్‌భాను

అస్తిత్వాలు అన్యాక్రాంతం అవుతున్న సందర్భంలో 'సంస్కృతి' ప్రశ్న అనివార్య రేఖగా నిలుస్తుంది. మనిషి కనుమరుగు కావడం కంటే మనుగడ పరాధీనం కావడం ఏమిటనేది ఆ ప్రశ్నలో ఉన్న సాంద్రత. ద్రవీభూతంగా ఉండే భావజాలం భౌతిక రూపాలకంటే భావనాలోలకాన్నే ఎక్కువ ఆశ్రయిస్తుంది. అనివార్యంగానే పరాస్తమవుతున్న ఉనికిని గురించిన వేదన విభిన్న రూపాల్లో వ్యక్తమవుతుంది. ప్రాకృతిక సత్యాలను ఛేదిస్తూ నాగరికతకు ఎరువేసిన శ్రామికులు పాదును వెతుక్కోవడం కోసం వైవిధ్యమైన కృషికి తెగబడుతారు. రూపంలో "తెలంగాణ సాంస్కృతిక పదకోశం" పేరుతో డా॥ఎస్.చంద్రయ్య పెనుగులాటగా వెలువడిన పుస్తకం తాలూకు సారం చిరునామా తనకు ఉనికిని నెలకొల్పిన ఆవరణం మీద ఎనలేని ప్రేమాస్పద హృదయమే.

భాషానిర్మాణాలను అధ్యయనం చేయడం భాషావేత్తలందరూ చేస్తారు. కానీ వ్యవహర్తలు తమ వ్యక్తీకరణ సాధనాన్ని నిర్మించుకోవడంలోని భావాల లోతుల్లో దాచుకున్న సంవేదనలేమిటీ, బతుక్కూ భాషకూ ఉన్న అవిభాజ్యమైన వ్యవహారాలేమిటీ, బతుకుతోపాటు భాషలోనూ చోటుచేసుకుంటున్న మార్పులకు మౌలిక పునాది ఏమిటీ అని చంద్రయ్య ఆలోచించారు. ఆ క్రమంలోనే తనను తానుగా నిలిపిన పలుకుల నైసర్గికతను ముద్రగా నిలపాలనుకోవడమే ఈ సామాజిక భాషాశాస్త్రవేత్త చేసిన అవిరళ కృషి.

నిఘంటు నిర్మాణ నేపథ్యాలు రాజకీయాలకు భిన్నమైనవని ఎవరు చెప్పినా అబద్ధం. ఇది అసంబద్ధ వాదన అని చేసే ఏ ప్రయత్నమైనా కుతర్కమే అవుతుందని ఒప్పుకోవాల్సిన నేటినిజం. ఇజాలు లేవనెత్తిన ప్రశ్నలు కూడా నిజాలను అబద్ధాలను చేయడాలకూ, అబద్ధాలను నిజాలను చేయడాలకూ మధ్య అదృశ్య లక్ష్యాలున్నాయనే! యాస్క, కశ్యపాది ప్రవీణులు రూపొందించిన నిరుక్తాల దగ్గరి నుండి ఆధునిక నిఘంటువుల దాకా జరిపిన కృషి అనన్య సామాన్యమైనదని ఇప్పటిదాకా ప్రచలితమైన ప్రవచనాలు మేథో ఆవరణాన్ని ఆసాంతం ఆక్రమించాయి. అయినప్పటికీ వాటివాటి లక్ష్యాలకు ప్రజా ప్రాయోజితమే ప్రధాన సూత్రం కావాలనే ప్రమాణమే ముందుంటుంది.

తెలుగులో ఇప్పటిదాకా అనేకానేక నిఘంటు నిర్మాణ ప్రయత్నాలు జరిగాయి. కానీ, సాంస్కృతిక పదకోశమేదీ నిర్మాణం కాలేదన్నది ఎంత సత్యమో, దానికోసం పూనుకోకపోవడానికి కారణాలేమిటన్నది కూడా యాదృచ్ఛికం పేరుమీద దాటవేయలేని వాస్తవం. ఇది ఏమాత్రమూ అసందర్భ ప్రేలాపనో, నిరాధార ఆరోపణో కాదు. కాలనాలిక మీద ఏ ప్రశ్నకైనా మౌలికమైన పునాది లేకుంటే అది కేవలం గాలివాటం కాగలదు. కానీ డా॥ ఎస్.చంద్రయ్య చేసిన ఈ అపూర్వ కృషి, పూర్వపులోటును పూడ్చే పూనిక అన్నది ఒప్పుకోవాల్సిన వాస్తవం. ఎందుకంటే ఇది వర్తమానం.

ఈ పుస్తకం కేవలం నిఘంటువు కాదు. తెలుగు ప్రజల నిసర్గ సంస్కృతికి వ్యక్తీకరణగా నిలిచిన మట్టిభాష జీవనాడి. భావజాలపరంగా దురాక్రమణకు గురైన పండుగలూ జాతరల మూలాల్ని పట్టించుకోకుండా, అవి హిందూత్వ ప్రతీకలే అని తీర్మానించడం రూపవాదులు చేసే శుద్ధ జడతర్కం. విడిపోయిన దు:ఖభరిత జీవితాలను ఏకోన్ముకం చేసే వేడుకలు వాటి ప్రాథమిక రూపం. కాలక్రమేణా మూలవాసీ వేడుకను ఆధిపత్య భావజాలం ఆక్రమించింది. కానీ 'వేడుక' ఏ రంగూ రుచీ అంటని మానవానంద కూడలి. చరిత్ర నిర్మాణానికి సాహిత్య, పురావస్తు ఆకరాలు ఎంత కీలకమో ఇదీ అంతే అవసరమని, తన తోడ్పాటునందించే పరంపర. ఈ నిఘంటువులో చోటుచేసుకున్న పదాలను గమనిస్తే, తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతి నిర్మాణంలో అవి ఎంత కీలకమైనవో తెలుస్తుంది. ఉదాహరణకు 'అటువ' అనే పదం చూడొచ్చు. ఉత్తర తెలంగాణలోని అటవీప్రాంతంలో కొండరెడ్లు జరుపుకునే భూమి పండుగ అనే ఉమ్మడి వేడుక కోసం, సకల జనుల భాగస్వామ్యం కోసం డబ్బులు సేకరించుకునే పనిని అటువ అంటారు. ఈ పదం గణసమాజ సామూహికత్వానికీ, ఐక్యతకూ ఆనవాలు. అలాగే 'ఆకిపేన్' అనే ఆదివాసీ ఇలవేల్పు పేరు. గోండుల భాషలో 'ఆకి' అంటే ఆకు అనీ, 'పేన్' అంటే దేవుడు లేదా

దేవత అని అర్థం. శ్రావణమాసంలో తొలకరి వర్షాలు పడిన తర్వాత ఆ సమూహం ఉమ్మడిగా కృతజ్ఞతాభావంతో ఆ ఇలవేల్పును పూజిస్తూ పండుగ చేసుకుంటారు. మానవజాతి చరిత్రలో ఆహార సేకరణ దశ నుండి ఆహార ఉత్పత్తి దశకు ఎదగడం మౌలికమైన మార్పు. ఆ దశలో ప్రకృతినే దైవంగా భావించి శ్రమజీవులు చేసుకునే వేడుక ఏ ప్రాచీన నాగరికతలో చూసినా కనిపిస్తుంది.

సంస్కృతి ఏకశిలా సదృశ్యం కాదు. అన్ని సంస్కృతులకు మల్లే తెలంగాణదీ వైవిధ్యభరితమైన సంస్కృతి. తెలంగాణలో మత వైవిధ్యమెంత ఉన్నదో సామరస్యమూ అంతే ఉన్నది. గ్రామాల్లో దర్గాలకు హిందూ భక్తులు ఉంటారు. ఇస్లాం పీర్లపండుగ రోజు హిందూ ముస్లింలు కలిసే ధూలాడుతారు. ఆ ఆటలో హిందువులే 'ఆశన్న ఊశన్న' పాటలు పాడతారు. వాస్తవానికి ఆశన్న ఊశన్న అంటే మహమ్మద్ ప్రవక్త శిష్యులైన ఇమామ్ హసన్, ఇమామ్ హుసైన్. వీరిరువురూ ప్రజాస్వామ్య భావాలకోసం వీరోచితంగా పోరాడిన అమరులు, త్యాగధనులు. వారి ఉదాత్త హృదయానికి మతపరమైన అడ్డుగోడలు విరిగిపోయాయి. అందుకే ముస్లింలతోపాటు హిందువులకూ వారు ఆరాధ్యులయ్యారు. హిందువులు పాడే అలావు పాటల్లో గౌరవింపబడుతున్నారు. ఇట్లా తెలంగాణ హిందూ ముస్లింల అవిభాజ్య కలయికే భాషలో ఆదాన ప్రదానాలకు హేతువయ్యింది. తెలుగులోకి చేరిన సాంస్కృతికపరమైన అన్యదేశ్యాలు, దేశ్యాలంత సహజత్వాన్ని సంతరించుకున్నాయి. అలావు, పీర్లు, ఇఫ్తార్ మొదలైనవాటికి కూడా ఈ నిఘంటువులో చోటున్నది. తెలంగాణ అంటే తెలుగు హిందువులదే అనే సంకుచిత్వం లేకపోవడం ఈ నిఘంటు నిర్మాణకర్త హృదయవైశాల్యం. పరిశోధనా వరణంలో దృగ్విషయాలకంటే, వాటి నిర్ణేతలుగా వ్యవహరించే మూలకాలకే ప్రాధాన్యం ఇవ్వడం, సూత్రీకరణలకు అసలైన బలం.

ఈ నిఘంటువు తెలంగాణ ప్రాదేశిక భాషకు సంబంధించినది. తెలంగాణ భాషాసాహిత్యాల గురించిన చర్చల్లో ఎక్కువగా ప్రధాన స్రవంతి ప్రజల గురించినవాటికే ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. కానీ తెలంగాణ ప్రాంతానికి ఆదిమతల్లిగా విలసిల్లాల్సిన అడవి ప్రజల జీవనానికి సంబంధించిన సంస్కృతీ, సాంప్రదాయాలు, ఆచారాలకు చెందిన భాషకు కూడా పెద్దపీట వేయడం గమనార్హమే కాదు, ఇప్పటిదాకా మనం విస్మరిస్తూ వస్తున్న సమూహాలను పట్టించుకోవల్సిన బాధ్యతను గుర్తు చేయడం కూడా.

తెలంగాణ సాంస్కృతిక పదకోశం పేరుతో వెలువడిన ఈ పుస్తకంలోని పదాలను స్థూలంగా గమనిస్తే, ఈ ప్రాంత ప్రజల చరిత్ర నిర్మాణానికి అవి ఎంతగా దోహదపడతాయో అర్థం అవుతుంది. ప్రపంచంలోని ఏ ప్రాచీన నాగరికతను లోతుగా గమనించినా, వాటిల్లో గణసమాజాల తాలూకు సామూహిక ప్రయోజనం, సామూహిక కృషి, ఐక్య జీవనం కనిపిస్తాయి. తెలంగాణ ప్రాచీన సమాజంలో గణసమాజపు వెలుగులు ఎంతగా దేదీప్యమానంగా వెలిగాయో, వర్తమాన కాలంలో ఖండఖండాలుగా వ్యవచ్ఛిన్నమైన మానవ సమూహాలు చరిత్ర నుండి ఏ ఆదర్శాలను స్వీకరించాలో కూడా ఈ పుస్తకం మనకు బోధిస్తుంది. మనిషి సంఘజీవి అనీ, పరస్పర సహకారం లేనిదే అసలు మానవ ఉనికే లేదనీ, ఉమ్మడితనంలో, సామూహికత్వం కోసం జీవించడంలో ఎంత గొప్పదనం ఉందో తెలియజేస్తుంది.

మనిషీ, చరిత్ర, రాజకీయం, దర్శనం, పాతదనం, కొత్తదనం అనేవి ఎవరు అడ్డొచ్చి ఎదురుగా నిలబడినా నిరవధికంగా సాగేవే. పదాలనూ, పదాలను పలికే పెదాలనూ, పెదాలను పలికించిన గుండె లయనూ పట్టుకోవడం, నిలబెట్టుకోవడం, చరిత్ర నొసటి మీద పచ్చబొట్టు పొడవడం డా॥ఎస్. చంద్రయ్య లక్ష్యించిన కృషి. ఇవన్నీ పుస్తకం గురించిన కొన్ని మాటలే..

ఈ 'తెలంగాణ సాంస్కృతిక పదకోశం' నిర్మాణంలో భౌతికంగా డా॥ఎస్. చంద్రయ్య చేసిన కృషి గురించి కాదుగానీ, భావనా ప్రపంచంలో పాదాలు దాటిన నదుల లోతేమిటి, రాతి బండల మీది కంటే, కాగితాల కిటికీల కంటే భిన్నమైనదేదో జనాచారాల్లోని పండుగల్లో, జాతరల్లో నిర్వికల్ప భావాల అవశేషాలుగా మిగిలిపోయినదేమిటి అన్నదే చర్చనీయాంశం. గడిచిన వందేళ్లలో కవిత్వం, కథ, నవల, నాటకం మొదలైన సాహిత్యాది రూపాల్లో జరిగిన ప్రత్యామ్నాయ ప్రయత్నాలను చూశాం. విలోమ రాజకీయాల అవగాహనా పరిధి ఇంకా తెలుగు భాషారాజకీయాల ఆవరణలోకి సంపూర్ణంగా ప్రవేశించలేదు. మరీ ముఖ్యంగా అనువాద శాస్త్రం, నింఘంటు నిర్మాణ శాస్త్రాల్లోకి. డా॥ ఎస్. చంద్రయ్య ఒక సాహసోపేతమైన అపూర్వ కృషి చేశాడు. సరికొత్త నిఘంటువును నిర్మించాడు. సాహిత్య విమర్శలో కొత్తగొంతుగా ముందుకు వస్తున్న ఇమ్మిడి మహేందర్ సహకారం ఈ పుస్తకాన్ని మరింత బలోపేతం చేసింది. ఇది ప్రాజెక్టు రూపంలో తెలంగాణ సాహిత్య అకాడమీకి 2019లో సమర్పించిన కృషి. దీన్ని పుస్తకంగా తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించి, ముద్రించిన తెలంగాణ సాహిత్య అకాడమీ చొరవ అభినందనీయం. తెలంగాణ గణసమాజపు మూలాల్లోకి మీకు సాదర ఆహ్వానం.

**★ రచయిత: కవి, విమర్శకులు**

# దళిత జీవన చిత్రణ 'పాలేరు'

● డా|| బండారి ప్రేమ్‌కుమార్

సామాజిక స్పృహతో మానవత్వమే ప్రాతిపదికగా, సమసమాజ రూపకల్పనే ధ్యేయంగా రచనలు చేసినవారిలో బోయి భీమన్నని ప్రముఖంగా పేర్కొనవచ్చును. అక్షరమనే ఆయుధమే సమాజాన్ని పురోగమన దిశలో పయనింపచేయగలదనే వాస్తవాన్ని బలంగా విశ్వసిస్తారు గనుకే వీరి రచనల్లో విద్యా ప్రాముఖ్యతను తెలిపే అంశాల్ని జోడిస్తారు. మానవతావాదమే ప్రధానంగా కల్పిస్తున్న ఆయా అంశాల్ని, సమాజ తీరుతెన్నులను ఎంతో నిశితంగా పరిశీలిస్తూ, రచనలు చేయటం వీరి ప్రత్యేకత. 1911 సెప్టెంబర్, 19న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురులో నాగమ్మ, పుల్లయ్య దంపతులకు బోయి భీమన్న జన్మించారు. పాలేరు కుటుంబంలో పుట్టి, దళితునిగా ఎన్నో అవమానాలు, అంటరానితనాన్ని అనుభవించినా అవేవీ లెక్క చేయకుండా ఎన్నో ఒడిదుడుకులతో ఉపాధ్యాయ వృత్తిని సంపాదించుకున్నారు. తనకంటూ ఒక ఉన్నతస్థాయిని ఏర్పర్చుకున్నాక సమాజంలో మార్పుకై ముఖ్యంగా దళితుల జీవితాల్లో పరిణతికై తన రచనా ప్రస్థానాన్ని ప్రారంభించి, సాహిత్యంలో వివిధ ప్రక్రియలైన పద్యం, గద్యం, గేయం, నాటకం, నాటిక, వచన కవిత వంటి పలు సాహిత్య ప్రక్రియల్లో 70కి పైగా రచలను చేసిన సాహితీ ధురంధరుడు. బోయి భీమన్న. వారి రచనా పటిమకుగాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు.

దళితుల అభ్యున్నతికై అంబేద్కర్ భావజాల దృక్పథం వీరి రచనల్లో కనిపిస్తుంది. వారి ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా రచనలను చేసారు. కులనిర్మూలనే ప్రధానాంశంగా రాగవాశిష్టం, పాలేరు, కూలిరాజు వంటి రచనలు చేశారు.

సాహిత్యాన్ని విస్తృతం చేసేందుకై బోయి భీమన్న సాహిత్య పీఠాన్ని ఏర్పాటుచేసి రచనలు ప్రచురిస్తూ, బోయి భీమన్న సాహిత్యపీఠం పేరిట ఉత్తమ రచనలకు పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు.

సాహిత్య కృషి పరమావధిగా ఉన్న బోయి భీమన్న రచనలను విశ్లేషిస్తే, వారి దృక్పథం, రచనా నైపుణ్యం మనకు అవగతమవుతాయి. పాలేరు నాటకాన్ని బోయి భీమన్న 1940లో రాశారు. తెలుగు సాహిత్యంలో అజరామరమైన నాటకంగా పాలేరు నాటకాన్ని పేర్కొనవచ్చును. సాహిత్యంలో ఏ ప్రక్రియ అయినా ప్రధానంగా పాఠకుల్లో ఆనందాన్ని కలిగించాలి. ఆనందంతోపాటు అంతర్లీనంగా ఉపదేశాన్ని కూడా అందించాలి. ఆ ఉపదేశం సమాజానికి హితాన్ని కలిగించాలి. అలా కలిగించినట్లయితే ఆ ప్రక్రియ సామాజిక ప్రయోజనం నెరవేరినట్లవుతుంది. ఆ ప్రక్రియే సమాజంలో నిలబడుతుంది. అటువంటి సామాజిక ప్రయోజనాన్ని ఆశించి సమకాలీనతపై స్పందిస్తూ, బోయి భీమన్న పాలేరు నాటకాన్ని రాసారు.

పాలేరు నాటకంలో భూస్వామ్య వ్యవస్థ, పాలేరు జీవిత చిత్రణ ఎంతో వాస్తవికంగా చిత్రించబడ్డాయి. చదువుకు నోచుకోని కుటుంబంలో పుట్టిన వెంకన్న, ఒక ఆదర్శమూర్తి అయిన ఉపాధ్యాయుడు ఉపకారి వంటి కొంతమంది సహకారంతో ఎన్నో ఆటుపోటులు, ఎన్నో అవమానాలు ఎదుర్కొని, చదువు పూర్తిచేసుకుని డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్నతస్థాయి హోదాలో తిరిగి తన ఊరికి రావటం కథాంశం.

కామందుల దాష్టీకాలు, పాలేర్ల వ్యవస్థ చదువు పట్ల ఆనాటి సమాజంలో పేరుకుపోయిన మూఢ విశ్వాసాలు వంటి పలు అంశాల్ని ఈ నాటకంలో ఎంతో లోతుగా రచయిత ఆవిష్కరించారు. ఈ నాటకంలో ఒక సున్నితమైన భావోద్వేగపూరితపు ప్రేమ అనే కోణాన్ని జోడించి వనబాల, వెంకన్న పాత్రల ద్వారా వర్ణాంతర వివాహాన్ని చూపించే ప్రయత్నం చేశారు. కులం, అంటరానితనం అనేవి సమాజంలో నిర్మూలించబడాలంటే అవి కొంతవరకు వర్ణాంతర వివాహాల ద్వారా సాధ్యం అవుతాయనే విషయాన్ని ఈ నాటకంలో వెల్లడి చేశారు.

పాలేరుగా ఉన్న వెంకన్న చదువుకుని ప్రయోజకుడై, డిప్యూటి కలెక్టర్ హోదాలో వెంకటేశ్వరరావుగా రావటం ఎంతగానో అవమానించినవారే తనని గౌరవించటం, మర్యాదలివ్వటం వంటి అంశాల్ని నాటకంలో చొప్పించినపుడు "విద్య ద్వారా మాత్రమే దళితుల జీవితాల్లో మార్పులు వస్తాయని, సామాన్య దళితుల్లో సామాజిక చైతన్యం చదువుకుంటూనే సాధ్యమనే వాస్తవాన్ని రచయిత తెలియపర్చారు.

భూస్వాములు అంటేనే చెడ్డవారని, ఆ వర్గాన్ని కించపరచడానికే నాటకం రాయలేదని, వాళ్ళలో కూడా మానవత్వం ఉంటుందని చెప్పడానికి వనబాల, సుందరం వంటి పాత్రల్ని, వారి వ్యక్తిత్వాల్ని, వారి విశాల దృక్పథాన్ని రచయిత తెలియజేశారు.

సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయిని పాత్ర ఎంతో కీలకం. "తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మించబడుతుందని ప్రముఖులు ఉంటంకిచినట్లుగా ఈ నాటకంలో ఉపాధ్యాయుడు 'ఉపకారి' పాత్ర ఎంతో ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. ఆనాటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా అందులో దళితుల్ని విద్యావంతులుగా తీర్చిదిద్దటం అనేది కత్తిమీదసాము లాంటి ప్రయోగమే అని చెప్పవచ్చు. అయినప్పటికీ కామాంధులకు వ్యతిరేకంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని విద్యార్థుల్ని విద్యాధికులుగా చేసి సఫలీకృతులవ్వటం అందుకు నిదర్శనంగా వెంకన్న కన్పిస్తాడు. పాలేరు నాటకం ఆశించిన సామాజిక ప్రయోజనాన్ని సాధించి సుఖాంతంగా ముగుస్తుంది.

నాటకంలో సహజమైన పాలేర్ల వృత్తి సంబంధ తూర్పు గోదావరి మాండలిక యాసకు సంబంధించిన పదజాలం ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి నాటకం అంతా సహజంగా ఆయా సంభాషణలతో మనకళ్ళముందు సాక్షాత్కరించింది.

ఆనాటి సమాజంలో తన పుత్రుడి పురోభివృద్ధి కోరిన ఉపకారిని తండ్రి పుల్లయ్య ఎంతగానో అవమానపర్చినప్పటికీ, వారిలోని అమాయకత్వాన్ని చూసి జాలిపడ్డాడే తప్ప వెంకన్న మీదగాని, పుల్లయ్య మీదగాని ద్వేషాన్ని పెంచుకోలేదు. ఉపాధ్యాయుడిగా ఎంతో సంయమనంగా సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, ఆ గ్రామంలో అక్షరజ్యోతుల్ని వెలిగించాలని చూస్తాడు. "ఈ కాలేజిలో పట్టణ వీధుల్లో విహరిస్తున్న నా అదృష్టానికి కారకులు, ప్రోత్సాహకులు ఆ పంతులుగారు, ఆ బాల, ఆ పాలేరుతనం కుళ్ళులోంచి అభ్యుదయగతి చూపిన ఆ ఇద్దరికి నేను జీవిత కాలమంతా కృతజ్ఞుణ్ణయి ఉంటాను" (పాలేరు, పుట 73).

పై మాటలను విశ్లేషించుకుంటే దళితుల్లో అక్షరజ్ఞానం లేకపోయినప్పటికీ సంస్కారం, ఇచ్చిన మాటకు కట్టుబడే తత్త్వం, మేలు పొందినవారికి కృతజ్ఞులయి ఉంటారని తెలుస్తుంది. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా, తమ అభ్యున్నతికి కారకులైనవారిని విస్మరించకపోవటం అనే సుగుణం వారిలో ఎక్కువగా కనిపిస్తుంది.

కామందు కుబేరయ్య తన పొలంలో పని చేసే సీతకు మధ్య జరిగిన సంభాషణని గమనిస్తే–

"నేను కామందుని. కామందంటే సగం మొగుడు.
ఒడబడ్డోళ్ళకి పూర్తిగా మొగుడే.
నా కమతంలో అడుగు పెట్టనివ్వను.
అడుక్కు తింటాం" (పాలేరు, పుట 49)

జమీందారి వ్యవస్థలో కుబేరయ్య లాంటి దుర్మార్గుల మనస్తత్వాల్ని, వారి దురాగతాల్ని తెలియచేస్తూనే దళిత స్త్రీ అయిన సీత పాత్ర ఔన్నత్యాన్ని తెలియజేస్తూ తిండి లేకున్నప్పటికీ ఆత్మాభిమానమే ఆయువుగా జీవించే దళిత స్త్రీ అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ, దళిత స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను ఈ నాటకంలో ఆవిష్కరించారు.

రచయిత బోయి భీమన్న ఈ నాటకంలో వాడిన భాష ఎంతో సహజసిద్ధంగా, వాస్తవికంగా ఉన్నప్పటికీ వాక్య నిర్మాణాల్ని, కొన్నిచోట్ల పాత్రల సంభాషణల్ని గమనిస్తే, ఆ పదజాలం, ఆ పాత్రల వ్యక్తిత్వాన్ని పరిధిని మించిపోయి అసహజంగా అన్పిస్తాయి. వెంకన్న పాత్ర వయస్సు రీత్యా అతని పరిధిని దాటి వ్యాఖ్యానాలు చేయడం కొంత అసహజంగా తోచాయి.

రచయిత ఒక రచన చేస్తున్నప్పుడు రచన చేస్తున్న సందర్భంలో తనకు అభిమానం గల పాత్ర పట్ల కొంతవరకు తన భావాల్ని అప్రయత్నంగా చొప్పించే ప్రయత్నం చేస్తాడు. ఇదంతా రచయిత రచనలో మమేకం అయినప్పుడు మాత్రమే చేయగలుగుతాడు. కాబట్టి బోయి భీమన్న పాలేరు నాటకంలో ఒక గొప్ప రచనా శిల్పం దాగి ఉందని చెప్పవచ్చు.

నాటక లక్షణాల్లో కథానాయకుడికి ప్రధానంగా ఉండవలసిన లక్షణం ధీరత్వం. కానీ ఈ నాటకంలో కథానాయకుడు వెంకన్నలో కొన్ని సందర్భాల్లో ఆ ధీరత్వం లోపించినట్లుగా అన్పించినప్పటికీ కాలగమనంలో పరిస్థితులు అనుకూలించేలా మలిచి అతడు నాయకుడిగా ఎదిగే క్రమంలో కథను సుఖాంతంగా మలిచారు.

**ఆధార గ్రంథాలు**


1. అప్పారావు, పోణంగి. తెలుగు నాటక వికాసం, ప్రథమ ముద్రణ, 1967, శివాజీ ప్రెస్, సికింద్రాబాద్.

2. నాగభూషణశర్మ, మొదలి. నాటక శిల్పం, ద్వితీయ ముద్రణ, 2013, క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్, నల్లకుంట, హైదరాబాద్.

3. భీమన్న, బోయి. పరిణతవాణి ప్రసంగం, 1995, తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాద్.

4. భీమన్న, బోయి. పాలేరు నాటకం, పందొమ్మిదవ ముద్రణ, 1988, సాహితీనిధి పబ్లికేషన్స్, హైదరాబాద్.


★ **రచయిత:అధ్యాపకులు,** తెలంగాణ సారస్వత పరిషత్

# పల్లె మొత్తం పట్నంబోతుంది

రవి కుర్మకోర్

నాగయ తాతా..! ఓ... నాగయ తాతా..! మంచిగున్నావే..?

మంచిగున్ననవ్వా..! ఓల్లోగని జెర్ర నజరాంతలేదు, ఏర్పటుజేస్తలేనవ్వా..!

నన్ను యాదిమర్సినవా తాతా..? నేను సీతమ్మని.

నువ్వా సీతమ్మా, గిట్లున్న తల్లీ. అటు సావలేక, ఇటు బతుకలేక.

సెట్టుకింద గట్లవన్నవేందేమరి..? సూసెటోల్లకు బుగులయెటట్టు.

ఏమన్న కడుపులకు సల్లవడ్డవా..? లేదా..? కండ్లు పురాగ లోతులకొయినయ్!

యాడిది తల్లీ సలిదో బొలిదో నిన్న గోజలచ్చే యాల్లకే దిని ఒరిగింటి బిడ్డా!

కడుపుల ఆకలోలయ్యేమో గొరిసెకొయ్యలు పొడిసె యాల్లకు తెల్వికయింది.

పక్కబొంతల మీద ఎంతసేపు బొర్రినా, ఎంత తండ్లాడిన నిద్రనేవట్టలే.

ఈ సెట్టుకిందికొచ్చి ఒరిగిన. ఎండపొడ ఎల్లినకమాన ఎచ్చగ కన్నంటుకుంది.

అట్లనే కండ్లు మూతలువడ్డయ్. నువు లేపెదాక మర్ర క్యాలికేరాలే..!

లెవ్వు తాతా! లేసి ఇంటిమొఖానవొయ్యి ఇంత సల్లవడుపో..!

ఇంటికొయ్యి ఏంజేస్త తల్లీ..! ఈడుంటెనన్న ఇంత ఇసారం దెలుస్తది.

ఇసారమేందే..? ఇసారం. ఇప్పుడు నీకు ఏం ఇసారం దెల్వాల్నే..?

పదిగొట్టంగ పైసలిస్తరంట బిడ్డా..! ముసలోల్ల ఫించన్ పైసలిస్తరంట.

ఓ... అదా ముచ్చట! పైసలకోసవే నువు ఈడ పానశరంవడుతున్నవా..!

పైలువొయ్యి రెండు అంగలయ్యింది తల్లీ..! ఈ నెలలింకా ఫించన్ పైసలియ్యలే..!

ఫించన్ ముచ్చట పోరగాండ్లనువంపి తెల్సుకరమ్మందాంగని,

ఇంటిమొకానవొయ్యి ఇంత బువ్వదిని రాపో తాతా..!

ఇంటిదిక్కువోతే మళ్ల ఇసంతకు రాకట తీరదనే ఈడపన్నబిడ్డా..!

ఎందుకు తీరదు తాతా..? ఇంటికాడ ఏమన్న ఇద్వని పనున్నదా..?

కుండలింత కూడుడుకేసుకొని, కడుపుకుదినేసరికి మస్తు యాల్లైతది తల్లీ..!

అగో..! నువు ఉడుకేసుకునుడేందే..? ఇంట్ల కొడుకు, కోడలు లేరా..?

యాడి కొడుకు, ఇంకెక్కడి కోడలు! పోరగాండ్లు, బీరగాండ్లు



ఓళ్లులేరు.

యాడికొయ్యిరే..? అందరుగల్సి బదురుకున్నట్టు ఏదైన ఊరుగ్గిట్లవొయ్యిరా?

ఊరుగ్గాదు, బీరుగ్గాదు. పద్దినాలకింద అందరు పట్నం తొవ్వవట్టిర్రు...

పట్నమెందుకొయ్యిర్రు తాతా..? పనిలేకవొయ్యిర్రా..? పనికోసంవొయ్యిర్రా..?

పనికొరకేవొయ్యిర్రు. ఈడ పైనలేదని... ఆడ పనికొరకువొయ్యిర్రు.

పట్నంబోయి బతుకుడంటే ఊకెనే అయితదనుకున్నారా తాతా..!

'అంగట్ల అవ్వా అంటే నువ్వెవరు బిడ్డా'... అన్నట్టయితది.

ఇల్లొకతాడా..! పిల్లొకతాడ, పనొకతాడ..! పైసొకతాడ.

పిల్లజెల్లను బెట్టుకొని పట్నంల బతుకుడంటేనే పానాలకు మస్తు తక్లీబైతది.

మావోళ్లేకాదు తల్లీ... మనూర్ల మస్తు ఇండ్ల తలుపులకు తాళాలువడ్డయ్..!

కిందాడకట్టుకు మూడిండ్లోల్లు, మీదాడకట్టుకు ఆరిండ్లోల్లు...

ఊర్లె అటిటు జూసిన వది, పన్నెండిండ్లోల్లు పట్నంతొవ్వవట్టినట్టే..!

పల్లెనిడిసి పట్నంగడ్డెక్కుడంటే అంత అలుకగేంగాదు తాతా..!

ఊరుదాటిన అడుగు ఎనకకు మర్రాలంటే ఎన్ని తంతెలు దిగాల్సొస్తదో..!

పుట్టినూరు ఓళ్లకయినా కన్నతల్లసొంటిదంటరు గదబిడ్డా..!

అసొంటి కన్నతల్లినిడిసి కాటగలవాలని ఓళ్లకుంటదవ్వా..!

కడవలున్న సుకం కాశికిబొయిన దొరకదని ఎన్కటోల్లందురు.

అయినోల్లందర్నిడిసి ఆగమవ్వాలని ఒళ్లు అనుకోరుగదమ్మా..!

నడుమంత్రపు సిరులొచ్చి మనుసులు నాశనమైపొతుర్రు తాతా!

ఇరవైఏండ్ల ఎనక ఇట్లున్నదా బిడ్డా ఊరు, ఊర్ల జనాలు..!

అడివంచుకు పుట్టిన ఊర్ల అద్దమోలె సెరువులుండేటియ్,

ఆటపాటలతోని అడుక్కతిని బతికె కులాలోల్లకు ఆసరయినూరు,

అన్ని కులాలోళ్లుగ్గూడ అన్నదమ్ములెక్కున్నూరు,

కొడల్ని దెచ్చుకోవాలె, బిడ్డెను ఎత్తియ్యాలని అనుకునేటూరు,

మాపటికి గతిలేనోళ్లగ్గూడా మర్రిమానోలే నీడనిచ్చినూరు,

సేసుకతిని బతికెటోల్లకు యాడాదిపొడవున పనిగల్ల ఊరు,

కరువు, కాటకాలు దెలిసిందిలేదు, కడుపులు ఎండిందిలేదు

నిబ్బరం ఎండల్లగూడ నీల్ల సెలిమెలు ఊరి పారేటియ్.

జానెడు లోతుల్నే నీల్లు పాతలగంగోలే పైకి ఎగజిమ్మేటియ్,

బతుకమ్మల మీద సికిలవేంలే, గుట్టలనడుమ బొడ్డెమ్మెలుండేది.

ఎంత సక్కని వూరుకు, ఏం గాలిసోకిందో..? ఏం పీడవట్టిందో..?

దీపమారిపోయిన దేవునిగుడిలెక్కయ్యింది.

సక్కదనపు వూర్ల సావుజొచ్చినట్టెందుకైతుంది తాతా..?

'ఏమిరా ఎగురతలెవ్వంటే పందిరెత్తుగలేదన్నడట' నాయసోంటోడు.

గట్లుంది ఇప్పటి నరలోకం తీరు ఈ రోజు రేపట్ల.

ఎన్కట్ల మనుసుల తరువాయి గిట్లుంటుండెనా బిడ్డా..?

మస్కుండ లేసిన మనిసికి పొలం పన్లల్లనే పొద్దువొడిసేది.

పొద్దుగల్ల సద్దిబువ్వదిని నడుంవంచిరంటే..! సేన్లల్లనే సీకటయ్యేది.

ఇద్దరితిండి ఒక్కొదుదిని, నలుగురిపని ఒక్కొల్లే జేసేటోల్లు.

ఇప్పటి జమాన్ల పనుందంటే గునుస్తరు, పైసలంటే మురుస్తరు.

కూరుకురాత్రిదాక దినరు, నడిజామురాత్రిదాక వండరు.

ఇయ్యాలరేపు మనుసులు పొద్దు నాలుగు బారెలెక్కేదాక లెవ్వరు.

పనుందని పిల్వవోతే పత్తలేకుండా దెంకపోతరు

దావత్కనుజెప్పు ఒక్కరిని విలిస్తే ఇళ్లంత దర్జాగొస్తరు.

పులిన్జూసి నక్కవాతలుబెట్టుకున్నట్టు బతుకుతుర్రు.

అయినోళ్లతో కొంటిర్కమై కానోళ్లతో కమ్మగైతుర్రు.

నేన్జెప్పేదేందంటే..? నియ్యతెంతనో బర్కంతంతా తల్లీ..!

ఎవల నశీబు ఎట్లుందో తాతా..! అమాస, వున్నం సెరికొన్నిదినాలు.

ఎండపొడగుడ ఎక్కువయ్యింది బిడ్డా..! కండ్లతోని కనుబొమ్మలు జూడస్తలేదు.

పదిగొట్టిందంటే పైసలిచ్చుడు సురువుజేస్తరని దెలిసింది.

పొయ్యొస్త సీతమ్మ..! గా..! పంచాదాపీసుమొకాన పొయ్యొస్త.

పైసలో... పైసలో... అని పానంబొయినట్టు జెయ్యవట్టివి.

కర్చువెట్టుకున్నోడివిగాదు, కడుపుకు కమ్మగ దిన్నోడివిగాదు.

కాట్లకొయ్యినప్పుదేమన్న కట్టగట్టుకపోతవా తాతా..!

ఊరువొమ్మంటుంది, బొందలగడ్డ రమ్మంటుంది తల్లీ..!

ఎప్పుడువోతదో తెలవని పానానికి ఏం దింటే ఏం పాయిద బిడ్డా..!

సాకలేకనే సంసారం నెత్తిమీదెత్తుకొని పట్నంబొయిందు నా కొడుకు.

నేను సచ్చినాదన్న నా సావుముల్లె కర్సులకు పంజేస్తేజాలని,

కడుపుజంపుకొనయినా కాయం జేస్తున్న తల్లీ ఈ నాలుగు రూపాలను.

✶ రచయిత: తెలుగు అధ్యాపకుడు డిగ్రీ & పి.జి. కళాశాల, కామారెడ్డి

# దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు-తులనాత్మక పరిశీలన


డా. ఎం.శంకర్

**పరిశోధన శీర్షిక :** (Title of the Research)

దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో అధికార భాషలుగా ఉన్న తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలను ఉద్దేశించి పరిశోధన శీర్షికలో "దక్షిణ భారతీయ భాషలు" అన్న పదాన్ని వాడాను. దక్షిణ భారతీయ భాషలలో నవల మొదట తెలుగు భాషలోనే ఎందుకు వచ్చి ఉండకూడదు? నవల ఆవిర్భావ పూర్వ పరిస్థితులు తెలుగులో ఉన్నట్లే మిగిలిన దక్షిణ భారతీయ భాషలలో కూడా ఉన్నాయా? ఎలాంటి సామాజిక పరిస్థితుల మధ్య ఆనాటి రచయితలు తొలి సాంఘిక నవలలని రచించారు? తెలుగు ప్రాంతంలో ఉన్న దురాచారాలు, కట్టుబాట్లు తమిళ, మలయాళ, కన్నడ ప్రాంతాలలో కూడా ఉన్నాయా? వంటి ఊహాప్రతిపాదిత అంశాల భూమికగా పంతొమ్మిదవ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో ఉన్న సామాజిక పరిస్థితులని సాహిత్య రచనల ప్రాతిపదికగా వివరించాలన్న (పరిశోధన సమస్య) ఉద్దేశంతో "దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు తులనాత్మక పరిశీలన" అనే అంశంపై పరిశోధన చేసాను. ఈ పరిశోధన ఆచార్య జి. అరుణకుమారి పర్యవేక్షణలో పూర్తిచేసి 2021లో తెలుగు శాఖ, హైద్రాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించాను.

**2. పరిశోధనాంశ సైద్ధాంతిక నేపథ్యం** (Back ground of Research)

"కందుకూరి వీరేశలింగంపంతులు రాజశేఖర చరిత్ర(తెలుగు) – గుల్వాడి వెంకటరావు ఇందిరాబాయి(కన్నడ) నవలలు – తులనాత్మక పరిశీలన" అనే అంశంపై నేను పరిశోధన చేసి హైదరాబాదు విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్ పట్టా పొందాను. ఈ పరిశోధనలో కన్నడ కన్నా ముందే తెలుగులో నవల ఆవిర్భవించిందని నిరూపించాను. నాకు తెలుగు భాషతోపాటు కన్నడ, మరాఠీ, హిందీ భాషలతో పరిచయం ఉండటంవల్ల భారతీయ భాషలలో తొలి నవల తెలుగులో ఎందుకు వచ్చి ఉండకూడదు అన్న ప్రశ్న నాలో ఉదయించింది. ఈ ప్రశ్నకి సమాధానాన్ని కనుక్కునే క్రమంలో సి.ఎన్. రామచంద్రన్ రచించిన The early novels in south



dakṣiṇa bhāratīya bhāṣalalōni toli sāṅghika navalalu - tulanātmaka pariśīlana

(telugu, kannaḍa, tamiḻaṁ, malayāḷaṁ)

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfillment of the Degree of Doctor of Philosophy in Telugu)

Researcher
M SHANKAR
13HTPH05

Supervisor
Prof. G. ARUNAKUMARI

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad - 500 046
Telangana, India
March-2021

India (2001) అన్న పుస్తకం ద్వారా పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చిన కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ నవలల మధ్య సామ్యం ఉన్నట్లు తెలుసుకున్నాను. నా ఆలోచనలని మా పర్యవేక్షకులతో పంచుకున్నాను. మా పర్యవేక్షకుల సహకారం, సూచన మేరకు "దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు-తులనాత్మక పరిశీలన" అనే అంశాన్ని పరిశోధనకి ఎన్నుకున్నాను.

**3. పూర్వ పరిశోధనల సమీక్ష** (Review of literature)

తెలుగు నవలా సాహిత్యాన్ని ఇతర భాషల నవలా సాహిత్యంతో తులనాత్మకంగా పోలుస్తూ, అనేక పరిశోధనలు వచ్చాయి. "ఆధునిక తమిళ, తెలుగు సాంఘిక నవలల్లో దళిత సమస్యలు'' (ఎన్. వజ్రవేలు – శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం), తెలుగు, కన్నడ సాహిత్యాలలో మనోవైజ్ఞానిక నవలలు తులనాత్మక పరిశీలన" (టి. రాజశ్రీ మీనలోచన (2009) – బెంగళూరు విశ్వవిద్యాలయం). "తొలి తెలుగు తమిళ నవలలు తులనాత్మక పరిశీలన'' (ఎం.మోహన రామయ్య(1985)–మద్రాసు విశ్వవిద్యాలయం). ఈ

పరిశోధనలు తెలుగు నవలలని ఇతర భాషా నవలలతో పోలుస్తూ వచ్చిన సిద్ధాంత గ్రంథాలకు కొన్ని ఉదాహరణలు.

**4. పరిశోధన పద్ధతి** (Methodology)

దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలని తులనాత్మక (Comparative) పరిశోధన పద్ధతిని అనుసరించి పరిశీలించడం జరిగింది. "ఒక వస్తు స్థితిని సాదృశ్యమైన వాటితో పోల్చి సర్వ సమాన సూత్రాలనావిష్కరించడం తులనాత్మక పరిశోధన". (లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 2017: 12). ఏక కాలంలో తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలలో వచ్చిన తొలి సాంఘిక నలలలోని వస్తు స్థితిని పోల్చి చూసి, సాదృశ్య అంశాలను ఈ పరిశోధనలో వివరించడం జరిగింది.

**5. పరిశోధన ఉద్దేశం, లక్ష్యం** (Aims & Objectives)

ఒక నిర్దిష్టకాలానికి సంబంధించి సామాజిక అంశాలని తెలుసుకోడానికి చరిత్ర గ్రంథాలతోపాటుగా సాహిత్య రచనలు కూడా తోడ్పడతాయని నిరూపించడం ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం. దక్షిణ భారతదేశంలో పంతొమ్మిదవ శతాబ్దంలో ఉన్న సామాజిక పరిస్థితులను తెలుసుకోడానికి ఈ పరిశోధన ఉపకరిస్తుంది. తొలి సాంఘిక నవలల నిర్మాణాన్ని, నవల ప్రారంభ కాలంనాటి పరిస్థితులని ఈ పరిశోధనద్వారా తెలుసుకోవచ్చు.

**6. పరిశోధన ప్రణాళిక** (Chapter division)

ఈ పరిశోధనాంశాన్ని ఎనమిది అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

**1. దక్షిణ భారతీయ సాహిత్యం- నవల.**

**2. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు - రచయితలు సామాజిక నేపథ్యం - తులనాత్మక పరిశీలన.**

**3. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు- ఇతివృత్తం - తులనాత్మక పరిశీలన.**

**4. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు- పాత్రచిత్రణ- తులనాత్మక పరిశీలన.**

**5. దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు- సామాజికాంశాలు.**

**6. ముగింపు.**

**7. పరిశోధన ఫలితాలు.**

**8. ఉపయుక్త గ్రంథ సూచి.**

**7. పరిశోధన ఫలితాలు**

ఈ కింది అంశాలని ఈ పరిశోధనలో సైద్ధాంతికంగా నిరూపించడం జరిగింది.

1. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో నవల ఆవిర్భావానికి పూర్వం ఒకే విధమైన సామాజిక పరిస్థితులు ఉన్నాయి.

2. దక్షిణ భారతీయ భాషలలో తొలి సాంఘిక నవల తెలుగులో వెలువడింది.

3. విశ్వజనీనత, చిత్తరంజకత, సంభావ్యతా వంటి నవల కథా లక్షణాలు దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలన్నింటిలో కనిపిస్తాయి.

4. పంతొమ్మిదవ శతాబ్దంనాటి సామాజికాంశాలకు దర్పణంగా దక్షిణ భారతీయ భాషలలోని తొలి సాంఘిక నవలలు వెలువడ్డాయి.

**8. భావి పరిశోధకులకు సూచనలు**

భారతీయ సాహిత్యంలో తొలి నవల తెలుగులో వచ్చిందని నిరూపించాలన్న సంకల్పంతో ఈ పరిశోధనని ప్రారంభించాను. అనేక పరిశోధనా గ్రంథాలని చదివిన తరువాత, తమిళనాడు, కేరళ, కర్నాటక ప్రాంతాలని సందర్శించి, అక్కడి పరిశోధకులతో మాట్లాడిన తరువాత భారతీయ సాహిత్యంలోకాక దక్షిణ భారతీయ సాహిత్యంలో తొలి నవల (కంబుకంధరచరిత్ర-1866) తెలుగులో వచ్చిందని తెలుసుకున్నాను. ఈ కంబుకంధరచరిత్ర(1866) నవల సేకరించే ప్రయత్నంలో నేను అనేక గ్రంథాలయాలు జల్లెడ పట్టడం జరిగింది. మద్రాసు లైబ్రరీ క్యాటలాగులో D.No. 433P Kambukundhara Charitra by Tadakamalla venkata Krishna Rao. D.No. 1401. P. Kamarupakatha by Tadakamalla venkata Kr1shna Rao అని పుస్తకాల పేర్లు ఉన్నాయి కాని పుస్తకాలు అందుబాటులో లేవు. ఈ నవల గురించి సంగిశెట్టి శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి, ముదిగంటి సుజాతరెడ్డి వంటి పరిశోధకులు పేర్కొన్నారు. కాని ఈ నవల నేటికి అందుబాటులో లేదు. ఫలితంగా నేను నా పరిశోధన శీర్షికలో తొలి నవల అన్న పదాన్ని తొలగించి తొలి సాంఘిక నవల అని మార్పు చేసుకోవల్సి వచ్చింది. భావి పరిశోధకులు ఎవరైనా కంబుకంధరచరిత్ర(1866) నవలను కనుగొని ముద్రిస్తే, తెలుగు నవల ప్రారంభ కాలం ముందుకు వెళ్ళే అవకాశం ఉంది.

**పరిశోధకుని వివరాలు:** డా. ఎం.శంకర్, ఎక్లారా (పెద్ద) గ్రామం, మద్నూర్ మండలం, కామారెడ్డి జిల్లా, ఫోన్:9642911727

★ **రచయిత: తెలుగు ఉపాధ్యాయుడు**

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376




Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007